సాహితీ (గత వారం దినాల పై విశ్లేషణ)
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-7-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 157 పేజీలు: 10+4 వెల: 6.50

ఐ సెట్-2025 పరీక్షల్లో 90.83 శాతం అర్హత 2

టెక్సాస్‌లో జలప్రళయం.. 82 మంది మృతి 5

# జాతీయ క్రీడలకు రెడీ

## ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణలో నిర్వహించండి



న్యూఢిల్లీలో సోమవారం కేంద్ర మంత్రి మాండవీయతో భేటీ అయిన సీఎం రేవంత్

### క్రీడాభివృద్ధికి రూ.100 కోట్లు ఇవ్వండి
### ఒలింపిక్స్‌లో రెండు గేమ్స్ నిర్వహిస్తాం
### కేంద్రమంత్రి మాండవీయతో సీఎం రేవంత్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై7:** ఖేలో ఇండియా గేమ్స్ 2026ను తెలంగాణలో నిర్వహించాలనికేంద్ర క్రీడలు, యువ జన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ ఎల్. మాండవీయకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖేలో ఇండియాతో పాటు జాతీయ క్రీడలు, జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్య మిచ్చే అవకాశాన్ని పరిశీలించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. కేంద్ర మంత్రి మన్‌సుఖ్ ఎల్.మాండవీయను ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. ఖేలో ఇండియా కింద క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణ, క్రీడా నిపుణులఎంపిక ఇతర కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు. భువనగిరిలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, రాయగిరిలో స్విమ్మింగ్ పూల్, మహబూబ్‌నగర్‌లోని పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో మల్టీపర్పస్ హాల్, హైదరాబాద్ హకీంపేట్ లో ఆర్చరీ రేంజ్, సింథటిక్ హాకీ ఫీల్డ్, ఎల్.బి.స్టేడియంలో స్క్వాష్ కోర్టు, నేచురల్ ఫుట్‌బాల్ ఫీల్డ్ అభివృద్ధి, సింథటిక్ ట్రాక్, గచ్చిబౌలిలో హాకీ గ్రౌండ్ నవీకరణ, నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణాలకు రూ.100 కోట్లు కేటా యించాలని కేంద్ర మంత్రి మాండవీయను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే క్రీడా వసతుల మెరుగుకు అన్నివిధాలా కృషి చేస్తోందని... కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం ఇవ్వాలని సీఎం కోరారు. >>2

వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు: సీఎం 2

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ స్టూడియో: సీఎం 2



బ్రెజిల్‌లోని రియోడి జనీరోలో జరిగిన బ్రిక్స్ సమ్మిట్‌లో పలువురు దేశాధినేతలతో ప్రధాని మోదీ

# ప్రపంచ శాంతిలో 'బ్రిక్స్' కీలకం

### ఉగ్రవాదులపై ఆంక్షలకు వెనుకంజ వేయలేం
### 'బ్రిక్స్' ముగింపు కార్యక్రమంలో ప్రధాని
### భారత్‌లో 2026 శిఖరాగ్ర సదస్సు

**రియోడీజెనీరో (బ్రెజిల్),జూలై 7:** ఉగ్రవాదులపై ఆంక్షలు విధించడంలో వెనుకాడకూడదని ఉగ్రవాద బాధితులు, మద్దతు దారులను ఒకే త్రాసులో తూకం వేయలేమని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని భారత ఆత్మ, గుర్తింపు, గౌరవంపై జరిగిన ప్రత్యక్ష దాడిగా ప్రధాని మోడీ అభివర్ణించారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి కేవలం భారత్‌కు మాత్రమే >>2

# 'క్రమశిక్షణ'లో తాత్సారం!



### కమిటీ భేటీ 10కి వాయిదా
### వరంగల్లు కాంగ్రెస్‌లో తారస్థాయికి విభేదాలు

**హైదరాబాద్, జూలై 7, ప్రభాత వార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటి సమావేశంపై అందరు ఆసక్తిగా చూస్తున్న సమయంలో సోమవారం ఆకస్మి కంగా ఆ సమావేశంను క్రమ శిక్షణకమిటీ చైర్మన్ మల్లురవి ఆకస్మికంగా వాయిదా వేశారు. కాంగ్రెస్ పార్టీ మంత్రుల నుంచి మొదలు కొని కార్యకర్తల వరకు ఇటీవల గాడితప్పి వ్యవ హరిస్తుండటంతో క్రమశిక్షణ కమిటీ సమావేశం అనివా ర్యంగా మారింది.వాయిదా వేసిన సమావేశంను ఈనెల 10 జరుపుతామని మల్లు రవి ప్రకటించారు. కాగజ్‌నగర్ కాంగ్రెస్ నాయకుడు రావిశ్రీనివాస్ మంత్రి సీతక్కను టార్గెట్ చేయడంతో ఇటీవల పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.పార్టీలో క్రమశిక్షణ రాహిత్యంను సహించమని ఇటీవల రాష్ట్రానికి వచ్చిన ఎఐసిసి నేతలు కూడా హెచ్చరించారు. మంత్రుల కూడా తమశాఖల పరిధిలో మాత్రమే ఉండాలని సూచించారు. ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికలపై,రేషన్‌కార్డుల జారీపై రాష్ట్రంలో కేబినెట్‌లో రెండో స్థానం అని తనకు తాను ప్రకటించుకొన్న మంత్రి విషయంలో కూడా టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్,ఎఐసిసి రాష్ట్ర ఇంచార్జ్ అసహనం ప్రకటించారు. ఇదిఇలా ఉంటే మరోవైపు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు ఉన్నారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం, వరంగల్ కాంగ్రెస్ పార్టీలో విబేధాలు తారా స్థాయికి చేరడంతో నేతల మధ్య నెలకొన్న వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించేందుకు సోమవారం గాంధీభవన్ లో టిపిసిసి క్రమశిక్షణ కమిటీ సమావేశం కావాల్సి ఉంది. అయితే, చివరి నిమిషంలో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లుగా కమిటీ చైర్మన్ మల్లు రవి ప్రకటించారు. తిరిగి సమావేశాన్ని ఈ నెల 10న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని వెల్లడించారు. వరంగల్లో నేడు కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరుగుతోన్న నేపథ్యంలో ఇవాళి పిసిసి క్రమశిక్షణ కమిటీ సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చిందని మల్లు రవి తెలిపారు. బనకచర్ల ఆపడానికి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖలు రాస్తే సరిపోదని, చంద్రబాబు కోవర్టులకు కాంట్రాక్టులు, కరెంటు కట్ చేయాలని అప్పుడే ఆంధ్రా పాలకులు తమ వద్దకు వస్తారని కామెంట్ చేశారు. తెలంగాణలో చంద్రబాబుకు కోవర్టులు ఉన్నారని వారు కట్టే బనకచర్ల ప్రాజెక్టును ఆపాలంటే వారికి నీటి కనెక్షన్లు, కరెంట్ కనెక్షన్లు కట్ చేయాలని అనిరుద్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కలిగించింది. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకుండా ఆపాలని, అప్పుడు ప్రాజెక్టు ఆటోమేటిక్ గా బనకచర్ల బంద్ అవుతుందని >>2

10న తెలంగాణ కేబినెట్ భేటీ 2



# జనగణన అంతా డిజిటల్!

### ప్రజలే స్వయంగా అప్‌లోడ్ చేసుకొనే అవకాశం
### ప్రత్యేక యాప్, పోర్టల్ రూపకల్పన

**న్యూఢిల్లీ, జూలై 7:** కేంద్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన జనగణనలో ప్రజలే స్వయంగా వివరాలు పొందుపుచుకునే సౌలభ్యం కల్పిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకమైన వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది. దేశ ప్రజల ఇళ్ల వివరాల సేకరణకు సంబంధించిన హెచ్‌ఎల్‌ఓ గణనతో పాటు జనగణన సమాచారాన్ని సేకరించేందుకు ఇదే పోర్టల్‌ను వినియోగించనుంది. జనగణనలో భాగంగా తొలి విడతలో హెచ్‌ఎల్‌ఓ గణన జరుగుతుంది. హెచ్‌ఎల్‌ఓ అంటే హౌజ్ లిస్టింగ్ అండ్ హౌజింగ్ సెన్సస్. ఈ గణనలో దేశ ప్రజల ఇళ్ల స్థితిగతులు ఎలా ఉన్నాయి ఇళ్లలో ఉన్న సౌకర్యాలు ఏమిటి దేశ ప్రజల ఆస్తిపాస్తుల >>2

# నవంబర్ తరువాతే టిజిపిఎస్‌సి నోటిఫికేషన్లు!



### ఇంకా పూర్తికాని గ్రూప్-1, 2 నియామకాల ప్రక్రియ
### మొదలు కాని గ్రూప్-3 సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, జులై7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) నుంచి నవంబర్ తరువాతనే నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అప్పటి వరకు కొత్త నోటిఫికేషన్లను ఇచ్చే అవకాశం కనిపించడం లేదు. ఇప్పటికే గ్రూప్-1, 2, 3, 4 నోటిఫికేషన్లను జారీ చేసి పరీక్షలను నిర్వహించిన టిజిపిఎస్‌సి ఫలితాలను ప్రకటించింది. అయితే వాటిలో కేవలం గ్రూప్-4కి సంబంధించిన నియామకాలను మాత్రమే కమిషన్ పూర్తి చేసింది. ఇప్పటికీ గ్రూప్-1 నియామకాల ప్రక్రియపూర్తి కాలేదు. ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్షలను పూర్తి చేసి ఫలితాలను ప్రకటించిన కమిషన్.. 1:1 నిష్పత్తిలో అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసినప్పటికీ కోర్టులో కేసులు కొనసాగుతున్నందున నియమకాలను చేపట్టలేదు.ఇక గ్రూప్-2 పరీక్షలకి సంబంధించి మెరిట్ అభ్యర్థులకి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేసిన కమిషన్ ప్రస్తుతం మెడికల్ పరీక్షలను కొనసాగిస్తోంది. ఈ నెల 11తో అవికూడా ముగియనున్నాయి. ఆ తరువాత గ్రూప్-2 అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్ల మేరకు నియమాకాలను పూర్తి చేయనుంది టిజిపిఎస్‌సి. ఇక గ్రూప్-3 అభ్యర్థులకు గత నెల 18 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కొనసాగించాలని కమిషన్ నిర్ణయించినప్పటికీ.. గ్రూప్-2 నియామకాల ప్రక్రియ పూర్తయిన తరువాత తమకి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కొనసాగించాలని గ్రూప్-3 అభ్యర్థులు కమిషన్‌కి విన్నవించడంతో.. జూన్ 18 నుంచి ప్రారంభం కావల్సిన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను వాయిదా వేస్తున్నట్టు కమిషన్ ప్రకటించింది. ఈ నియామకాల ప్రక్రియ పూర్తయితే కొత్తగా నోటిఫికేషన్లను జారీ చేయడానికి అవకాశం ఉంటుంది. అంటే ఇప్పటికీ గ్రూప్-1,2,3 నియామకాల ప్రక్రియ పూర్తికాకపోవడంతో అవి పూర్తయిన తరువాతనే గ్రూప్-1, 2, 3 పోస్టులకి నోటిఫికేషన్లను జారీ చేయడానికి అవకాశం ఏర్పడనుంది. ఇక ఇప్పటికే గ్రూప్-4 నియామకాల ప్రక్రియ పూర్తయినందున కొత్తగా గ్రూప్-4 నోటిఫికేషన్‌ను జారీ చేయడానికి అవకాశం ఉంటుంది. అయితే రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వివరాలను ఇవ్వాలని టిజిపిఎస్‌సి ప్రభుత్వ శాఖలకు లేఖలు రాసింది. వాటిలో కొన్ని శాఖలు తమ పరిధిలో ఉన్న ఖాళీల వివరాలను అందించినట్టు తెలుస్తోంది. అయితే ఇంకా చాలా శాఖలు తమ >>2



# ఆగస్టు నుంచి అమెరికా సుంకాలు

### అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, జూలై 7:** వాణిజ్య భాగస్వామ్య దేశాలపై అధిక సుంకాలు విధించే విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదు. ముందుగా ప్రకటించినట్లే ఆగస్టు 1 నుంచి అధిక సుంకాలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన కొత్త టారిఫ్ రేట్ల వివరాలను జులై 9వ తేదీలోగా ఆయా దేశాలకు తెలియజేయనున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ఆదివారం వెల్లడించారు. పలు దేశాలతో వాణిజ్య ఒప్పందాలు ఖరారు చేసేందుకు అమెరికా తుది దశ చర్చలు జరుపుతోందని ట్రంప్ తెలిపారు. ఈ ఒప్పందాలపై త్వరగా నిర్ణయం తీసుకోని దేశాలకు సుంకాల పెంపు తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు సుమారు 12 దేశాలకు పంపేందుకు లేఖలు కూడా సిద్ధం చేశామని, అవి సోమవారం చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. "ఒక్కో దేశంతో కూర్చుని 15 రకాల అంశాలపై చర్చలు జరపడం కంటే, మీరు మాతో వ్యాపారం చేయాలంటే ఇది చెల్లించాల్సిందే అని లేఖలు పంపడం చాలా సులభం అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అధిక సుంకాల అమలు తేదీపై వాణిజ్య >>2

# గొర్రెలు, బర్రెలు నేనేం చేయాలి?



### కేటాయించిన శాఖలపై మంత్రి శ్రీహరి అసంతృప్తి
### గత పదేళ్లలో నాశనమైన శాఖలను తనకిచ్చారని ఆవేదన

**కరీంనగర్, ప్రభాతవార్త:** తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి తనకు కేటాయించిన శాఖలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత పదేళ్లలో పూర్తిగా దెబ్బతిన్న శాఖలను తనకు అప్పగించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తనకు కేటాయించిన ఐదు శాఖలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, వాటిని చూస్తుంటే ఇది తన అదృష్టమో లేక దురదృష్టమో అర్థం కావడం లేదని అన్నారు."పశుసంవర్ధక శాఖ మొత్తం గందరగోళంగా ఉంది. యువజన సర్వీసులు ఇచ్చి నన్నేం చేసుకోమంటారు? గొర్రెలు, బర్రెలు ఇస్తే ఏం చేసుకోవాలి?" అని మంత్రి శ్రీహరి నిరాశ వ్యక్తం చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అంతకుముందు కరీంనగర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి శ్రీహరి మాట్లాడుతూ.. క్రీడల అభివృద్ధికి పలు హామీలు ఇచ్చారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్‌తో పాటు, కబడ్డీ, హ్యాండ్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో కొత్త క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కరీంనగర్ క్రీడా పాఠశాలను ఇంటర్మీడియట్ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు.

# పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలా?




### కోర్టు తిడుతున్నా పట్టించుకోరా?
### తీవ్ర పరిణామాలు తప్పవు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై7:** బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణతో పాటు నాయకులు, కార్యకర్తలపై పోలీసులు దౌర్జన్యం చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని ప్రశ్నించారు. మంత్రి సీతక్క అనుచరుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న చుక్క రమేశ్ మృతికి నిరసనగా బీఆర్‌ఎస్ చేస్తున్న శాంతియుత ఆందోళనను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికం అని మండిపడ్డారు. పోలీస్ యాక్ట్ పేరుతో బీఆర్‌ఎస్ శాంతియుత నిరసనను అడ్డుకున్న ములుగు పోలీసులు, కాంగ్రెస్ నేతల పర్యటనకు మాత్రం పర్మిషన్ ఇవ్వడం చూస్తుంటే కొంతమంది పోలీసులు ఆ పార్టీకి తొత్తుల్లాగా పనిచేస్తున్నారన్న సంగతి అర్థం అవుతుందని కేటీఆర్ అన్నారు. అర్ధరాత్రి నుంచే ములుగు నియోజకవర్గం వ్యాప్తంగా గ్రామాలపై దొంగల లెక్క విరుచుకుపడ్డ పోలీసులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడం ఏం పోలీసింగ్ అని కేటీఆర్ మండిపడ్డారు. ఎవరి ఆదేశాల మేరకు దౌర్జన్యంగా ఇళ్లలోకి దూరి 2 వేల మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేశారో ములుగు పోలీసులు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలను వేధిస్తున్న కొంతమంది పోలీసులకు న్యాయస్థానాల్లో చివాట్లు పడుతున్నా ఇంకా సోయి రావడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసులు రాబోయే రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు. ములుగు నియోజకవర్గంలో తన సొంత రాజ్యాంగం అమల్లో ఉందని భ్రమిస్తున్న మంత్రి సీతక్క, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఇసుక అక్రమ రవాణా పేరుతో సీతక్క చేస్తున్న ఇల్లీగల్ దందాల గురించి ములుగులో >>2

# రేపు దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగుల సమ్మె

### కరెంటు సరఫరాకు అంతరాయం!



**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** విద్యుత్ పంపిణీ సంస్థను ప్రైవేటీకరించాలనే నిర్ణయంతో దేశ వ్యాప్తంగా అయా సంస్థల ఉద్యోగులు ఒక రోజు సమ్మెకు దిగుతున్నారు. రెండు విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించాలన్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 27 లక్షల మంది విద్యుత్ రంగ ఉద్యోగులు సమ్మె చేయనున్నారు. ఇది భారతదేశం అంతటా విద్యుత్ సరఫరాను ప్రభావితంచేస్తుందని విద్యుత్ పంపిణీ సంస్థలు అందోళన చెందుతున్నాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పూర్వాంచల్ విద్యుత్ విత్రన్ నిగమ్ లిమిటెడ్, దక్షిణాంచల్ విద్యుత్ విత్రన్ నిగమ్ లిమిటెడ్‌లను ప్రైవేటీకరించాలని నిర్ణయించింది. ఈ రెండు విద్యుత్ పంపిణీ సంస్థలు అ రాష్ట్రంలోని 75 జిల్లాల్లో 42 జిల్లాల్లో విద్యుత్ సరఫరా చేస్తాయి. జనవరి 12న జరిగిన రాష్ట్ర ప్రభుత్వ టెండర్ ప్రకారం, ఉత్తర ప్రదేశ్ తన నాలుగు విద్యుత్ పంపిణీ కంపెనీలలో రెండింటిని ప్రైవేటీకరించేందుకు చర్యలు చేపట్టింది. మరోపక్క ఈ పంపిణీ సంస్థలు నష్టాలతో పాటు, ప్రసార మౌలిక సదుపాయాల కొరతతో ఇబ్బంది పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో విద్యుత్ పంపిణీకి >>2

# మేడిగడ్డ బ్యారేజ్ 85 గేట్లు ఎత్తివేత



**హైదరాబాద్,జులై 7, ప్రభాతవార్త:** మహారాష్ట్రంలో భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నదికి వరద పోటెత్తింది. దీనికి తోడు తెలంగాణలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులు వంకలు పొంగిపోర్లుతున్నాయి. దీంతో గోదావరి నదిలో గంట గంటకు వరద ప్రవాహం పెరుగుతుండటంతో ఆ నదిపై ఉన్న అన్ని ప్రాజెక్టులు నిండుకుండలా మారిపోయాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు... కాళేశ్వరం ప్రాజెక్టు లో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజ్ లో 85 గేట్లను తెరిచి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.ప్రస్తుతం గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుందడంతో.. ఎరుపెక్కిన వరద నీరు దిగువకు పరుగులు పెడుతుంది. ఎగువ నుంచి మేడిగడ్డ బ్యారేజ్‌కు >>2




సోమవారం తిరువనంతపురంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఆందోళనలో బారికేడ్లను ఎక్కి నినాదాలు చేస్తున్న మహిళా కాంగ్రెస్ కార్యకర్త

## విద్యుత్ ఉద్యోగుల సమ్మె

>> బాధ్యత వహించే ప్రభుత్వ యాజమాన్యంలోని దక్షిణాంచల్ విద్యుత్ వితరన్ నిగమ్ మరియు పూర్వాంచల్ విద్యుత్ వితరన్ నిగమ్‌ను ప్రైవేటీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలను ఆహ్వానిస్తోంది. ఈ నేపథ్యంలో నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ అండ్ ఇంజనీర్స్ పిలుపు మేరకు, దేశవ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, జూనియర్ ఇంజనీర్లు, ఇంజనీర్లు డిస్కమ్‌ల ప్రైవేటీకరణకు నిరసనగా భారీ ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించారు. కాగా దేశంలోని చాలా రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు పాత ప్రసార వ్యవస్థలు కావడంతో తరచుగా విద్యుత్ నష్టాల కారణంగా నష్టాలను చవిచూస్తున్నాయి, దీని ఫలితంగా ప్రభుత్వం ప్రైవేట్ కంపెనీలను రంగంలోకి దింపుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 9న జరిగే ప్రదర్శనలు ప్రధానంగా హైదరాబాద్, తిరువనంతపురం, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై, నాగ్‌పూర్, రాయ్‌పూర్, భోపాల్, జబల్‌పూర్, వడోదర, రాజ్‌కోట్, గౌహతి, షిల్లాంగ్, కోల్‌కతా, భువనేశ్వర్, పాట్నా, రాంచీ, శ్రీనగర్, జమ్మూ, సిమ్లా, డెహ్రాడూన్, పాటియాలా, జైపూర్, కోట, హిసార్ మరియు లక్నోలలో జరుగుతాయని ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ చైర్మన్ శైలేంద్ర దూబే వెల్లడించారు.

## అమెరికా సుంకాలు

>> కార్యదర్శి హోవార్డ్ లూట్నిక్ స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 1 నుంచే పెంపు అమల్లోకి వస్తుందని, ప్రస్తుతం అధ్యక్షుడు ట్రంప్ సుంకాల రేట్లను, ఒప్పందాలను ఖరారు చేసే పనిలో ఉన్నారని తెలిపారు. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. ఒప్పందాలను వేగవంతం చేయకపోతే, ఏప్రిల్ 2 నాటి సుంకాల స్థాయికి తిరిగి వెళ్లాల్సి ఉంటుందని మా భాగస్వామ్య దేశాలకు ట్రంప్ లేఖలు పంపనున్నారు. దీంతో చాలా ఒప్పందాలు త్వరగా పూర్తవుతాయని భావిస్తున్నామని ఆయన సీఎన్ఎన్‌తో అన్నారు. గత ఏప్రిల్‌లో ట్రంప్ ప్రభుత్వం చాలా దేశాలపై 10శాతం మూల సుంకంతో పాటు 50శాతంవరకు అదనపు సుంకాలను ప్రకటించింది.

## మేడిగడ్డ బ్యారేజ్ 85 గేట్లు ఎత్తివేత

>> 70,710 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా.. వచ్చిన నీటిని వచ్చినట్లే.. 85 గేట్లు ఎత్తి.. దిగువకు వదులుతున్నారు. అయితే గతంలో ఈ డ్యామ్ లోని పలు గేట్లు కుంగడంతో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే తాజాగా బ్యారేజ్ గేట్లను ఎత్తడంతో ఏ క్షణం ఎమి జరుగుతుందోనని బ్యారేజ్ దిగువన ఉన్న రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే వరద ఉధృతిపై అధికారులు గంట గంటకు రివ్యూ చేస్తూ పై అధికారులకు సమాచారం అందిస్తున్నట్లు తెలుస్తుంది.

## జాతీయ క్రీడలకు రెడీ

>> 2036లో దేశంలో నిర్వహించే ఒలింపిక్స్‌లో కనీసం రెండు ఇవెంట్లు తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గతంలో మాదిరే రైలు ప్రయాణాల్లో ఛార్జీ రాయితీ ఇవ్వాలని సీఎం కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏ.పి.జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలా?

>> ఉన్న చిన్నా, పెద్దా అందరికి తెలిసిపోయిందన్నారు. ఫారెస్ట్ అధికారులను ముందటపెట్టి గిరిజనులపై చేయిస్తున్న దాష్టీకాలను సీతక్క తక్షణం ఆపేయాలని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడంతో పాటు ఆ అన్యాయాన్ని ప్రశ్నించిన చుక్క రమేశ్‌ను తన అనుచరులతో వేధించిన సీతక్క తక్షణం మంత్రి పదవికి రాజీనామా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తాము వేసుకున్నది కాంగ్రెస్ కండువా కాదు, ఖాకీ యూనిఫాం అని ఇప్పటికైనా పోలీసులు గ్రహించి బుద్ధితెచ్చుకుని చుక్క రమేశ్ చావుకు కారణమైన సీతక్క అనుచరులపై కేసు నమోదు చేయాలాని కేటీఆర్ అన్నారు. లేకుంటే బీఆర్ఎస్ తరుపున పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ములుగు జిల్లాలో సీతక్క చేస్తున్న అన్యాయాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం పోరాటాన్ని కొనసాగిస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

## 'క్రమశిక్షణ'లో తాత్సారం!

>> అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే జడ్చర్ల అనిరుధ్ రెడ్డిపై వ్యాఖ్యలపై టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. వెంటనే వ్యాఖ్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీని ఆదేశించారు. అయితే, సోమవారం జరిగే క్రమశిక్షణ కమిటీ మీటింగ్ తర్వాత అనిరుధ్ రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇస్తారనీ అంతా ఎదురుచూశారు కానీ సమావేశంలో వాయిదా పడ్డది.

## ఓవరాక్షన్‌తో అడ్డంగా బుక్కయిన ఖేమ్కా హత్యకేసు నిందితుడు!

**పాట్నా,జూలై 7:** బీహార్‌లో సంచలనం సృష్టించిన బీజేపీ నేత గోపాల్ ఖేమ్కా హత్య కేసులో నాటకీయ పరిణామం చోటుచేసుకుంది. తనపై ఎవరికీ అనుమానం రాకూడదన్న ఉద్దేశంతో నిందితుడు ఏకంగా మృతుడి అంత్యక్రియలకు హాజరై పోలీసులకు అడ్డంగా బుక్కయ్యాడు. సీసీటీవీ కెమెరా దృశ్యాల ఆధారంగా అతడిని గుర్తించిన పోలీసులు, అంత్యక్రియలు జరుగుతున్నప్పుడే అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఖేమ్కా అంత్యక్రియలు జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన వారిలో నిందితుడు కూడా ఉన్నాడు. పాట్నాలోని పున్‌పున్ ప్రాంతానికి చెందిన రోషన్ కుమార్ అనే వ్యక్తి ఖేమ్కా భౌతికకాయానికి నివాళులర్పించేందుకు పూలదండతో వచ్చాడు. అప్పటికే సీసీటీవీ ఫుటేజీ ద్వారా అతడిని గుర్తించిన పోలీసులు, అక్కడికక్కడే అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ముందు బాధితుడితో కలిసి ఓ టీ దుకాణం వద్ద కూర్చున్నట్లు నిందితుడు విచారణలో అంగీకరించినట్లు సమాచారం.

## జనగణన అంతా డిజిటల్!

>> సమాచారం ఏమిటి అనే సమాచారాన్ని సేకరిస్తారు. తదుపరి దశలో జనగణన జరుగుతుంది. భారతదేశంలో జరగబోతున్న తొలి సారిగా డిజిటల్ సెన్సెస్ కూడా ఇదే. ఎందుకంటే ఈ గణనను నిర్వహించే ఎన్యుమరేటర్లు తమతమ ఆండ్రాయిడ్ ఫోన్లలోని యాప్‌లు, యాపిల్ ఫోన్‌లలోని యాప్‌లలో దేశ ప్రజల సమాచారాన్ని సేకరించి నిక్షిప్తం చేయనున్నారు. వారు నమోదు చేసే సమాచారం ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ విధానంలో సెంట్రల్ సర్వర్‌కు చేరిపోయి, అందులో స్టోర్ అవుతుంది. దీనివల్ల జనగణన పూర్తికాగానే సమాచారాన్ని విడుదల చేసేందుకు ఆస్కారం కలుగుతుందని కేంద్ర అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఎన్యుమరేటర్లు జనగణన సమాచారాన్ని సేకరించడం దగ్గరి నుంచి దాన్ని సెంట్రల్ సర్వర్‌కు పంపడం, అందులో స్టోర్ కావడం దాకా ప్రతీచోటా పకడ్బందీ సమాచార భద్రతా చర్యలను అమలు చేస్తామని తెలిపాయి. దేశవ్యాప్తంగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నియమించే దాదాపు 34 లక్షల మంది ఎన్యుమరేటర్లకు ఎక్కడికక్కడ జనగణన నిర్వహించడంపై ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు జాతీయ స్థాయిలో నేషనల్ ట్రైనర్లు, తదుపరిగా మాస్టర్ ట్రైనర్లు, చివరగా ఫీల్డ్ ట్రైనర్లు ఉంటారు. జనగణనకు అనుగుణంగా రాష్ట్రాల పాలనా యూనిట్ల సరిహద్దుల్లో ఈ ఏడాది డిసెంబరు 31లోగా మార్పులను పూర్తి చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ లేఖ రాశారు. రాష్ట్రాలు, యూటీలలో పాలనా యూనిట్ల ఫ్రీజింగ్ జరిగిన 3 నెలల తర్వాతే జనగణన నిర్వహించాలని రూల్స్ చెబుతున్నాయి. పాలనా యూనిట్లు అంటే జిల్లాలు, ఉప జిల్లాలు, తహసీల్‌లు, తాలూకాలు, పోలీసు స్టేషన్ల పరిధులు. హౌజ్ లిస్టింగ్ అండ్ హౌజింగ్ సెన్సస్ 2026 ఏప్రిల్ 1న ప్రారంభమవుతుంది. 2027 ఫిబ్రవరి 1 నుంచి జరగనున్న రెండోవిడత గణనలో జనాభా వివరాలను సేకరిస్తారు. ప్రతీ కుటుంబానికి చెందిన సభ్యుల కులాల సమాచారాన్ని నమోదు చేస్తారు. కేంద్ర హోంశాఖ గతనెల 16న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో దేశంలో జనగణన నిర్వహణకు రెఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1ని ప్రస్తావించారు. హిమాలయ ప్రాంతాలైన లద్దాఖ్,జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఉండే ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వాటికి 2026 అక్టోబర్ 1ని రెఫరెన్స్ తేదీగా ప్రకటించారు. సగటున ఈ రెఫరెన్స్ తేదీల్లోనే జనగణన ప్రక్రియ ప్రారంభమవుతుంది. మనదేశంలో జరగబోతున్న 16వ జనగణన ఇది. స్వాతంత్ర్యం సిద్ధించాక జరుగుతున్న 8వ జనగణన అని కేంద్ర అర్థగణాంకశాఖ ప్రకటించింది.

## వారం - వర్జ్యం

తేది : 08-07-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
త్రయోదశి రా.12.36
జ్యేష్ఠ రా.3.14
వర్జ్యం సా.4.17-5.59
దు.ఉ.8.18-9.10, 2) రా.11.59-12.51
శుభసమయం:ఉ.6.15-7.00, సా.6.30-7.00
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** మీలోని ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. పోగొట్టుకున్న వస్తువులు, పత్రాలు లభ్యమవుతాయి.

**వృషభం :** సన్నిహితుల సాయంతో ముందుకు సాగుతారు. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి.

**మిథునం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో ప్రోత్సాహకరంగా వుండును. సోదరులను కలిసి కష్టసుఖాలను పంచు కొంటారు.

**కర్కాటకం:**స్థిరమైన ఉద్యోగం లభిస్తుంది. కాంట్రాక్టులు దక్కించు కొంటారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి.

**సింహం:** భూములు, గృహం కొనుగోలు చేస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.శుభవార్తలు.

**కన్య :** ఆప్తులను కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**తుల :**సంతానం నాకు నూతన విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందుతారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**వృశ్చికం:** చాకచక్యంగా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకొంటారు. ప్రముఖుల నుండి కీలకసమాచారం అందుతుంది.

**ధనుస్సు:** పనులలో ఏర్పడిన ఆటంకాలు తొలగుతాయి. దూర ప్రాంతాల నుండి ముఖ్య సమాచారం అందుతుంది.

**మకరం:** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి.స్వల్పధనలాభం.

**కుంభం:** పోటీపరీక్షలు, ఇంటర్వ్యూలలో చురుకుగా పాల్గొంటారు. విందు,వినోదాలు శుభకార్యాలలో చురుకగా పాల్గొంటారు.

**మీనం :** రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా వుండును.ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు

## వనమహోత్సవంలో సిఎం రేవంత్



వ్యవసాయ వర్సిటీలో సోమవారం నిర్వహించిన వన మహోత్సవంలో మొక్కను నాటుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి కొండా సురేఖ తదితరులు

**హైదరాబాద్ (అత్తాపూర్), జూలై 7, ప్రభాతవార్త:** వనమే మనం, మనమే వనం అని పెద్దలు చెప్పారని, ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని యూనివర్సిటీ ప్రాంగణంలో రుద్రాక్ష మొక్కను నాటి వనమహోత్సవం2025 ను ప్రారంభించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వనమే మనం, మనమే వనం అని పెద్దలు చెప్పారని,ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని అన్నారు. ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, లక్ష్యాన్ని పూర్తి చేయుటకు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, అందరు ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములై ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని దేశ ప్రధాని పిలుపునిచ్చారని, ప్రధాని పిలుపును సాదరంగా ఆహ్వానిస్తూ ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో రెండు మొక్కలు నాటలని పిలుపునిచ్చారు. అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కను నాటాలని, ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటాలని, మీ పిల్లల్లాగే నాటిన మొక్కలను సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందని అన్నారు.మహిళలను ప్రోత్సహిస్తూ మా ప్రభుత్వం ముందుకు వెళుతోందని, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామని, ఆర్టీసీలో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండ, ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామని తెలిపారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించామని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, పట్టణ ప్రాంతాల్లో మహిళలు కూడాను మహిళా సంఘాల్లో చేరేలా కృషి చేయాలన్నారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు రుణాలు అందించామని తెలిపారు. అన్ని రంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నామని, ఇందిరమ్మ రాజ్యంలో ఆడ బిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్ రాబోతోందని, వచ్చే ఎన్నికల్లో మహిళలకు 60 ఎమెల్యే సీట్లు ఇచ్చేబాధ్యత నేను తీసుకుంటానాని ముఖ్యమంత్రి తెలిపారు.అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ వృక్షో రక్షిత రకితః చెట్లను పెంచడం ద్వారా మనల్ని మనం రక్షించుకోవడం జరుగుతుందని, జీవవైవిధ్యన్ని కాపాడుకోగలుగుతామని అన్నారు. చెట్లను పెంచడం ద్వారా వర్షాలు సకాలంలో కూరుస్తాయని, వంద శాతం మొక్కలు నాటేందుకు కృషి చేయాలని, భౌగోళిక పరిస్థితి మెరుగుపడే విధంగా రాష్ట్రమంతా విరివిగా వనాలు పెంచాలని, అందుకు అందరూ భాగస్వాములు కావాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్, కమిషనర్ కర్ణన్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఉన్నతాధికారులు. తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ స్టూడియో

### సిఎం రేవంత్‌తో భేటీ అయిన ప్రముఖ నటుడు అజయ్ దేవగణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై7:** తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ స్టూడియో ఏర్పాటుకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ప్రముఖ సినీ నటుడు అజయ్ దేవగణ్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన అధికారిక నివాసంలో అజయ్ దేవగణ్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సినీ నిర్మాణంలో కీలకమైన యానిమేషన్, వీఎఫ్ఎక్స్ స్టూడియో, ఏఐ, ఇతర సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టూడియో నిర్మాణాన్ని తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించాలని అజయ్ దేవగణ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ స్థాయి స్టూడియో నిర్మాణంతో పాటు సినీ పరిశ్రమలో వివిధ విభాగాలకు అవసరమైన నిపుణులను అందుబాటులోకి తెచ్చేందుకు నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అజయ్ దేవగణ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధికి తాము తీసుకుంటున్న చర్యలను, వివిధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సీఎం రేవంత్ రెడ్డి అజయ్ దేవగణ్‌కు వివరించారు.తెలంగాణ రైజింగ్‌కు సంబంధించి మీడియా, సినిమా రంగాలకు ప్రచారకర్తగా ఉంటానని అజయ్ దేవగణ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



న్యూఢిల్లీలో సోమవారం జరిగిన రక్షణ ఖాతాల విభాగం కంట్రోలర్ల సమావేశాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

## ప్రపంచ శాంతిలో 'బ్రిక్స్' కీలకం

>>కాదు, మానవాళికి ఎదురుదెబ్బ అని ప్రధాని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఖండించడం మన బాధ్యత అంటూ పేర్కొన్నారు. శాంతియుతమైన, సురక్షితమైన వాతావరణంలో మాత్రమే మానవాళి అభివృద్ధి సాధ్యమని ఈ లక్ష్యాన్ని నెరవేర్చడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి ఐక్యంగా ఉండాలన్నారు. భారత్ అన్ని స్నేహపూర్వక దేశాలతో సహకారం, భాగస్వామ్యానికి కట్టుబడి ఉందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. బ్రిక్స్ కూటమి గ్లోబల్ సౌత్ అంచనాలను అందుకోవాలని అభిప్రాయపడ్డారు. భారత్ వ్యవసాయం, ఆరోగ్యం, పాలన విద్య వంటి రంగాలలో ఏఐని విస్తృతంగా ఉపయోగిస్తోందని ప్రధాని వెల్లడించారు. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండించడంలో భారత్‌కు మద్దతు ఇచ్చిన దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రిక్స్ సదస్సులో ప్రపంచ నాయకులను ఉద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ భారత్ ఉగ్రవాద బాధిత దేశమని.. పాకిస్థాన్ దానికి మద్దతుదారు అని.. కాబట్టి బాధితులు, మద్దతుదారులను ఒక స్థాయిలో తూచలేమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. వ్యక్తిగత లేదా రాజకీయ లాభాల కోసం ఉగ్రవాదం వ్యాప్తికి వ్యతిరేకంగా మాట్లాడని లేదా చర్యలు తీసుకోని వారిని కూడా ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. ఉగ్రవాదులకు మోన సమ్మతి ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని ఎత్తి చూపారు. బ్రిక్స్ కూటమి దేశాలు రియో డి జనీరో డిక్లరేషన్ పేరుతో సంయుక్త ప్రకటనను చేశాయి. ఈ ప్రకటన 2025 ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా, దాని ప్రేరణ ఏదైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరు పాల్పడినా అది నేరమేనని, అన్యాయమేనని తీవ్రంగా ఖండించింది. సరిహద్దులు దాటి వచ్చే ఉగ్రవాదులను, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడాన్ని, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటామని బ్రిక్స్ దేశాలు సంయుక్తంగా ప్రకటించాయి. బ్రిక్స్ 2026 సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న భారత్ భారతదేశం 2026లో బ్రిక్స్ సదస్సును నిర్వహించనుంది. అంతేకాకుండా వచ్చే ఏడాది బ్రిక్స్‌కు భారత్ ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నది. ఇది అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదంపై తన నిబద్ధతను, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఒక అవకాశంగా నిలుస్తుంది.

## ఐ సెట్-2025 పరీక్షల్లో 90.83 శాతం అర్హత

### గత ఏడాది కంటే తగ్గిన ఉత్తీర్ణతా శాతం

**హైదరాబాద్, జులై 07, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్-2025 పరీక్షల్లో 90.83 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. గత ఏడాది కంటే అర్హత శాతం ఈ ఏడాది తగ్గింది. గత ఏడాది 91.92 శాతం మంది అర్హత సాధించగా.. ఈ ఏడాది 90.83 శాతం మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఐ సెట్-2025 ఫలితాలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, ఐసెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఆలువాల రవి పాల్గొన్నారు. ఐ సెట్-2025 పరీక్షలను జూన్ 8, 9 తేదిల్లో నిర్వహించిన సంగతి తెలిసిందే. పరీక్షలకి 71,746 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో బాలురు 34,412 మంది ఉండగా.. బాలికలు 37,333 మంది ఉన్నారు .. ఒకరు ట్రాన్స్ జెండర్ ఉన్నారు. ఐ సెట్ పరీక్షలకి 90.51 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షను జూన్ 8, 9తేదిల్లో నిర్వహించారు. మూడు సెషన్‌లలో కలిపి 90.51 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 జోన్లలో 93 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐ సెట్ ప్రాథమిక కీని జూన్ 21న విడుదల చేయగా.. అభ్యర్థుల నుంచి జూన్ 26 వరకు అభ్యంతరాలను స్వీకరించారు. సోమవారం ఫలితాలను విడుదల చేయనున్నారు. పరీక్షలకి 34,412 మంది పురుషులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 30,868 మంది పరీక్షలకు హాజరయ్యారు.

## తుపాకీతో కాల్చుకుని రష్యా మాజీ రవాణామంత్రి ఆత్మహత్య

**మాస్కో, జూలై 7:** రష్యాలోఅధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తన కేబినెట్ నుంచి తొలగించిన కొద్ది గంటలకే రవాణా శాఖ మాజీ మంత్రి రోమన్ స్టారోవాయిట్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనతో రష్యా రాజకీయ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. మాస్కో శివారు ప్రాంతంలోని తన కారులో రోమన్ స్టారోవాయిట్ తుపాకీతో కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నారని రష్యా వార్తా సంస్థలు వెల్లడించాయి.



ఆయన మృతదేహాన్ని కారులో కనుగొన్నట్లు దేశ ఇన్వెస్టిగేటివ్ కమిటీ సైతం ధ్రువీకరించింది. సోమవారం ఆయనను మంత్రి పదవి నుంచి తొలగిస్తున్నట్లు అధికారిక ప్రకటన వెలువడిన వెంటనే ఈ విషాదం జరిగింది. కేవలం ఏడాదికి పైగా మాత్రమే మంత్రిగా పనిచేసిన స్టారోవాయిట్‌ను పదవి నుంచి ఎందుకు తొలగించారనే దానిపై ప్రభుత్వం ఎలాంటి కారణం వెల్లడించలేదు. అయితే, జూలై 5, 6 తేదీలలో ఉక్రెయిన్ డ్రోన్ దాడుల భద్రతా ముప్పు కారణంగా రష్యాలోని ప్రధాన విమానాశ్రయాల్లో దాదాపు 300 విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ వైఫల్యం కారణంగానే ఆయనపై వేటు పడి ఉండవచ్చని విశ్లేషణలు వెలువడుతున్నాయి. గతంలో ఉక్రెయిన్ సరిహద్దులోని కుర్స్క్ ప్రాంతానికి దాదాపు ఐదేళ్ల పాటు గవర్నర్‌గా స్టారోవాయిట్ పనిచేశారు. మే 2024 లో రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

## టిజిపిఎస్‌సి నోటిఫికేషన్లు!

>> శాఖలోని ఖాళీల వివరాలను అందించనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్‌లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం రెండూ రాష్ట్ర హైకోర్టుకి .. సెప్టెంబర్‌లోగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని చెప్పాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి ముగిసే వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటున్న నేపథ్యంలో సెప్టెంబర్ చివరి వరకు నోటిఫికేషన్లకు అవకాశం లేదు. అనంతరం అక్టోబర్‌లో గ్రూప్-2 నియామకాలను పూర్తి చేసి.. గ్రూప్-3 మెరిట్ లిస్టు అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పూర్తి చేస్తే.. నవంబర్‌లో నియామకాల ప్రక్రియ పూర్తిచేయడానికి అవకాశం ఉంటుంది. ఇవన్నీ అనున్నవి అనుకున్నట్టు జరిగితే డిసెంబర్ తరువాతనే కొత్త నోటిఫికేషన్లను జారీ చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. అది కూడా ఈ లోపుగా ప్రభుత్వ శాఖలు ఖాళీల వివరాలను అందించాల్సి ఉంటుంది. వాటి నియామకాలకు ఆర్థిక శాఖ అనుమతించాల్సి ఉంటుంది. వీటితోపాటు కొత్త నియామకాలకు ప్రభుత్వం అనుమతివ్వాల్సి ఉంటుంది.

## 10న తెలంగాణ కేబినెట్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై7:** ఈనెల 10న తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సెక్రటేరియట్‌లోని 6వ ఫ్లోర్‌లో మధ్నాహ్నం 2 గంటలకు కేబినెట్ సమావేశం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రులందరు హాజరుకావాలని పేర్కొన్నారు. కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు, రిజర్వేషన్ల ఖరారు, రాజీవ్ యువ వికాసం స్కీమ్, ఏపీ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు స్టేట్ యాక్షన్ ప్లాన్, ప్రభుత్వ స్కూళ్ల పరిస్థితి, అడ్మిషన్లు, ఇన్ ఫ్రాస్ట్రక్చర్లు, మెడికల్ కాలేజీల స్థితిగతులు, డ్రగ్స్ నియంత్రణ తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సంబంధించిన అంశాలపై చర్చ జరిగే చాన్స్ ఉంది. ఈ వర్షాకాలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా... చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రచించనున్నారు. అలాగే ఇతర సంక్షేమ పథకాల అమలుపై కూడా చర్చ జరిగే ఛాన్స్ ఉంది. ఇందిరమ్మ ఇండ్లపై మరోసారి కేబినెట్ సమావేశంలో చర్చ జరుగనుందని తెలుస్తోంది. ప్రతి నెలా 2సార్లు షెడ్యూల్ ప్రకారం కేబినెట్ భేటీ కావాలని గత కేబినెట్‌లోనే నిర్ణయంచిన సంగతి తెలిసిందే. తర్వాతి మంత్రివర్గ భేటీ ఎప్పుడు ఉంటుందనేది ముందే షెడ్యూల్ ఫిక్స్ అవుతుంది. ఇందుకు సంబంధించిన అజెండాలు ప్రిపేర్ అవుతాయి. దీంతో మంత్రులు కూడా తమ షెడ్యూల్‌ను ఈజీగా ఫిక్స్ చేసుకోవచ్చు. ఇప్పటి దాకా టైమ్,సందర్భం,వెసులుబాటును బట్టి కేబినెట్ సమావేశాలు నిర్వహించేవారు.

# దోస్త్-2025లో 1.43 లక్షల మంది ప్రవేశాలు

### ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ
### 64 కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కాలేదు!
### 9, 10 తేదీల్లో ఇంట్రాకాలేజెస్ అప్షన్లు

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 957 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 4,36,947 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 1,43,037 మంది చేరారు. 63 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా కాలేదు. శాతవాహన యూనివర్సిటీలో ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కూడా ఒక్క అడ్మిషన్ కూడా జరగలేదు. డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం మూడు విడతల్లో సీట్లను కేటాయించారు. రెండు, మూడో విడతల్లో సీటు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో చేరేందుకు ఇచ్చిన గడువు కాస్త శనివారం(జూలై 5)తో ముగిసింది. దీంతో 2025-26 సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయింది. మొదటి విడతలో 65వేల మందికి సీట్ల కేటాయింపు చేపట్టగా వారిలో సుమారు 43 వేల మంది కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చారు. ఇక రెండో విడతలో 43వేల సీట్ల కేటాయింపు చేయగా.. మూడో విడతలో 85,680 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 30 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా దానిని కాస్త జూలై 5 వరకు పొడిగించారు. అదికాస్త శనివారంతో ముగిసింది. దోస్త్ మూడో విడత సీట్ల కేటాయింపు కోసం జూన్ 28న విడుదల చేశారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్‌లో భాగంగా 82,770 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మూడో విడతలో 96,015 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 85,680 మందికి సీట్ల కేటాయింపు చేపట్టారు. తక్కువ ఆప్షన్లు ఇచ్చిన కారణంగా 10,335 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేయలేదు. రెండు, మూడో విడతలో సీటు పొందిన వారు రూ. 500.. రూ. 1000 ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరడానికి శనివారం (జూలై 5) వరకు అవకాశం కల్పించగా .. గడువు కాస్త ముగిసింది. ఉస్మానియా వర్సిటీలో 1,95,397 సీట్లు ఉండగా.. 67,157 మంది చేరారు. కాకతీయ యూనివర్సిటీలో 1,07,080 సీట్లు ఉండగా 33,289 మంది చేరారు. శాతవాహన యూనివర్సిటీలో 38,220 సీట్లు ఉండగా.. 14,022 మంది చేరారు. పాలమూరు యూనివర్సిటీలో 34,220 సీట్లు ఉంటే వాటిలో 10,638 మంది చేరారు. తెలంగాణ యూనివర్సిటీలో 33,110 సీట్లు అందుబాటులో ఉంటే 9959 మంది చేరారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో 26,660 సీట్లు ఉండగా వాటిలో 6589 మంది చేరారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో 1850 సీట్లు ఉండగా అందులో 1255 మంది చేరారు. దోస్త్-2025లో మూడు విడతల్లో సీట్ల కేటాయింపు చేయగా.. ఈ నెల 9, 10 తేదీల్లో ఇంట్రా కాలేజెస్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఇంట్రా కాలేజెస్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 11న సీట్ల కేటాయింపు చేయనున్నారు.



## తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధిపై భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ప్రశంస

### ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 7:** తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం క్రీడారంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ప్రశంసించారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఆయన అధికారికనివాసంలో కపిల్‌దేవ్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సీఎం రేవంత్‌రెడ్డి కపిల్‌దేవ్‌కు వివరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు తెలంగాణలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాల్లో తాను భాగస్వామినవుతానని కపిల్‌దేవ్ ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా దక్షిణ కొరియాతోపాటు పలు దేశాల్లో తాము సందర్శించిన క్రీడా యూనివర్సిటీలు.. అక్కడి క్రీడా ప్రముఖులతో తమ భేటీల వివరాలను సీఎం రేవంత్‌రెడ్డి కపిల్‌దేవ్‌కు తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## రేపటి సమ్మెలో లక్ష మంది ఉద్యోగులు!

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 7. ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న కేంద్ర కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని బ్యాంక్, బీమా కంపెనీలకు చెందిన లక్ష మంది ఉద్యోగులు పాల్గొంటారని టిఎస్- ఎపి రాష్ట్రాల జాయింట్ ఫోరం ఆఫ్ ఫైనాన్సియల్ సెక్టార్ యూనియన్స్ ప్రకటించాయి.

సోమ వారం నాడిక్కడ ఎపిటిబిఇఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎఫ ఎఫ్ఎస్‌యు జాతీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు, పలు యూనియన్స్ నాయకులు వాల్ పోస్టర్లును ఆవిష్కరించి మాట్లాడారు.



రోడ్డు ప్రమాదంలో చనిపోయిన హోంగార్డు నరేష్‌కుమార్ సతీమణి నాగరాణికి రూ. 38 లక్షల చెక్కును అందజేస్తున్న అదనపు డిజి స్వాతి లక్రా.

### ప్రమాదంలో మరణించిన హోంగార్డు కుటుంబానికి
## రూ.38 లక్షల చెక్కు అందజేత

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో చనిపోయిన హోంగార్డు కుటుంబాన్ని ఆదుకునేందుకు పోలీసు శాఖ ముందుకు వచ్చింది. ఖమ్మం జిల్లా కు చెందిన హోంగార్డు గంటా నరేష్ కుమార్ (42) గత ఫిబ్రవరి నెల 20వ తేదీన రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. దీంతో అతని కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. అయితే రాష్ట్రంలో పనిచేస్తున్న హోంగార్డులకు జీవిత బీమా కింద యాక్సిస్ బ్యాంకుతో ఎంఒయు వుంది. దీని ప్రకారం ఎవరైనా హోంగార్డులు విధుల్లో వుంటూ చనిపోతే వారి కుటుంబాలకు 38 లక్షల రూపాయల ఆర్థిక సహాయం ఆ బ్యాంకు అందజేస్తుంది. నరేష్ కుమార్‌కు కూడా ఈ మొత్తాన్ని యాక్సిస్ బ్యాంకు అందజేయాలని నిర్ణయించింది. యాక్సిస్ బ్యాంకు అందజేసిన చెక్కును హోంగార్డుల విభాగం అదనపు డిజి స్వాతి లక్రా సోమవారం డిజిపి కార్యాలయంలో హోంగార్డు నరేష్‌కుమార్ సతీమణి నాగరాణికి అందజేశారు. ఈ సందర్భంగా స్వాతి లక్రా మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమం కోసం పోలీసు శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

## మియాపూర్‌లో బ్యాంక్ దోపిడీకి విఫలయత్నం

**హైదరాబాద్ (మియాపూర్), జూలై 7, ప్రభాతవార్త:** గుర్తుతెలియని దుండగులు బ్యాంక్ చోరీకి యత్నించి సఫలం కాకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయిన ఘటన మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని న్యూ హాఫీజ్ పేట్‌లో చోటుచేసుకుంది. మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని న్యూ హాఫీజ్ పేట్ ఇండస్ట్రియల్ ఏరియాలో హైవేపై ఉన్న సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో ఆదివారం తెల్లవారుజామున చోరీకి యత్నించారు దుండగులు. బ్యాంకు లోపలికి చొరబడిన దుండగులు సర్వర్ రూమ్ తాళం పగలగొట్టే ప్రయత్నం చేశారు. అది రాకపోవడంతో ఉత్తి చేతులతోనే వెనుదిరిగి వెళ్లిపోయారు. అయితే ఉదయం విధుల్లోకి వచ్చిన ఉద్యోగులు షటర్ తాళాలు పగలగొట్టి ఉండడం, సర్వర్ రూమ్ తాళాలు తెరిచేందుకు యత్నించారన్న విషయం గమనించి మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మియాపూర్ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

## 13 మంది అదనపు ఎస్పీల బదిలీ

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పలుచోట్ల పనిచేస్తున్న 13 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ డిజిపి జితేందర్ సోమవారం నాడు ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో శాంతి భద్రతల విభాగంతో పాటు సిఐడి. ఇంటెలిజెన్స్, బల్దియా విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న వారు. వీరిని వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

## కాలుకు చికిత్సచేస్తే గుండెపోటుతో బాలుడి మృతి

### కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్(పంజగుట్ట), జూలై 7, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది, వివరాల ప్రకారం కాలుకు శస్త్ర చికిత్స చేయించుకునేందుకు ఆసుపత్రికి వచ్చిన బాలుడు (7) ఆపరేషన్ అనంతరం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటనపై బాలుడి కుటుంబీకులు ఆస్పత్రి యాజమాన్యాన్ని నిలదీయగా వారు దురుసుగా వ్యవహరించారు. బాలుడి తల్లిదండ్రులు ఆసుపత్రి వద్ద తమ బాబు మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమన్నారు. అదిలాబాద్ జిల్లాకు చెందిన బాలుడు తొలుత ఐదు నెలలక్రితం బంజారాహిల్స్‌లోని ఆసుపత్రిలో కాలుకు సంబంధించి చికిత్స పొందాడు. ఇటీవల మళ్లీ ఇన్ఫెక్షన్ సోకగా తల్లిదండ్రులు మూడు రోజుల క్రితం ఇదే ఆసుపత్రిలో జాయిన్ చేశారు. వైద్యులు గత ఆదివారం కాలుకు మళ్లీ శస్త్రచికిత్స నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం బాలుడు ఆకస్మికంగా మృతి చెందాడు. వైద్యులను విషయం అడిగితే గుండెపోటు వల్లనే మృతి చెందాడని తమకేం సంబంధం లేదని తేల్చిచెప్పారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులను పోలీసులు విషయం కనుక్కుని ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## క్షుద్రపూజల అనుమానంతో కొట్టి, సజీవదహనం

### బీహార్‌లో ఆటవిక రాజ్యం

**పాట్నా, జూలై 7:** క్షుద్రపూజల అనుమానంతో కుటుంబంలోని ఐదుగురిని చంపి దహనం క్షుద్రపూజలు చేస్తున్నారన్న అనుమానంతో ఒక కుటుంబంలోని ఐదుగురు వ్యక్తులను గ్రామస్తులు కొట్టిచంపారు. ఆ తర్వాత వారిని దహనం చేశారు. ప్రాణాలతో బయటపడిన ఒక పిల్లవాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీహార్‌లోని పూర్ణియా జిల్లాలో ఈ సంఘటన దారుణం జరిగింది. టెట్‌గామా గ్రామంలో ఇటీవల కొందరు వ్యక్తులు మరణించారు. పలువురు అనారోగ్యం బారినపడ్డారు. కాగా, ఒక కుటుంబం క్షుద్రపూజల వల్ల వారు చనిపోయినట్లు గ్రామస్తులు అనుమానించారు. దీంతో ఆ కుటుంబానికి చెందిన ఐదుగురిని దారుణంగా కొట్టి చంపారు. బాబులాల్ ఒరాన్, సీతా దేవి, మంజీత్‌ఒరాన్, రానియా దేవి, తప్టో మోస్మత్‌కు నిప్పుపెట్టి దహనం చేశారు. మరోవైపు ఆ కుటుంబం నుంచి ప్రాణాలతో బయటపడిన ఒక బాలుడు ఈసంఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో ఆ గ్రామానికి వెళ్లగా గ్రామస్తులు పారిపోయారు. సమీపంలోని చెరువు నుంచి కాలిన నాలుగు మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఒకరిని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# నెలాఖరుకు ఘోష్ నివేదిక!

### ఇక మాజీ ఇఎన్‌సి అనిల్‌కుమార్ విచారణ

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్, అనుబంధ ప్రాజెక్టులపై విచారణ తుది అంకానికి చేరిన సమయంలో జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ మాజీ ఇఎన్‌సి అనిల్‌కుమార్‌ను విచారణకు పిలిపించినట్లు తెలిసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ గతేడాది పార్లమెంట్ ఎన్నికలు జరిగిన తరువాత విచారణవేగం పెంచారు. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై ఇప్పటికే సమగ్ర విచారణ చేపట్టారు. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారుల నుంచి అఫిడవిట్లు తీసుకుని వాటి ఆధారంగా వారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావు, మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్లను కూడా కమిషన్ విచారించింది. ఈ క్రమంలోనే మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ నీటి పారుదల శాఖ మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్ తాజాగా కాళేశ్వరం కమిషన్ నోటీసులు జారీ చేసింది. మేడిగడ్డ బ్యారేజీలో గ్రౌటింగ్ విషయాన్ని ఎంక్వైరీలో భాగంగా దాచిపెట్టిన విషయాన్ని కమిషన్ గుర్తించింది. అదేవిధంగా ఉన్నత హోదాలో ఉండి అబద్ధపు స్టేట్మెంట్ ఇచ్చినందుకు ఆయనపై చైర్మన్ పినాకిని చంద్రఘోష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు నీటిపారుదలశాఖలో చర్చించుకుంటున్నారు. దీంతో ఆయనకు నోటీసులు ఇచ్చి ఈనెల 9న తిరిగి విచారణకు రావాలని కమిషన్ ఆదేశించింది. అదేవిధంగా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్, అనుబంధ ప్రాజెక్టులకు సంబంధించి గత ప్రభుత్వ కేబినెట్ మినిట్స్ తనకు అందినట్లుగా కమిషన్ కార్యాలయం తెలిపింది. ఈనెల 27న కాళేశ్వరం కమిషన్ తుది నివేదికను ప్రభుత్వానికి అందజేయనుంది. మధ్యాహ్నం కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీ చంద్రఘోష్ బీఆర్కే భవన్‌కు చేరుకున్నారు. కాళేశ్వరం ఆనకట్టల అంశాలపై అధ్యయనం చేయనున్నారు. అదేవిధంగా పలు ప్రాజెక్టులకు కేబినెట్ ఆమోదం సంబంధిత విషయాలను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ నివేదిక దాదాపు సిద్ధమైంది. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి అందించే అవకాశముంది. విచారణలో భాగంగా ఇప్పటి వరకు మొత్తం 115 మందిని కమిషన్ ప్రశ్నించి, వాంగ్మూలాలను నమోదు చేసింది. అంతేకాకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాలను కూడా క్రోడీకరించి పూర్తి నివేదికను సిద్ధం చేసి, ఈ నెలాఖరు కల్లా ప్రభుత్వానికి అందించనుంది.

# బ్రిక్స్ కూటమిలోకి పూర్తిస్థాయి సభ్యదేశంగా ఇండోనేసియా



**రియోడీజెనీరో, జూలై 7:** అంతర్జాతీయంగా వేగంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్న బ్రిక్స్ కూటమి మరింత విస్తరించింది. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో జరుగుతున్న 17వ బ్రిక్స్ సదస్సులో ఇండోనేషియా పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరింది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాం టోకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ పరిణామం బహుళపక్ష వేదికలపై భారత్ కు పెరుగుతున్న దౌత్యపరమైన పలుకుబడికి నిదర్శనమని విదేశాంగ శాఖ పేర్కొంది. సదస్సు వివరాలను భారత విదేశాంగ శాఖ కార్యదర్శి (ఆర్థిక సంబంధాలు) దమ్ము రవి మీడియాకు వెల్లడించారు. 'సదస్సులో తనకు లభించిన ఆత్మీయ ఆతిథ్యానికి బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వాకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే బ్రిక్స్ కూటమిలో పూర్తిస్థాయి సభ్యదేశంగా చేరిన ఇండోనేషియా అధ్యక్షుడికి స్వాగతం పలికారని దమ్ము రవి వివరించారు. ఈ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనడాన్ని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ఎంతో విలువైనదిగా భావించారని ఆయన తెలిపారు. ఈ చేరికపై ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో కూడా స్పందించారు. సమ్మిళిత, సుస్థిర పాలన కోసం గ్లోబల్ సౌత్ దేశాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడమనే ఇతివృత్తంతో జరిగిన ఈ సదస్సులో ప్రపంచ సవాళ్లపై సభ్య దేశాల నేతలతో అభిప్రాయాలు పంచుకున్నట్లు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు.

ఆర్థిక, సాంకేతిక, విద్యారంగాల్లో జాతీయ ప్రయోజనాలను కాపాడుకుంటూ, న్యాయమైన ప్రపంచ సహకారానికి ఇండోనేషియా కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టనున్న నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని దమ్ము రవి పేర్కొన్నారు. వ్యవస్థాపక సభ్యదేశమైన భారత్ పాత్రను సదస్సులో ప్రత్యేకంగా గుర్తించారని తెలిపారు. ఈ సదస్సులో 11 శాశ్వత సభ్యదేశాలు, 9 భాగస్వామ్య దేశాలు, 8 ఆహ్వానిత దేశాలు, 7 అంతర్జాతీయ సంస్థల అధిపతులు పాల్గొనడం బ్రిక్స్‌కు పెరుగుతున్న ప్రాముఖ్యతను సూచిస్తోందని ఆయన అన్నారు.

# గ్రూప్-1 పిటిషన్లపై వాదనలు పూర్తి

### తీర్పు రిజర్వు చేసిన హైకోర్టు

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్వహించిన గ్రూప్-1పై అభ్యర్థులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారంతో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు.. తీర్పును రిజర్వు చేసింది. గత వారంలో గ్రూప్-1 పిటిషన్లపై వాదనలు విన్న హైకోర్టు.. సోమవారానికి వాయిదా వేసిన విషయం తెలిసిందే. సోమవారం విచారణ ప్రారంభం కాగానే ఈ రోజే వాదనలు పూర్తి చేయాలని.. ఏమైనా వాదనలు మిగిలి ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలని హైకోర్టు సూచించింది. అనంతరం ఇటు పిటిషనర్ల తరపు వాదనలు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) తరపున వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్లపై సోమవారం సుదీర్ఘ వాద ప్రతివాదనల అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది. పిటిషనర్ల తరపున న్యాయవాది వాదనలు వినిపిస్తూ మెయిన్స్ జవాబు పత్రాల రీవాల్యుయేషన్ చేయడం, పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని కోర్టును కోరారు. టిజిపిఎస్‌సి తరపు న్యాయవాది ఎస్ నిరంజన్ రెడ్డి పిటిషనర్ల తరపు వాదనలను తోసిపుచ్చారు. మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని పరీక్షా కేంద్రాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని పలువురు గ్రూప్-1 అభ్యర్థులు పిటీషన్లు దాఖలు చేశారు.

ఏప్రిల్‌లో ఈ పిటీషన్లపై వాదనలు జరిగిన సందర్భంలో గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు స్టే విధించింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మాత్రం పూర్తి చేయొచ్చని హైకోర్టు టిజిపిఎస్‌సిని ఆదేశించింది. గ్రూప్-1 అక్రమాలపై సిట్టింగ్ జడ్జి, కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయించాలని పిటీషనర్ల తరపు న్యాయవాదులు కోర్టును కోరారు. విచారణ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపిక కాని అభ్యర్థులు అపోహలతో పిటీషన్లు దాఖలు చేశారని, పారదర్శకంగా మూల్యాంకనం జరిగిందని టిజిపిఎస్‌సి తరపు సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. సోమవారం జరిగిన వాదనల సందర్భంగా.. వాదనలు మిగిలి ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలని న్యాయమూర్తి సూచించారు. గ్రూప్-1 నియామకాలపై ఉన్న స్టేను తొలగించాలని ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు దాఖలు చేసిన ఇంప్లీడ్ పిటీషన్‌లపైనా వాదనలు ముగిశాయి. సంవత్సరాల తరబడి కష్టపడి ఉద్యోగం సాధించినా కోర్టు కేసుల వల్ల సకాలంలో నియామకాలు జరగడంలేదని ఇంప్లీడ్ పిటీషనర్ల న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. తక్కువ మార్కులు వచ్చిన అభ్యర్థులు వేసిన పిటీషన్ల వల్ల ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వకపోవడం వల్ల నష్టం జరుగుతోందని వాదించారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

# అక్బరుద్దీన్‌కు హైడ్రా మినహాయింపు ఇచ్చిందా?

### రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమాధానం చెప్పాలి
### కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**మేడిపల్లి/ భీమారం, ప్రభాతవార్త :** అక్రమ నిర్మాణాల పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తున్న హైడ్రా అధికారులు చెరువులు, కుంటల్లో భవంతులు నిర్మించి కాలేజీలు, వ్యాపారాలు చేసుకుంటున్న అక్బరుద్దీన్ ఒవైసీ కుటుంబానికి మినహాయింపు ఇచ్చారా అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. మేడిపల్లి, భీమారం మండలాల్లో పర్యటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సోమవారం కేంద్ర ప్రభుత్వ నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. వెంకట్రావుపల్లెలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన వెంకట్రావుపల్లె స్కూల్‌ను సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్బరుద్దీన్ కాలేజీలో 10 వేల మంది విద్యార్థులు చదువు కుంటున్నందున అక్రమ నిర్మాణాలైనా వాటిని కూల్చలేమని చెబు తున్న హైడ్రా అధికారులు... ఏ జీవనాధారం, గూడు లేక మూసీ పరివాహక ప్రాంతాల్లో కట్టు కున్న గుడిసెల్లో, చిన్న చిన్న ఇండ్లను ఎందుకు కూల్చివేశారని నిలదీశారు. "అక్బరుద్దీన్ కుటుంబానికే విలువ ఉంటుందా? పేదల ప్రాణాలకు, జీవితాలకు విలువ లేదా? వాళ్లు మనుషులు కాదా? ఎంఐఎం నాయకులు పోలీసులను కొడితే చర్యలు తీసుకోరని, కరెంట్ బిల్లులు కట్టకుంటే వత్తాసు పలుకుతారా? ప్రభుత్వ, ప్రైవేట్ భూములను కబ్జా చేస్తే వత్తాసు పలుకుతారా? ఆఖరికి తీవ్రవాదులతో సంబంధాలున్న వాళ్లకు ఉద్యోగాలిచ్చి పోషిస్తుంటే పట్టించుకోరా? ఇదేం పద్ధతి.."అంటూ మండిపడ్డారు.

మీడియాపై దాడులు చేస్తుంటే ముఖ్యమంత్రి, ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. "రేవంత్ రెడ్డిగారు.. మీకు పౌరుషం లేదా? మిమ్ముల్ని ఆకారణంగా జైల్లో వేసి బెయిల్ రాకుండా చేశారు కదా? అవన్నీ మర్చిపోయి వాళ్లతో కుమ్మక్కైపోయారా? కాళేశ్వరం, ఈఫార్ములాసహా అనేక స్కాంలు చేసిన కేసీఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేసి బొక్కలో వేయడం లేదని నిలదీశారు. ప్రజాస్వామ్యాన్ని, మీడియా స్వేచ్ఛను కాపాడే విషయంలో బీజేపీ ముందుంటుందని చెప్పారు.



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్


**IN THE COURT OF DEBTS RECOVERY TRIBUNAL – 2 AT HYDERABAD**
**O.A.No.430 of 2025**

**Between:-**
**Canara Bank**, S.R. Nagar Branch
Rep. by its Authorized Officer .. Applicant
**And**
**Vedantham M. Vishnu Charan and another** .. Defendants
To
**2.Mr.Devulapalli Venkata Kiran Kumar,** S/o Satyanarayana, R/o Flat No. 301, Brinda Heights, Swaroopnagar, Uppal, Medchal Malkajgiri District - 500039.
... Respondent No.2

Please take notice that the above named Applicant filed the above case for recovery of money of **Rs.77,02,604=86 Ps**. against you with future interest. The above case is posted on **01/08/2025 for your appearance at about 10=30 A.M.** in person or through your counsel without fail, in default the matter will be decided in your absence as per law.

**(BY ORDER OF THE COURT)**
**B.N. SWAMIJI, B.SRIKANTH, K. JANARDHAN REDDY, Advocates,**
Flat No. 501, A-Block, Sai Brindavan Apartmets, Nagarjuna Nagar, Tarnaka, Secunderabad – 17. Ph. **9391036739,**
**Email : bnswamiji64@gmail.com**

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II**
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
**OA No. 305 OF 2025**
**BETWEEN:**
**M/s. Yes Bank Ltd.** ....APPLICANT
Vs
**M/s.SK Bio Extracts And Applications Private Limited & Ors.** ....Defendants
**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**
To,
1) **M/s. SK Bio Extracts And Applications Private Limited,** Represented by its Directors, Mr.Jonnavalasa Venkata Ramana Rao & Mrs.Lakshmi Srinivasan, B-12, Industrial Area, Moula Ali, Secunderabad-500040.
2) **Mr.Jonnavalasa Venkata Ramana Rao, S/o.Mr.Suranna Jonnavalasa, 14/12/1968,** 8-2-414, Road No.4, Animal Care Clinic, Banjara Hills, Hyderabad-500034.
**ALSO AT:**
**Mr.Jonnavalasa Venkata Ramana Rao** Director of M/s.SK Bio Extracts And Applications Private Limited, B-12, Industrial Area, Moula Ali, Secunderabad-500040.
3) **Mrs.Lakshmi Srinivasan, W/o.Mr.Srinivasan Krishnaswamy,** 14/12/1968, 8-2-414, Road No.4, Animal Care Clinic, Banjara Hills, Hyderabad-500034.
**ALSO AT:**
**Mrs.Lakshmi Srinivasan,** Director of M/s.SK Bio Extracts And Applications Private Limited, B-12, Industrial Area, Moula Ali, Secunderabad-500040.
....Defendants

Please take the summons in the above **O.A.No. 305 OF 2025** filed by the Applicant for Recovery of **Rs. 42,55,745.21/- (Rupees Forty Two Lakhs Fifty Five Thousand Seven Hundred Forty Five and Twenty One Paise Only)** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"VAARTHA"** Telugu Newspaper and posted the matter on **11/08/2025.**

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under; (i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **11/08/2025 at 10.30 a.m.** at **Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001,** in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this **03rd day of July, 2025.**

**(By order of the Tribunal)**
**Sd/- Registrar**
**Debts Recovery Tribunal-II, Hyderabad**

**BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II**
1st Floor, Triveni Complex, Abids, At: Hyderabad
**OA No. 306 OF 2025**
**BETWEEN:**
**M/s. Yes Bank Ltd.** ....APPLICANT
Vs
**Mr. Kethavath Srinu & Anr.** ....Defendants
**SUMMONS BY WAY OF PAPER PUBLICATION**
To,
1. **Mr. Kethavath Srinu, S/o. Mr. Kethavath Ramulu,** H.No.5-40, Padakal, Near Sai Baba Temple, Mahabubnagar, Telangana-509408
2. **Mrs. Kethavath Lalitha, W/o. Mr. Kethavath Srinu,** H.No.5-40, Venkatapuram Thanda, Talakondapally Mandal, Padakal, Near Sai Baba Temple, K.V.Ranga Reddy, Telangana-509408.
....Defendants

Please take the summons in the above **O.A.No. 306 OF 2025** filed by the Applicant for Recovery of **Rs. 50,15,157.37/- (Rupees Fifty Lakhs Fifteen Thousand One Hundred Fifty Seven And Thirty Seven Paise Only)** against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in **"VAARTHA"** Telugu Newspaper and posted the matter on **11/08/2025.**

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under; (i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on **11/08/2025 at 10.30 a.m.** at **Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001,** in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take Notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and seal of this Tribunal on this **03rd day of July, 2025.**

**(By order of the Tribunal)**
**Sd/- Registrar**
**Debts Recovery Tribunal-II, Hyderabad**

తెలంగాణ ప్రభుత్వం
**శంషాబాద్ మునిసిపాలిటీ కార్యాలయము, రంగారెడ్డి జిల్లా**
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
**Lr. No. E1/SHBM/100/Bonalu/2025** తేది: 04.07.2025
"శంషాబాద్ మునిసిపాలిటీలో బోనాలు పండుగ దృష్ట్యా వివిధ దేవాలయాల వద్ద LED టీవీలు అద్దెకు తీసుకోవడం, Mic సెట్ అర్చ్ మరియు ఫ్లెక్స్" కొరకు నమోదిత కాంట్రాక్టర్ల నుండి టెండర్లు కోరబడుతున్నవి. కమిషనర్, శంషాబాద్ మునిసిపాలిటీ వారిచే టెండర్లు 10.07.2025 సా.04.55 వరకు స్వీకరించబడి వాటిని అదే తేదీన సా.04-58 వద్ద టెండర్‌దారులు లేదా వారి ప్రతినిధుల సమక్షంలో శంషాబాద్ కమిషనర్ గారిచే తెరువబడును. పిలవబడిన టెండర్ల షెడ్యూల్ ఈ క్రింది విధంగా:- 1) టెండర్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ యొక్క తేది: 04.07.2025 సా.04.55 వద్ద. 2) ఇ-ప్రొక్యూర్‌మెంట్ పై టెండర్ల దాఖలు: 10.07.2025 సా.04.55 వద్ద. 3) టెండర్లు తెరుచుట: 10.07.2025, సా.04.58 వద్ద. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్లాట్‌ఫారం https://tender. telangana.gov.in వీక్షించండి. లేదా శంషాబాద్ మునిసిపాలిటీ కార్యాలయం సంప్రదించండి. కాంటాక్ట్: 7337323577/7337336191.
సం/- కమిషనర్, శంషాబాద్ మునిసిపాలిటీ
DIPR.No.4694-PP/CL/Advt/1/2025-26, తేది: 07.07.2025

**భారత్ డైనమిక్స్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వ సంస్థ, రక్షణ మంత్రిత్వశాఖ)
గచ్చిబౌలి, హైదరాబాద్: - 500 032
**Ref:BDL/CC/OT/GT/001/2025-26** తేది: 08.07.2025
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
స్వదేశీ పోటీ బిడ్డింగ్ ఆహ్వానిస్తూ

| క్ర. సం. | టెండర్ ID | వివరణ | అంచనా రూ.లలో |
| --- | --- | --- | --- |
| 1 | 65963 | BDL-KBU వద్ద EB-VII & స్టోరేజ్ క్యూబికల్స్ వద్ద ప్రస్తుతం వున్న ట్రావెర్స్ వాల్ పటిష్ఠపరచుట. | 589.07 లక్షలు |

తదుపరి వివరాలకు డ్యాష్ బోర్డ్ పై సెలక్ట్ ఆఫ్‌లైన్ టెండర్స్ https://bdltenders.abcprocure.com వెబ్‌సైట్ దయచేసి వీక్షించండి. బిడ్స్ ఆఫ్‌లైన్‌లో మాత్రమే దాఖలు చేయవలెను. "సవరణ ఏవైనా మా ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే జారీ చేయబడును. మరియు వార్తా పత్రికలలో కాదు".
• బిడ్డరులు BDL వెబ్‌సైట్ https://bdl-india.in/registration-contractors ప్రోస్పెక్ట్స్‌లో విక్రేత రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ కొరకు దరఖాస్తు చేయవలసినదిగా కోరుతున్నాము.
అడిషనల్ జనరల్ మేనేజర్ (Corp Comml)

వార్త

స్వార్థం కోసమే జీవించే వ్యక్తి, తన మరణం ద్వారా ప్రపంచానికి లాభాన్ని చేకూరుస్తాడు.

-టెర్టుల్లియన్

# అనుకున్న 'రాజకీయ' మే!


అనుకున్నంతా జరిగింది. అమెరికా రాజకీయ, సామాజిక యవనికపై మరో రాజకీయ పార్టీ పురుడు పోసుకుంది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నంత పనీ చేసారు. అమెరికా రాజకీయాల్లో శూన్యత ఏర్పడితే ఎలాంటి పరిస్థితులు ఏర్పడతాయో ముందుగానే పసిగట్టి, ఏకంగా 'పోల్' నిర్వహించిన మస్క్ అమెరికన్‌ల సంక్షేమం కోసం ముందడుగువేశారు. అమెరికాలో కనీసం 80 శాతం మంది ప్రజానీకం కొత్త పార్టీకి ఆశీస్సులందిస్తారనే ఒకే ఒక నమ్మకంతో ఏర్పడిన 'అమెరికా పార్టీ' మస్క్ అనే మీడియా టైకూన్ ఆలోచనల నుంచి పుట్టింది. అమెరికా అంటేనే డెమోక్రటిక్ పార్టీ, రిపబ్లికన్ పార్టీల మధ్య అటునిటుగా సాగే విన్యాసాల మధ్య ఊగిసలాడే రాజకీయాలు నడిచే దేశం. ఇక్కడ మూడో పార్టీకి చోటుండదని గతంలో ఒకటి రెండు సార్లు తేలిపోయింది. ట్రంప్ మొండితనంతో రూపొందించుకున్న 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' అన్ని అవాంతరాలు దాటి ఆయన సంతకంతోనే బాహ్య ప్రపంచాన్ని చూసింది. ఆ బిల్లుకు ప్రజల నుంచి పూర్తి వ్యతిరేకత వస్తుందని, ఆ బిల్లు అమలైతే అమెరికా ఖజానాకు బాగా నష్టం వస్తుందని ఎలోన్ మస్క్ ఎన్నికల ముందు నుంచీ ట్రంప్‌ను హెచ్చరిస్తూనే ఉన్నారు. ఆ బిల్లు అమలులోకి వస్తె తాను అమెరికన్ల సంక్షేమం కోసం అమెరికన్ పార్టీ పెడతానని మస్క్ ముందే ప్రకటించారు. ఎవరి పంతాలను వారు విడిచి పెట్టలేదు. మస్క్ చెప్పినట్లుగానే కొత్త రాజకీయ పార్టీ జూలై 5, 2025న అధికారికంగా ప్రారంభించారు. తొలి సందేశంలోనే ఆయన 'మీ స్వాతంత్ర్యాన్ని వెనక్కి తీసుకురావడానికి ఈ పార్టీ ఏర్పాటైనట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎందుచేతనో అమెరికాలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం కొరవడినందున, ప్రజలకు స్వేచ్ఛనిచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించారు. యునైటెడ్ స్టేట్స్‌లోని సాంప్రదాయ ద్విపార్టీ వ్యవస్థను సవాలు చేసే లక్ష్యమే ఇక్కడ కనపడుతోంది. మస్క్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్', ద్వారా పార్టీకి బలమైన ప్రజా మద్దతు కూడగట్టడం సాధ్యమేనని తెల్చుకున్న తర్వాతనే మస్క్ పార్టీని ప్రకటించారు. 1.2 మిలియన్లకు పైగా ప్రతిస్పందనలను సంపాదించిన ఈ పోల్‌లో నిర్ణయాత్మక మెజారిటీ కనిపించింది. కొత్త రాజకీయ పార్టీకి అనుకూలమనే హేతుబద్ధత సూచించింది. అమెరికా పార్టీ అమెరికన్లకు సంపూర్ణ స్వేచ్ఛను పునరుద్ధరించడమే కాదు మధ్యేవాద ఓటర్లకు ప్రాతినిధ్యం వహించడం కూడా అవసరమని సంకల్పించింది. ప్రస్తుత రెండు పార్టీల వ్యవస్థకు చెక్ పెట్టాలని మస్క్ యోచన. తన ఆలోచనకు అమెరికన్ ప్రజల అంతరాంతరాలలో ఉన్న అభిప్రాయాలు కలిసి రాజకీయ పునరేకీకరణ జరుగుతుందని ఆయన నమ్మిక. రుణనియంత్రణ, సైన్యం ఆధునీకరణ, కృత్రిమ మేధలో ప్రపంచం గర్వించే విధంగా అమెరికాను తీర్చిదిద్దడమే అమరికా పార్టీలక్ష్యంగా ప్రకటించడం విశేషం. ఏ ఉద్దేశ్యంతో మస్క్‌పార్టీ పెట్టినా ఇప్పుడు నేరుగా జరుపుతున్న యుద్ధం శ్వేత సౌధాధిపతి డోనాల్డ్ ట్రంప్ పైనే! మస్క్‌కు అమెరికా అధ్యక్షుడవ్వాలన్న కోరికా లేదు. అమెరికన్ కానందున ఆ అవకాశమూ లేదు. దేశీయ వ్యయ ప్రణాళికపై మస్క్ మాజీ మద్దతుదారు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో విడిపోయిన తర్వాత పార్టీ నిర్ణయం జరిగింది. పెరిగిన జాతీయ రుణం గురించిన ఆందోళన కారణంగానే మస్క్ ట్రంప్‌ను వ్యతిరేకించాడు. అయితే ట్రంప్ ఆలోచనలు వెర్రితలలు వేసి మస్క్ పీకల మీదకు తెచ్చాడు. ట్రంప్ ప్రణాళిక అంతా మస్క్ వ్యాపారాలను దెబ్బతీయడానికేనా అన్నట్లు తయారయ్యింది. చివరకు మస్క్‌కు అమెరికాలో నిలువ నీడలేకుండా తమ దేశాన్నుంచితరిమి కొట్టడానికి కూడా ట్రంప్ సాగిస్తున్నాడు. అంతటిస్థాయిలో వారిద్దరి మధ్య విభేధాలు పొడసూపాయి. రాబోయే ఎన్నికలలో మస్క్ పార్టీ గణనీయమైన పాత్ర పోషించే అవకాశాన్ని కాదనలేం. అమెరికన్ల ఆకాంక్షలను తీర్చాలన్న కృత నిశ్చయం కనపడుతోంది. కానీ కొత్తపార్టీ ఆవిర్భావం ఇప్పటికిప్పుడు చెప్పుకోదగిన ప్రభావం చూపకపోయినా రానురాను ట్రంప్ పాలనపై వ్యతిరేకపవనాలు ఏర్పడడానికి ఒక కారణం కావచ్చు. అంటే అమెరికా రాజకీయాల్లో ఎంతో కొంత అస్థిరతను తీసుకురాగలదు. ఈ పార్టీ నిర్దిష్ట సెనేట్ సీట్లు, హౌస్ జిల్లాలపై దృష్టి పెట్టవచ్చని, 23సెనేట్ సీట్లు, 810 హౌస్ జిల్లాలను లక్ష్యంగా చేసుకోవచ్చని మస్క్ ఇప్పటికే సూచించారు. ముందు ముందు చట్టాలను నిలువరించడంలో ఈ సీట్లు ఘననీయమైన ప్రభావం చూపగలరు. 'అమెరికాయే ఫస్ట్' అనే ఏకైక నినాదంతో ట్రంప్ కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్ళడం మంచిదే కావచ్చు. కానీ ట్రంప్ దూకుడు, మొండితనం తో తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం అమెరికాయేతర దేశాలకు ముఖ్యంగా భారత దేశానికి చేటు తెచ్చే స్థాయికి చేరింది. ఇవి ఏ మేరకు అమెరికాకు మేలు చేస్తాయో కొంత కాలం వేచి చూడాల్సిందే! సంపన్నులకు ప్రయో జనాలు కల్పించడమే కాదు వృద్ధులకిచ్చే రాయితీల్లో కోత ట్రంప్ బిల్లులో విమర్శల నెదుర్కుంటోంది. మెడ్ ఎయిడ్ ప్రయోజనాల్లో కోత కూడా ప్రజలు హర్షించడం లేదు. పైగా ఈ బిల్లులో అమెరికా ఆర్థిక దివాళా కోరుతనాన్ని కనిపిస్తోంది. స్థూల జాతీయోత్పత్తిలో అమెరికా ప్రపం చంలోనే దేశంగా వెలుగొందుతున్న అమెరికా ఆర్థిక ప్రగతి లో ఏమాత్రం వెనుకబాటుతనం లేదు. కానీ కొత్త' వన్ బిగ్ బిల్లు' చలామణీలోకి వస్తే అమెరికాను అంధకారం లోకి తోసేస్తుందని ఎలాన్ మస్క్ చెప్పిన గతే పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు!

జీవితానికి విశ్వాసం పునాదిలా ఉండాలి. విశ్వాసం లేకుండా ఏ పని చేసినా వ్యర్థమే.



జె.ముర్రే

ఇతరులలో మంచిచూడలేకపోవడం, మనలో మంచితనం లేకపోవడాన్నే సూచిస్తుంది.




సోక్రటీస్

# ఉపాధి నైపుణ్యావకాశాలకు కొత్త ఊపిరి

**మొత్తం బడ్జెట్ రూ.99,446 కోట్లు. ఈ మొత్తం బడ్జెట్ కేటాయింపు పథక మొత్తం కార్యాచరణ కాలానికి అంటే 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 వరకు ఉత్పాదక రంగానికి విస్తరించిన ప్రయోజనాలతో సహా సంబం ధించినది. ఇది పూర్తిగా కేంద్ర బడ్జెట్ నుండి నిధులు పొందుతుంది. ఈ మొత్తం కేటాయింపు పథక పూర్తి కాలానికి సంబంధించినది, ప్రత్యేకంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి మాత్రమే కాదు అని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఈ మొత్తం నుండి సంవత్సరాల వారీగా నిధుల పంపిణీ పథక వాస్తవ స్వీకరణ సృష్టించబడిన ఉద్యోగాల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. దీనికి స్పష్టమైన లక్ష్యాలు, నిర్దిష్టమైన అమలు పద్ధతులు, ప్రత్యేకమైన లక్షిత వర్గాలు ఉన్నాయి. ప్రధాన లక్ష్యాలు ఏమిటంటే 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 వరకు రెండు సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా 3.5 కోట్ల ఉద్యోగాలను సృష్టించడానికి ప్రోత్సాహాన్ని అందించడం. మరొక ముఖ్యమైన లక్ష్యం, కార్మికులను అధికారిక రంగంలోకి తీసుకురావడం.**

డి జె మోహన రావు

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమాలలో ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహక పథకం ఒకటి. ఇది కేంద్ర బడ్జెట్ 2024-25లో 4.1 కోట్ల యువతకు ఉపాధి, నైపుణ్య అవకాశాలను సులభతరం చేయడానికి ఉద్దేశించిన ఐదు పథకాల మెగా ప్యాకేజీలో భాగంగా అధికారికంగా ప్రకటించారు. గతంలో వివిధ ఉపాధికల్పన ప్రోత్సాహక పథకాలు (మహమ్మారి సమయంలో ఆత్మ నిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన వంటివి) ఉన్నప్పటికీ ఈ పథకం దీర్ఘకాలిక ఉద్యోగ కల్పన, అధికారికీకరణ, కొత్త ఉద్యోగులకు వారి యజమానులకు ప్రత్యక్ష మద్దతుపై ప్రత్యేక దృష్టి సారించిన ఒక విన్నూత్న కార్యక్రమం. ముఖ్యంగా ఉత్పాదక రంగానికి బలమైన ప్రాధాన్యత ఇస్తుంది. కేంద్ర మంత్రి వర్గం ఈ పథకాన్ని 2025 జూలై 1న ఆమోదించి బడ్జెట్ 2024-25లో ప్రకటించినప్పటికీ ప్రయోజనాలకు అర్హత, వాస్తవ అమలు 2025 ఆగస్టు 1 నుండి ప్రారంభమవుతుంది. ఈపథకం ప్రయో జనాలు 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 మధ్య సృష్టించబడిన ఉద్యోగాలకు వర్తిస్తాయి. మొత్తం బడ్జెట్ రూ.99,446 కోట్లు. ఈ మొత్తం బడ్జెట్ కేటాయింపు పథక మొత్తం కార్యాచరణ కాలానికి అంటే 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 వరకు ఉత్పా దక రంగానికి విస్తరించిన ప్రయోజనాలతో సహా సంబం ధించినది. ఇది పూర్తిగా కేంద్ర బడ్జెట్ నుండి నిధులు సమకూరుస్తుంది. ఈ మొత్తం కేటాయింపు పథక పూర్తి కాలానికి సంబంధించినది, ప్రత్యేకంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి మాత్రమే కాదు అని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఈ మొత్తం నుండి సంవత్సరాల వారీగా నిధుల పంపిణీ పథక వాస్తవ స్వీకరణ సృష్టించబడిన ఉద్యోగాల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. దీనికి స్పష్టమైన లక్ష్యాలు, నిర్దిష్టమైన అమలు పద్ధతులు, ప్రత్యేకమైన లక్షిత వర్గాలు ఉన్నాయి. ప్రధాన లక్ష్యాలు ఏమిటంటే 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 వరకు రెండు సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా 3.5 కోట్ల ఉద్యోగాలను సృష్టిం చడానికి ప్రోత్సాహాన్ని అందించడం. మరొక ముఖ్యమైన లక్ష్యం, కార్మికులను అధికారిక రంగంలోకి తీసుకురావడం. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనాలను అనుసంధానించడం ద్వారా వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించడం. ఈ పథకం, కొత్త ఉద్యోగులు అధికారిక శ్రామిక శక్తిలో చేరడానికి యజమానులు అదనపు, స్థిరమైన ఉద్యోగాలను సృష్టించడానికి ఆర్థిక సహాయం అందిస్తూ తద్వారా ఉద్యోగ సామర్థ్యాన్ని, సామాజిక భద్రతను పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనితో పాటు ఉత్పాదక రంగంలో ఉద్యోగ కల్పనకు ప్రత్యేక ప్రోత్సాహాన్ని ఇవ్వడం ద్వారా ఈ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. మొదటిసారి అధికారిక రంగంలోకి ప్రవేశించే యువకులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించడమంటే వారి జీవనోపాధి స్వర్గతుల్యం చేయడమే.



ఈ ప్రతిష్టాత్మక లక్ష్యాలను సాధించడానికి పథకాన్ని రెండు విభిన్న భాగాలుంటే, వారిలో ప్రథమ భాగం తొలిసారి ఉద్యోగంలో చేరే వారికి ప్రోత్సాహకాలు అందించడంపై దృష్టి సారిస్తుంది. ఇందులో అధికారిక శ్రామిక శక్తిలో చేరి ఈపీ ఎఫ్ఓలో నమోదు చేసుకున్న మొదటిసారి ఉద్యోగులను గుర్తిస్తారు. అర్హత కోసం, ఉద్యోగులు నెలకు రూ. 1 లక్ష వరకు సంపాదించాలి. ప్రోత్సాహకం రెండు వాయిదాలలో పంపిణీ చేస్తారు. మొదటి వాయిదా, ఒక నెల ఈపీఎఫ్ వేతనానికి సమానం (గరిష్టంగా రూ. 15,000) ఆరు నెలల సేవ తర్వాత అందించబడు తుంది. రెండవ వాయిదా 12 నెలల సేవ తర్వాత ఉద్యోగి ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత విడుదల చేస్తారు. ఈ భాగం కింద అన్ని చెల్లింపులు లబ్ధిదారుడి పాన్ అనుసంధానిత ఖాతాకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా చేస్తారు. కొత్తగా చేరే వారిలో పొదుపును ప్రోత్సహించడానికి ప్రోత్సాహ కంలో కొంత భాగం నిర్ణీత వ్యవధికి తర్వాత నిలిపివేస్తారు. ద్వితీయ భాగం యజమానులకు ముఖ్యమైన సహాయాన్ని అందిస్తుంది. అర్హత పొందడానికి, యజమానులు ఈపీఎఫ్ఓలో నమోదు చేసుకుని అదనపు స్థిరమైన ఉద్యో గాలను సృష్టించినట్లు నిరూపించాలి. 50 మంది కంటే తక్కువ ఉద్యోగులు ఉన్న చిన్న సంస్థల కోసం, కనీసం ఇద్దరు అదనపు ఉద్యోగులను కనీసం ఆరు నెలల పాటు నిరంతరంగా నియమించుకోవాలి. 50 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న పెద్ద సంస్థలు, అదే వ్యవధిలో కనీసం ఐదుగురు అదనపు ఉద్యోగులను నియమించుకోవాలి. యజమానులకు అందించే ప్రోత్సాహకం కొత్త ఉద్యోగులకు నెలకు రూ. 1 లక్ష వరకు జీతం ఉన్న వారికి వర్తిస్తుంది. యజమానులు అదనపు ఉద్యోగికి నెలవారీ ఆర్థిక సహాయాన్ని పొందుతారు. ఇది ఉద్యోగి ఈపీఎఫ్ వేతనం స్లాబ్‌పై ఆధారపడి ఉంటుంది. 10,000 రూపాయల వరకు వేతనాలకు రూ. 1,000, 10,000 రూపాయల నుండి 20,000 రూపాయల వరకు వేతనాలకు 2,000 రూపాయల, 20,000 రూపాయల నుండి 1 లక్ష రూపాయల వరకు వేతనాలకు 3,000 రూపాయల. ఈ ప్రోత్సాహకం చాలా రంగాలలో ప్రతి అదనపు ఉద్యోగికి రెండు సంవత్సరాల వరకు వర్తిస్తుంది. అయితే ఉత్పాదక రంగంలోమాత్రం ఇది మూడవ, నాల్గవ సంవత్సరాలకు కూడా కొనసాగిస్తారు. ఈ చెల్లింపులు కూడా యజమానుల పాన్ అనుసంధానిత ఖాతాలకు నేరుగా బదిలీ చేయబడతాయి. ఈ పథకం వ్యూహాత్మకంగా రెండు ప్రధాన వర్గాలను లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా అధికారిక శ్రామిక శక్తిలో ప్రవేశించి ఈపీఎఫ్ఓలో నమోదు చేసుకున్న వ్యక్తులకు. ఈ విభాగంలో సుమారు 1.92 కోట్ల మంది లబ్ధి పొందుతారని అంచనా. రెండవది ఇది యజమానులను లక్ష్యంగా చేసు కుంది. ముఖ్యంగా ఉత్పాదక రంగంలో ఉన్న వారితో సహా అన్ని రంగాలలో ఉన్న వారిని. వీరు ఈపీఎఫ్ఓలో నమో దు చేసుకుని, కొత్త సిబ్బందిని నియమించుకోవడం, నిలుపుకోవడం ద్వారా అదనపు ఉద్యోగాలను సృష్టించే వ్యాపారాలు, సంస్థలు. ఈ యజమాని ప్రోత్సాహకాల ద్వారా సుమారు 2.6 కోట్ల ఉద్యోగాలను సృష్టించడానికి ప్రోత్సాహం లభిస్తుందని పథకం ఆశిస్తోంది. ●

# జనగణన సమాజ నిర్మాణానికి పునాది

వెంకటరమణ గిలకత్తుల

ప్రతి సమాజ అభివృద్ధికి గణాంకాలు ముఖ్యఆధారాలు. ప్రజల జనాభా, వయస్సు, లింగ నిష్పత్తి, విద్యాస్థాయి, ఉపాధి, నివాస పరిస్థితులు వంటి అంశాలపై సమగ్ర సమాచారం లేకుండా పాలనా ప్రణాళికలు రూపు దిద్దుకోలేవు. ఈ నేపథ్యంలో జనగణన అనేది దేశంలోని ప్రతి పౌరుడిని లెక్కించి, వారి వివరాలు సేకరించే సమగ్ర, శాస్త్రీయ ప్రక్రియగా నిలుస్తుంది. ఇది ప్రజల సంక్షేమానికి, అభివృద్ధి లక్ష్యాల సాధనకు, పారదర్శక పాలనకు ముఖ్యమైన ఆధారంగా మారుతుంది. భారతదేశంలో ఈ ప్రక్రియను హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్ సెన్సస్ కమిషనర్ కార్యాలయం నిర్వహిస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేకరించిన వ్యక్తిగత సమాచారం గోప్యతతో నిర్వహించబడుతుంది. జనగణన అనేది ఒక దేశం లేదా ప్రాంతంలో నివసించే ప్రజల గణాంకాలను ఒకే సమయంలో, అధికారికంగా, సులభ పద్ధతిలో సేకరించే వ్యవస్థ. భారతదేశంలో మొట్టమొదటి అధికారిక జనగణన 1872లో లార్డ్ మాయో పాలనలో ప్రారంభమైంది. ఆపై 1948 జనాభా గణనచట్టం ప్రకారం ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహించడం చారిత్రక సంప్రదాయంగా మారింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం, ప్రతి జనగణన అనంతరం పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చట్టాన్ని అమలు చేస్తుంది. ఈ డేటా దేశ జనాభాలోని సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ, వృత్తిపరమైన మార్పులను ప్రతిబింబిస్తుంది. స్వీయ లిఖిత ఫారాలు (ఆన్‌లైన్ లేదా పోస్టు), ఇంటింటి గృహాల సర్వేలు, అధికారిక పన్ను, ఓటరు రికార్డుల ఆధారంగా సమాచారం సేకరణ జరుగుతుంది. డీ ఫాక్టో పద్ధతిలో వ్యక్తి జనగణన రోజున ఎక్కడ ఉంటే అక్కడ లెక్కింపు జరుగుతుంది. డీ జ్యూర్ పద్ధతిలో సాధారణ నివాస స్థలాన్ని ఆధారంగా తీసుకుంటారు. ఆధునిక పద్ధతులైన మ్యాపింగ్, రిమోట్ సెన్సింగ్, డిజిటల్ డేటా ప్లాట్‌ఫామ్‌లు లెక్కింపును వేగ




వంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇవి సమాచారాన్ని ఖచ్చితంగా, సమగ్రంగా సేకరించేందుకు మార్గం వేస్తాయి. జనగణన ద్వారా ప్రభుత్వం ప్రజల అవసరాలను అంచనా వేసి విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, పారిశ్రామికీకరణ వంటి రంగాల్లో సంక్షేమ పథకాలను రూపొందించగలుగుతుంది. రాష్ట్రాల సరిహద్దులు, నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల సవరణ వంటి రాజకీయ నిర్మాణాలకు ఇది బేస్‌లైన్‌గా ఉపయోగపడుతుంది. అలాగే, ఆర్థిక సంఘం రాష్ట్రాలకు మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపు కూడా జనగణన డేటాపైనే ఆధారపడుతుంది. అంతేకాక, అంతర్జాతీయ ప్రమాణాలు, గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇండెక్సులు రూపొందించడంలో ఈ గణాంకాల పాత్ర కీలకం. జనగణన ఒక శాస్త్రీయ ప్రక్రియ అయినప్పటికీ, దానిని అమలు చేయడంలో పలు సవాళ్లు ఎదురవుతాయి. వ్యక్తిగత గోప్యత, డేటా భద్రత అత్యంత ప్రాముఖ్యం. వలసదారులు, నిరాశ్రయులు, గిరిజనులు, కొండ, లోయ ప్రాంతాల్లో ఉన్న వర్గాలను లెక్కించడంలో ప్రత్యేక చర్యలు అవసరం. కోవిడ్ వంటి మహమ్మారి పరిస్థితులు జనగణన ప్రక్రియను అంతరాయం కలిగించగలవు. అపోహలు, తప్పుడు సమాచారాలవంటి సమస్యలకు పరిష్కారంగా ప్రజల్లో అవగాహన పెంపు, మీడియా, విబీవీలు, ప్రజాపాలకులతో సమన్వయం అవసరం. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పారదర్శకత, వేగం, ఖచ్చితత్వం మెరుగుపరచవచ్చు. జనగణన అనేది కేవలం గణాంక లెక్కింపే కాదు ఇది దేశఅభివృద్ధికి మార్గదర్శి, ప్రజాస్వామ్యానికి పరిపూర్ణ నాంది. ఇది సమాజంలోని మార్పులను అర్థం చేసుకోవడంలో, పాలనను ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చడంలో కేంద్ర బిందువుగా నిలుస్తుంది. ఆధునిక సాంకేతికతతో, చట్టపరమైన భద్రతతో, ప్రజల భాగస్వామ్యంతో కూడిన సమగ్ర జనగణన దిశగా భారత దేశం పురోగమించాలి. ఎందుకంటే గణాంకాలు లేని అభివృద్ధి అనేది దిశా రహిత ప్రయాణం. ఈ ప్రక్రియలో ప్రతి పౌరుడు చురుకైన భాగస్వామిగా ఉండాలి. ●

# ప్రజావాక్కు



## పిల్లలను ఆటలాడిద్దాం

క్రీడలు కేవలం ఉల్లాసానికే కాదుమానసిక వికాసం, శారీరక బలానికి ఎంతో అవసరం. తల్లిదండ్రులు తమ పిల్లల బాల్యాన్ని ఆటలకు దూరం చేస్తున్నారు. వసతులు లేమి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకొరత, పాఠశాలల్లో పోటీతత్వం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. పాఠశాల స్థాయి నుంచి చదువులపై ఒత్తిడి అధికమవుతుంది. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు క్లాసులే క్లాసులు. అదనపు బోధనతో వారి విరామ సమయాన్ని ఉపాధ్యాయులు లాగేసుకుంటున్నారు. దొరికిన కాస్త విరామ సమయం స్మార్ట్‌ఫోన్లు ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రతికూలతలు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ప్రతిపాఠశాలలోవ్యాయామ ఉపాధ్యాయులు నియామకం చేసి క్రీడాపరికరాలు అందజేయాలి.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

## టైమ్ బోర్డును ఏర్పాటు చేయాలి

పల్లె నుండి పట్నం వరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి బస్సు ప్రయాణ మార్గంలో ఉన్న ప్రతి విద్యాసంస్థ వద్ద బస్సు ఆగేవిధంగా ప్రభుత్వం కృషి చేయాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్, బస్సులలో ప్రయాణం చేయడం జరుగుతుంది. ప్రతి విద్యా సంస్థ వద్ద రిక్వెస్ట్ బస్సు స్టాఫ్ ఏర్పాటు కూడా చేయాలి. అవసరమైన చోట బస్ షెల్టర్ కూడా ఏర్పాటు చేయాలి. బస్సుల సమయ పాలన సూపించే బోర్డు కూడా ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు, సిబ్బందికి రాయితీ బస్సు పాసులు జారీ చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

## హామీలను నెరవేర్చాలి

ఎన్నికల సమయంలో వివిధ పార్టీలు మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పక నెరవేర్చాలి. ఎన్నికల సమయంలో మానిఫెస్టోను ఎన్నికల సంఘం నిర్ధారించాలి. హామీలు నెరవేర్చేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. హామీలు నెరవేర్చని ప్రభుత్వం పార్టీ గుర్తింపును రద్దు చేయాలి. అలాగే ప్రభుత్వం ఏర్పడ్డాక బడ్జెట్ నిధులను ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పారదర్శకంగా పని చేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

## మెట్రో స్టేషన్లలో పబ్జీ ఆటలు

హైదరాబాద్‌లోని వివిధ మెట్రో స్టేషన్‌లలో మెట్ల దగ్గర యువత గుంపులుగా చేరి సెల్‌ఫోన్‌లో పేకాట, పబ్జీ లాంటి ఆటలు ఆడి చెడు మార్గంలో పయనిస్తున్నారు. మెట్రో ప్రయాణికులకు దారి ఇవ్వకుండా మెట్ల మీద కూర్చొని ధూమపానం, గంజాయి సేవిస్తున్నారు. సికింద్రాబాద్, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌లలో వీరి ఆగడాలు శృతి మించి పోతున్నాయి. అమ్మాయిలను కూడా ర్యాగింగ్ చేస్తూ వికృత ఆనందం పొందుతూ వున్నారు. కాలేజీలకు వెళ్లి చదువుకోకుండా మెట్రో స్టేషన్‌లలో టైంపాస్ చేస్తూ వున్నారు. పోలీసుల నిఘా లేకపోవడం వల్ల వీరి ఆగడాలకు అంతులేదు. పోలీసు శాఖ మెట్రో అధికారులు స్పందించి వీరి ఆగడాలకు కళ్లెం వేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

## ప్రపంచ శాంతికి పాటుపడాలి

క్వాడ్ ఇటీవల ఒకస్పష్టమైన వైఖరిని తీసుకుంటున్నట్లు తోస్తుంది. అది చైనాకి వ్యతిరేకంగా అని మాత్రమే చెప్పవచ్చు. దాని వైఖరి మూలంగానే ఇండో పసిఫిక్ అని అమెరికా తన వాణిజ్య సంబంధాలను మార్చుకుంది. అయితే ఇదేమి కాకతాలీయం కాకపోగా ఇప్పుడు కనపడుతున్న నిజమైన దృశ్యం. ఇకపోతే కోవిడ్ దరిమిలా చైనా తనఉత్పత్తి వ్యవస్థలు అతలాకుతలమయ్యాయి. తద్వారా తన ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం వాటిల్లింది. కానీ తిరిగి పుంజుకొని పాకిస్థాన్ వంటి దేశాల సహాయంతో అది తన ఆధిపత్యం చూపించాలి అనుకుంటుంది. ఇక్కడే భారత్ వంటి దేశాలు తమ అస్తిత్వం కాపాడుకుంటూనే ప్రపంచ శాంతికి సామరస్యాన్ని కాపడవలసి ఉంది.

- భారత అవినాష్, జనగామ

## లింగ సమానత్వం ఆందోళనకరం

మన జనాలకు ముఖ్యగా తెలుగు జనాలకు యాక్టర్ల పిచ్చి, సినిమాల పిచ్చి, ఫోటోల పిచ్చి చాలా ఎక్కువే. అటు పెళ్ళి మర్యాదలైన, ఇటు చామత్కారాలైన అతి కొంచెం కనపడుతూ వుంటుంది. అంలాటి సందర్భంగానే మొన్న శ్రీచాగంటి వారు అనుభవించింది. ప్రవచన కారులను పిలిచి, వారి ప్రవచనాలు విని ఆనందించే సమయములో, అదియును శ్రీ రోశయ్య గారి స్మరణ సభలో. ఫోటోల కోసం అర్రులు చాపే పెద్దలకు కొంచెమైనా ఆలోచన ఉండాలి. అందుకే అయన సుత్తిమెత్తగా మొట్టికాయలు వేశారు. దీన్ని కొందరు పెద్దలు, మీడియా 'ప్రవచనకర్తలఅవహనం'అంటూస్టేట్మెంట్‌లుఇవ్వడం మానుకోవాలి.


-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

# అన్నదాతల ఆత్మహత్యలు ఇంకెంతకాలం?



డా॥ ఎ. నాగరాజ నాయుడు

నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో రైతులు లాభంలోఉన్నారా? వారు చేసే వ్యవసాయం లాభార్జనతో ఉన్నదా? దేశంలో రైతాంగానికి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కావాల్సింది ఏమిటి? ఒకటి వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం తద్వారా రైతు ఆదాయాన్ని పెంచడం. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో 500 శాతం వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినాయి. రెండవది వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర అమలు చేయడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం. ఇక్కడనే మన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అనేక దశాబ్దాల వెనక్కి తిరిగి చూసుకుంటే హరిత విప్లవం ద్వారా దేశంలో వ్యవసాయ ఉత్పత్తి భారీగా పెరిగినప్పటికీ వ్యవసాయదారుల స్థితిగతులు మాత్రం రానురాను దిగజారిపోతున్నాయి. రైతుకు గనుక స్వామినాథం కమిటీ సూచన తరహాలో గిట్టుబాటు ధర ఇస్తే అది వినియోగదారుల ధరల పెరుగుదల రూపంలో భారం అవుతుందనేది ప్రభుత్వ విధానం. అయితే అసలు సమస్య వినియోగదారులది కాదు. కార్పొరేట్ యాజమాన్యాలది. ఎలాగంటే రైతాంగానికి కనీసం మద్దతు ధర ఇవ్వడం వల్ల నగర ప్రాంతాల్లో వినియోగదారులకు ధరలు పెరగాయనుకుందాం. ఈ వినియోగదారుల్లో అత్యధికులు కార్మికులు ఉద్యోగులే ఉంటారు. వీరి ధరల భారాన్ని భరించలేక తమ యాజమాన్యాలను అధిక వేతనాల కోసం డిమాండ్ చేస్తారు. అది అసలు కథ అంటే రైతుకు మద్దతు ధర ఇవ్వడం వల్ల ఉద్యోగాలు కార్మికులు అధిక వేతనాల కోసం కార్పొరేటర యాజమాన్యం మీద ఒత్తిడి తెస్తారు. కార్పొరేట్లకు ఇబ్బంది కలుగుతుంది. కాబట్టే ప్రభుత్వం మద్దతు ధరలకు సుముఖంగా లేదు. కార్మికులను ఉద్యోగులను సాధ్యమైనంత తక్కువ వేతనాలతో పని చేయించుకోవడం కార్పొరేట్ల స్వభావం. లాభాలను పెంచుకోవడం కోసం వారికి ఇది అవసరం. దీనికోసం నగర ప్రాంతాల్లో నిత్యవసరాల ధరలు సాధ్యమైనంత తక్కువ ఉండటం కూడా వారికి అవసరం. ఇందుకోసమే కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలను ఆర్థిక స్థితిగతులను పక్కనపెట్టి వారి ఉత్పత్తులను తక్కువ ధరలకు నగరాలకు తరలిస్తున్నాయి. నేడు అమలు జరుగుతున్న ప్రభుత్వ రైతు విధానాల సారాంశం ఇదే. గ్రామాలను కొట్టి నగరాలకు పెట్టడమే. నగరాలకు పెట్టడం అంటే అంతిమంగా నగర ప్రాంత కార్పొరేట్లకు దోచి పెట్టడమే. ఈ క్రమంలో గత మూడు దశాబ్దాలుగా రైతులు నష్టపోతూనే ఉన్నారు. వ్యవసాయ రంగంలో బతకడం కష్టమైతేనే రైతు వలసకూలీగా మారి నగర బాటపడతాడు. కార్పొరేట్లకూ కావాల్సింది ఇదే. నగరాలలో మానవ వనరుల సరఫరా అధికంగా ఉండాలి. అంటేనే ఉపాధి కోసం పోటీ పెరుగుతుంది. అలా పెరిగితేనే ఉద్యోగాలకు ఇచ్చే వేతనాలను తగ్గించే అవకాశం కార్పొరేటర్లుకూ కలుగుతుంది. నేడు



దేశంలో జరుగుతున్న ఆర్థిభివృద్ధి చాలా మటుకు పట్టణ సేవారంగ ఆధారితమైంది. 45 శాతం మంది భారతీయులకు వ్యవసాయం ఉపాధి కల్పిస్తున్నప్పటికీ జిడిపిలో వ్యవసాయ రంగవాటా కేవలం 15శాతమే. అందువలనవ్యవసాయదారుల ఆదాయాలు అత్యల్ప స్థాయిలో ఉన్నాయి. 55 శాతం రైతు కుటుంబాలు అప్పుల బాధతో ఉన్నాయని 2021-22లో నాబార్డ్ తెలియజేసింది. వ్యవసాయ కుటుంబాల సగటు రుణభారం 91231 రూపాయలని 2025లో ప్రభుత్వ నివేదికలు తెలియజేస్తున్నాయి. 13.08 కోట్లమంది రైతులు వాణిజ్య బ్యాంకులకు రూ.2767346 కోట్లు బకాయిలు చెల్లించాలి. సహకార బ్యాంకులకు 3.34కోట్ల రైతులు రూ.2,65,419 కోట్లు బకాయిలు ఉన్నారు. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు 2.31కోట్ల మంది రైతులు రూ. 3,19,881 కోట్లు బకాయిలు పడ్డారు. ఇలా రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన్ లబ్ధిపొందే రైతులు 2022లో 10.47 కోట్ల మంది కాగా 2023 వాటికి 8.1కోటికి తగ్గిపోయారు. 2025నాటికి 9.85కోట్ల మంది లబ్ధిపొందారని ప్రభుత్వ లెక్కలు తెలియజేస్తున్నాయి. ఇలా రైతుకు అందుతున్న సహాయాలు మాత్రం తగ్గిపోతున్నాయి. ఫలితంగా రైతులకు ఆత్మహత్యలే శరణమయ్యాయి. 2014 నుంచి 2022 వరకు 100474 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం గత దశాబ్ద కాలంలో 112000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం దీనిని పాలకులు పట్టించుకోకపోవడం అత్యంత దయనీయమైన పరిస్థితి. ధరల యంత్రాంగాన్ని ఎవరు నియంత్రిస్తారుకార్పొరేట్లు అంటే కార్పొరేట్ల చేతుల్లో రైతులు చావు దెబ్బతింటున్నా పాలకులు కార్పొరేట్‌ల జోలికిపోరు. రైతుల ఉత్పత్తులకు మద్దతు ధర లభించకపోవడంతో1990-91 లో వ్యవసాయ రంగం వాటా జిడిపిలో 35శాతం కాగా 2022-23లో 15 శాతానికి పడిపోయింది. వ్యవసాయ రంగంపై ఆధారపడిన శ్రామిక జనాభా మాత్రం 60 శాతానికి తగ్గలేదు. ఆర్థిక అభివృద్ధి జరిగేటప్పుడు శ్రామికజనాభా సాధారణంగా వ్యవసాయ రంగం నుంచి ముందుగా పారిశ్రామిక రంగం వైపు, తరువాత సేవల రంగం వైపు బదిలీ జరగాలి. అలా జరగడం లేదు. ఇది ఆర్థిక అభివృద్ధి ప్రక్రియ కాదు. ప్రభుత్వ నియంత్రణ లేనందువలన ఉత్పత్తి ఉద్యోగిత వస్తు ఉత్పత్తి మార్కెట్ కార్పొరేట్ రంగ నియంత్రణలో ఉన్నందువలన ఉత్పత్తి ప్రక్రియ అంతా కార్పొరేటర్ల లాభాల కోసమే ఇలా జరుగుతున్నది. కరోనా కాలంలో మన రైతులు వారి ఉత్పత్తులను ప్రపంచంలో నూరు దేశాలకు పైగా పంపించి సహాయపడినారు. ప్రధానమంత్రి అనేక సందర్భాల్లో దేశంలోని రైతులను ప్రశంసించినప్పటికీ తమ పంటలకు హామీ ధరలు ఉండాలని దీర్ఘకాలంగా రైతులు చేస్తున్న డిమాండ్నుమాత్రం పట్టించుకోలేదు. వ్యవసాయ రాయితీలను అందించడంలో చైనా అగ్రస్థానంలో ఉంది. భారతదేశం మాత్రం వ్యవసాయ మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు రైతులను వదిలేసింది. ప్రపంచవాణిజ్య సంస్థ ఒప్పందాల ప్రకారం మనవ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులకు ఆటంకం ఏర్పడుచున్నది. ఎటు చూసినా సరళీకృత ఆర్థికవిధానాల వలన మార్కెట్ శక్తులు మాత్రమే లాభపడుతున్నారు. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని చట్టబద్ధత కల్పించాలని రైతులు అడుగుతున్నా కేంద్రప్రభుత్వం ససేమిరా ఒప్పుకోవడం లేదు. కనీసమద్దతు ధర చట్టబద్ధత కోసం ఎంతోమంది రైతులు ప్రాణత్యాగం కూడా చేశారు. గతమూడు దశాబ్దాలలో మూడు లక్షలమంది రైతులు ఆత్మహత్యచేసుకోవడం ఎవరిపాపం? మనది నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ అయినప్పటికీ దేశానికి అన్నం పెట్టే రైతు పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. ●

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అమెరికాలోని టెక్సాస్‌లో జలప్రళయం

## 82కి పెరిగిన మృతుల సంఖ్య



**టెక్సాస్, జూలై 7:** అమెరికాలోని టెక్సాస్‌లో వరదలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. వరదల తీవ్రత ఎంతగా ఉందంటే ఎన్నో ఇళ్లు నీళ్లలో కొట్టుకుపోయాయి. ఈ జల విపత్తులో ఎంతోమంది ప్రాణాలను కోల్పోయారు. కుండపోత వర్షాల కారణంగా సంభవించిన ఈ ఆకస్మిక వరదల్లో చనిపోయిన వారి సంఖ్య 82కు పెరిగింది. మరో 41 మంది గల్లంతయ్యారు. టెక్సాస్‌లోని కెర్ కౌంటీ, టెక్సాస్ హిల్ కంట్రీలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలు వరదల్లో కొట్టుకుపోవడం వల్ల, ఆయా చోట్ల 68 మంది మృతదేహాలు లభించాయి. వీరిలో 28 మంది పిల్లలే ఉండటం విషాదకరమని పోలీసు అధికారి లారీ లీథా తెలిపారు. రాష్ట్రంలోని ట్రావిస్, బర్నెట్, కెండాల్, టామ్ గ్రీన్, విలియమ్సన్ కౌంటీలలోనూ 10 మంది చనిపోయారని చెప్పారు. టెక్సాస్ హిల్ కంట్రీ నదీ తీరంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరానికి హాజరైన 10 మంది బాలికలు, ఒక వ్యక్తి ఆచూకీ గల్లంతైందని పోలీసులు ప్రకటించారు. వారి క్యాబిన్లు వరదల్లో కొట్టుకుపోయాయని తెలిపారు. వారి ఆచూకీని గుర్తించే వరకు సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. వరదలు కారణంగా సెంట్రల్ టెక్సాస్ ప్రాంతం భౌగోళికంగా సమస్యాత్మకంగా ఉంటుంది. అందుకే సహాయక చర్యలు చేపట్టడం రెస్క్యూ టీమ్‌లకు పెద్ద సవాల్‌గా మారిందని అధికారులు తెలిపారు. గ్వాడలూపే నదిపై మిలిటరీ హెలికాప్టర్ సాయంతో సహాయక చర్యలుచేపట్టారు. ఈ విపత్తుపై టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ తొలిసారిగా కీలక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వరదల్లో 41 మంది గల్లంతయ్యారని, ఈ సంఖ్య మరింత పెరగొచ్చని ఆయన వెల్లడించారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని టెక్సాస్ ప్రజా భద్రతా విభాగం కల్నల్ ఫ్రీమన్ మార్టిన్ వెల్లడించారు. తదుపరిగా మంగళవారం వరకు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, వాటి వల్ల మరోసారి తీవ్ర వరదలు సంభవించవచ్చని ఆయన హెచ్చరించారు. నదులు కూడా ఉప్పొంగి ప్రమాదకర వరదలను సృష్టించే అవకాశం ఉందంటూ కెర్ కౌంటీలోని ప్రజల ఫోన్లకు అత్యవసర సందేశాలు అందాయి. ప్రజలను అప్రమత్తం చేసేందుకు కెర్ కౌంటీలో ఉన్న క్యాంప్ మిస్టిక్ వద్ద ఈ అంశంపై లౌడ్ స్పీకర్లతో అనౌన్స్‌మెంట్లు చేయించారు. వెంటనే క్యాంప్ మిస్టిక్ పరిసరాలను వదిలి వెళ్లాలని ప్రజలను సూచించారు. కాగా, టెక్సాస్ వరదల్లో చిక్కుకున్న 850 మందిని రక్షించామని అధికారులు ప్రకటించారు. వరదలకు విరిగిపోయిన చెట్లు సహాయక చర్యల్లో రెస్క్యూ సిబ్బంది వాయువేగంతో స్పందించారన్నారు. జూలై 4న టెక్సాస్ రాష్ట్రంలో కుండపోత వర్షాలు కురిశాయి. ఆరోజు అర్ధరాత్రి 1 గంటలకు టెక్సాస్‌లోని గ్వాడలూపే నదిలో నీటిమట్టం వేగంగా పెరగసాగింది. దీన్ని మొట్టమొదట ఆర్లో బరేరా అనే వ్యక్తి కళ్లారా చూశారు. ఈ నదీతీరంలో ఏర్పాటుచేసిన ఒక సమ్మర్ క్యాంప్‌లో ఆయన ఫెసిలిటీస్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. దీనిపై వెంటనే ఆర్లో బరేరా తన బాస్‌కు సమాచారాన్ని అందించారు. ఆ వెంటనే నదీతీరంలో ఉన్న క్యాంపును ఖాళీ చేయించి ఎత్తైన ప్రదేశానికి తరలించారు. క్యాంపులో ఉన్న దాదాపు 70 మంది పిల్లలు, పెద్దలను సురక్షిత ప్రదేశానికి తీసుకెళ్లారు. అయితే సమీపంలోని హంట్ అనే ప్రాంతంలో ఉన్న మరో సమ్మర్ క్యాంపును వరద జలాలు కుదిపేశాయి. అయితే అక్కడ వెంటనే సహాయక చర్యలు చేపట్టి, క్యాంపులో ఉన్న పిల్లలు, పెద్దలను రక్షించారు. వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించారు.

# ముంబై ఉగ్రదాడులకు సహకరించింది నేనే!



## విచారణలో తహవూర్‌రాణా ఒప్పుకోలు

**ముంబయి,జూలై 7:** ముంబై 26/11 ఉగ్రదాడుల కేసులో ప్రధాన కుట్రదారుడైన తహవూర్ హుస్సేన్ రాణా, విచారణలో సంచలన విషయాలను వెల్లడించాడు. సుదీర్ఘ దౌత్య పోరాటం తర్వాత భారతకు అప్పగించబడిన 64 ఏళ్ల రాణా, ముంబై పోలీసుల క్రైమ్ బ్రాంచ్ విచారణలో దాడుల వెనుక ఉన్న కుట్ర గుట్టు విప్పాడు. దాడుల మాస్టర్‌మైండ్ డేవిడ్ కోల్‌మన్ హెడ్లీకి తాను ఎలా సహాయపడిందీ పూసగుచ్చినట్లు వివరించాడు. ముంబైలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్ వంటి ప్రధాన ప్రాంతాలను లక్ష్యాలుగా గుర్తించడంలో హెడ్లీకి సహకారం చానని రాణా అంగీకరించాడు. దాడులకు ముందు ఉగ్రవాదులు నిఘా పెట్టేందుకు వీలుగా 'ఇమ్మిగ్రెంట్ లా సెంటర్' పేరుతో ఒక ముసుగు కంపెనీని ఏర్పాటు చేయాలనే ఆలోచన తనదేనని రాణా ఒప్పుకున్నాడు. ఈ కంపెనీ ముసుగులోనే హెడ్లీ భారత్‌లోని పలు నగరాల్లో పర్యటించి సమాచారం సేకరించాడు. గతంలో తాను పాకిస్తాన్ సైన్యంలో కెప్టెన్ హోదాలో డాక్టర్‌గా పనిచేసినట్లు రాణా వెల్లడించాడు. సియాచిన్ వంటి సున్నిత ప్రాంతాల్లో పని చేస్తున్నప్పుడు అనారోగ్యం కారణంగా విధులకు దూరమవడంతో తనను సైన్యం నుంచి పారిపోయిన వ్యక్తిగా ప్రకటించారని తెలిపాడు. ఈ రికార్డును సరిచేయిస్తానని హెడ్లీ హామీ ఇవ్వడంతోనే తాను ఉగ్రకుట్రలో భాగమైనట్లు చెప్పాడు. పాకిస్తాన్ సైనిక యంత్రాంగం, గూఢచార సంస్థ ఐఎస్ఐ, లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థలు కలిసి ఈ దారుణ సమన్వయం చేసుకున్నట్లు అంగీకరించాడు. దాడుల సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సాజిద్ మీర్, అబ్దుల్ రెహ్మాన్ పాషా, మేజర్ ఇక్బాల్ వంటి పాక్ అధికారులు తనకు తెలుసని కూడా రాణా అంగీకరించినట్లు సమాచారం. నవంబర్ 2008లో దాడులకు కొద్దిరోజుల ముందు తాను ముంబైలోని పోవాయ్‌లో ఒక హోటల్‌లో బస చేసి, దాడులకు ముందు దుబాయ్ మీదుగా బీజింగ్ వెళ్లిపోయినట్లు రాణా విచారణలో తెలిపాడు. ఈ కేసులో రాణా పాత్రను 14 మంది సాక్షులు ధృవీకరించినట్లు క్రైమ్ బ్రాంచ్ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది.

# బంగ్లాను ఖాళీ చేసేస్తున్నా.. మాజీ చీఫ్‌జస్టిస్ చంద్రచూడ్ వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 7:** మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్ తనకు కేటాయించిన అధికారిక బంగ్లాను ఇంకా ఖాళీ చేయలేదు. కాలపరిమితి దాటినా ఆయన ఆ ఇంటి నుంచి వెళ్లిపోవడం లేదు. దీంతో విసుగెత్తిన సుప్రీంకోర్టు రెండు రోజుల క్రితం కేంద్రానికి లేఖ రాసింది. మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్‌పై విమర్శలు రావడంతో ఆయన స్పందించారు. ఇంట్లో ఉన్న లగేజీ మొత్తం ప్యాక్ చేసుకున్నామని, త్వరలోనే భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి మరో ప్రభుత్వ కిరాయి ఇంటికి వెళ్లనున్నట్లు చెప్పారు. చంద్రచూడ్ భార్య కల్పన కాగా, ఆ జంటకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆ ఇద్దరూ దివ్యాంగులే. అయితే సీజేఐగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి న్యూఢిల్లీలోని కృష్ణ మీనన్ మార్గ్ 5లో ఆయన నివాసం ఉంటున్నారు. తనకు కేటాయించిన ప్రభుత్వ బంగ్లాలో ఎందుకు ఎక్కువ సమయం ఉండాల్సి వస్తుందో డీవై చంద్రచూడ్ చెప్పారు. ప్రస్తుతం ఆ ఇంట్లో ఉన్న లగేజీని ప్యాకప్ చేశామని, కొంత లగేజీ కొత్త ఇంటికి తరలించామని, కొంత స్టోర్‌రూమ్‌లో ఉందన్నారు. సీజేఐ డీవై చంద్రచూడ్ 2024, నవంబర్ 8వ తేదీన రిటైర్ అయ్యారు. బంగ్లా ఎక్స్‌టెషన్ గురించి పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. అయితే తన కూతుళ్లు దివ్యాంగులని, వాళ్లు ఎప్పుడూ వీల్‌చైయిర్‌లో ఉంటారని, వాళ్ల ఆరోగ్యం దృష్ట్యా బంగ్లా ఖాళీ చేయడం ఆలస్యం అయ్యిందన్నారు. కూతుళ్లు ప్రియాంకా, మహి వింత వ్యాధితో బాధపడుతున్నారని, వాళ్ల అవసరాలు కూడా ప్రత్యేకంగా ఉంటాయని, కూతుళ్లు ఇద్దరికీ నిమలైన్ మయోపథి అనే వ్యాధి ఉందని, జన్యుపరమైన ఆ వ్యాధి వల్ల వాళ్ల ఎముక మాంసం దెబ్బతింటుందన్నారు. ఇంట్లో ఉన్నప్పుడు వాళ్లకు చాలా ఉన్నత ప్రమాణాలతో ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని, ప్రత్యేకమైన నర్సులు వాళ్లను చూసుకుంటారని, కూతుళ్లకు అనువైన రీతిలో ఉండే ఇంటి కోసం వెతికామని, కానీ ఢిల్లీలో అలాంటి ఇళ్లు దొరకడం లేదని, ఇద్దరు కూతుళ్లను చూసుకోవాల్సిన బాధ్యత తమమీదే ఉందన్నారు. అయితే కొత్త ఇళ్లు పూర్తి అయిన సమాచారం అందగానే ఆ ఇంట్లోకి వెళ్లనున్నట్లు జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. తన పెద్ద కూతురు ప్రియాంకా 44 రోజుల పాటు ఐసీయూలో చికిత్స పొందినట్లు చెప్పారు. సిమ్లాలో హాలీడే కోసం వెళ్లినప్పుడు ఆ అమ్మాయి చాలా ఇబ్బందిపడినట్లు తెలిపారు. ట్రాచెస్టమీ ట్యూబ్‌తో ఆమె చికిత్స జరుగుతోందన్నారు. తమ కూతుళ్లకు నిరంతరం ఛాతి, శ్వాసకోస, నరాల సంబంధిత థెరపీ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు రెగ్యులర్‌గా పెయిన్, స్పీచ్ చికిత్స కూడా జరుగుతోందన్నారు. గతంలో మాజీ సీజేఐలు కూడా అధికార నివాసాల్లో ఎక్స్‌టెన్షన్ తీసుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. సీజేఐ యూయూ లలిత్, ఎన్వీ రమణ తో పాటు ఇతర టాప్ జడ్జీలు ఆ అవకాశాన్ని వాడుకున్నట్లు చంద్రచూడ్ చెప్పారు. రిటైర్మెంట్ సమయంలో జరిగిన పరిణామాల గురించి జస్టిస్ చంద్రచూడ్ వివరిస్తూ తన తర్వాత బాధ్యతలు స్వీకరించిన సీజేఐ సంజీవ్ ఖన్నాతో బంగ్లాను ఖాళీ చేసే అంశాన్ని మాట్లాడినట్లు చెప్పారు. సీజేఐ బంగ్లాలోనే కొనసామని జస్టిస్ ఖన్నా తనకు చెప్పినట్లు చంద్రచూడ్ తెలిపారు. ఎందుకంటే జస్టిస్ ఖన్నా ప్రభుత్వ బంగ్లాలో ఉండాలనుకోలేదన్నారు. ఖన్నా హామీ నేపథ్యంలో చంద్రచూడ్ అక్కడే ఉంటున్నారు. రిటైర్మెంట్ తర్వాత కేవలం ఆర్నెళ్ల వరకే ఎక్స్‌టెన్షన్ ఉంటుంది. కానీ ఈ ఏడాది మే 31 వరకు అదనంగా పొడిగింపు ఇచ్చారు. ఆ కాలపరిమితి దాటడంతో చంద్రచూడ్‌ను బంగ్లాను ఖాళీ చేయాలని ఆదేశిస్తూ కేంద్రానికి సుప్రీం లేఖ రాసింది.

# శివసేన బ్రదర్స్‌ను కుదిపేస్తున్న బాల్‌థాకరే విడియో!



**ముంబయి,జూలై 7:** మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రెండు దశాబ్దాలుగా రాజకీయంగా దూరంగా ఉంటున్న థాకరే సోదరులు ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే మరాఠీ భాష పరిరక్షణ కోసం ఒక్కటయ్యారు. ఇదే సమయంలో, వారి తండ్రి, శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరేకు చెందిన ఓ పాత వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో హిందీ భాషను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేయడాన్ని విజయంగా అభివర్ణిస్తూ శనివారం ముంబైలో ఉద్ధవ్, రాజ్ కలిసి ఓ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా, రాబోయే ముంబై నగర పాలక సంస్థ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని ఉద్ధవ్ థాకరే ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వం హిందీని ప్రజలపై రుద్దడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, బాల్ థాకరే పాత వీడియో ఒకటి ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. ఆ వీడియోలో, 'నేను మహారాష్ట్రలో మరాఠీ వాడిని కావచ్చు, కానీ భారతదేశంలో నేను హిందువును. మనం భాషా గుర్తింపుల కంటే హిందుత్వానికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయనమాట్లాడారు. తండ్రి సిద్ధాంతాలకు భిన్నంగా కొడుకులు భాషా రాజకీయాలు చేస్తున్నారంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. మహారాష్ట్రలో 1నుంచి 5వ తరగతి వరకు హిందీని తప్పనిసరి చేస్తూ ఏప్రిల్‌లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ వివాదం రాజుకుంది.

# 'గెలాక్సీ లీడర్'ను ధ్వంసం చేసిన ఇజ్రాయెల్

## హూతీలపై దాడి!



**టెల్‌అవీవ్, జూలై 7:** దాదాపు రెండేళ్ల క్రితం హైజాక్‌కు గురైన 'గెలాక్సీ లీడర్' నౌకను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత తొలిసారి ఇజ్రాయెల్ దళాలు యెమన్‌లోని హూతీ రెబల్స్ స్థావరాలపై వైమానిక దాడులు చేశాయి. ఈ నౌకను 2023లో హూతీలు హైజాక్ చేసి యెమెన్ పోర్టులో ఉంచారు. దీనిలో 25 మంది బందీలను కొన్నాళ్ల తర్వాత విడుదల చేశారు. ఈ నౌకను ఇజ్రాయెల్‌కు చెందినదిగా సదరు రెబల్స్ అనుమానిస్తున్నారు. దీంతోపాటు ఇజ్రాయెల్‌కు చెందిన మొత్తం నౌకలను లక్ష్యంగా చేసుకొంటామని హూతీలు హెచ్చరించారు. 'గెలాక్సీ లీడర్' నౌక హైజాక్‌ను ఇజ్రాయెల్, పశ్చిమదేశాలపై సాధించిన విజయంగా చెప్పుకోవడం మొదలుపెట్టింది. తుర్కియే నుంచి భారత్‌కు వెళుతుండగా దీనిని హైజాక్ చేశారు. ఈ నౌకను హూతీలు ఇతర ఓడలపై దాడులకు వాడటం మొదలుపెట్టారు. దీనిపై ఓ రాడార్ వ్యవస్థను బిగించారు. దాని సాయంతో ఎర్రసముద్రంపై నుంచి వెళుతున్న నౌకలను ట్రాక్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ఇజ్రాయెల్ దళాలు ఈ నౌకను తాజా దాడుల్లో ధ్వంసం చేశాయి. దీంతోపాటు రేవులైన హుదైద్, సలీఫ్, రస్ ఇసాలోని లక్ష్యాలపై బాంబులు వేశాయి. వీటితోపాటు ఓ విద్యుత్తు కేంద్రాన్ని కూడా పేల్చేసింది.

**ఎర్ర సముద్రంలో నౌకలపై దాడులు:** అంతకు ముందు హూతీ రెబల్స్ ఎర్ర సముద్రంలో లైబీరియా పతాకంపై ప్రయాణిస్తున్న నౌకపై దాడులు చేసింది. దీంతోపాటు గ్రీస్‌కు చెందిన బల్క్ క్యారియర్‌పై కూడా దాడి జరిగింది. డ్రోన్లు బోట్లు ఈ నౌకను ఢీకొన్నాయి. దీంతోపాటు రాకెట్ ప్రొపెల్డ్ గ్రనేడ్లతో దాడి జరిగింది.

# బిలావల్‌భుట్టో వ్యాఖ్యలపై సయీద్ కుమారుడి ఫైర్!



**కరాచి,జూలై 7:** పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో చేసిన వ్యాఖ్యలు ఆ దేశంలో తీవ్ర దుమారం రేపాయి. భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులను అప్పగించేందుకు సిద్ధమంటూ ఆయన చేసిన ప్రతిపాదనపై లష్కరే తోయిబా (ఎల్ఈటీ) చీఫ్ హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిలావల్ వ్యాఖ్యలను బాధ్యతారహితమైనవిగా అభివర్ణించిన తల్హా, పాకిస్థానీయులను కాకుండా భారత నాయకులనే తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. భారత్‌తో విశ్వాసం పెంచే చర్యల్లో భాగంగా హాఫీజ్ సయీద్, జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ వంటి ఉగ్రవాదులను అప్పగించేందుకు పాకిస్థాన్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇందుకు భారత్ కూడా సహకరించేందుకు సుముఖత చూపాలని అన్నారు.

ఈ వ్యాఖ్యలపై ఆదివారం ఓ వీడియో విడుదల చేసిన తల్హా సయీద్ తీవ్రంగా స్పందించారు. "శత్రుదేశమైన భారత్‌కు మా నాన్నను అప్పగించాలని బిలావల్ సూచించడం పాకిస్థాన్‌కు అంతర్జాతీయంగా అవమానం కలిగించింది. దీన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం" అని హెచ్చరించారు. భుట్టో కుటుంబం ఎప్పుడూ పాశ్చాత్య దేశాలు, భారత్ వాదనకే మద్దతు ఇస్తుందని ఆయన ఆరోపించారు. ఈ వివాదంపై లష్కరే తోయిబా రాజకీయ విభాగమైన పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్ కూడా ఓ ప్రకటన విడుదల చేసింది. పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతోంది భారతేనని ఆరోపించింది. కాగా, అమెరికా ట్రెజరీ విభాగం హాఫీజ్ సయీద్‌తో పాటు ఆయన కుమారుడు తల్హాను కూడా అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో చేర్చిన విషయం తెలిసిందే.

# భారత్ రక్షణ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా డిమాండ్


## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**న్యూఢిల్లీ, జూలై 7:** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతీయ రక్షణ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 2024లో ప్రపంచ సైనిక వ్యయం 2.7ట్రిలియన్ డాలర్లకు పైగా పెరిగిందని, భారత్ కోసం ఓ పెద్ద మార్కెట్ ఎదురుచూస్తోందని అన్నారు. సోమవారం డీఆర్‌డీఓ భవనంలో డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన కంట్రోలర్స్ కాన్ఫరెన్స్‌లో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. ప్రపంచం ఇప్పుడు మన రక్షణ రంగం వైపు చూస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికులు చూపిన పరాక్రమం, అలాగే మన దేశీయ పరికరాల సామర్థ్యాన్ని ప్రదర్శించిన తీరు వల్ల ఇక్కడి ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. ప్రపంచంలోని కొన్ని దేశాల జీడీపీ కంటే భారత్ రక్షణ బడ్జెట్ ఎక్కువ. ప్రజలు కష్టపడి సంపాదించిన ఆదాయంలో గణనీయమైన భాగాన్ని రక్షణ మంత్రిత్వ శాఖకు కేటాయించినప్పుడు దానిని సమర్థవంతంగా వినియోగించే బాధ్యత కూడా పెరుగుతుంది. రక్షణ వ్యయం పెరగడం ఒక్కటే కాదు. దాన్ని సరైన లక్ష్యాల కోసం, సరైన సమయంలో, సమర్థంగా వినియోగించాల్సిన అవసరం ఉంది అని రాజనాథ్ సింగ్ చెప్పారు. 2016లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన గవర్నమెంట్ ఈ మార్కెట్ ప్లేస్ పోర్టల్ నుంచి రక్షణ ఉత్పత్తుల కొనగోళ్లకు అనుమతి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. ఈ నిర్ణయం వల్ల పారదర్శకత, సమర్థత పెరుగుతుంది. అంతేకాదు సమగ్ర వేతన వ్యవస్థ, డేటాబేస్ నిర్వహణపై కూడా ఈ విభాగం పని చేస్తోందని తెలిసింది. ఇక శాంతంగా ఉన్నామంటే అది కేవలం ఒక భ్రమ మాత్రమే అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మనం ప్రశాంతంగా ఉన్న సమయాల్లో కూడా అనిశ్చితికి సిద్ధంగా ఉండాలి. ఆకస్మిక మార్పులు మన ఆర్థిక, కార్యచరణ పరిస్థితులను మారుస్తాయి. పరికరాల ఉత్పత్తినిపెంచడమేకాదు. నూతన సాంకేతికతలతో ఎప్పటికప్పుడు వినూత్న పద్ధతుల్లో స్పందించగలిగేలా సిద్ధంగా ఉండాలని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. జులై 7 నుంచి 9 వరకు జరగనున్న ఈ కంట్రోలర్స్ కాన్ఫరెన్స్‌ను డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తోంది. సోమవారం ఈ సమావేశాన్ని రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులు, రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎస్‌జీ. దస్తీదార్, డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్ జనరల్ మయాంక్ శర్మ పాల్గొన్నారు.

# తూర్పు ఇండోనేసియాలో బద్దలైన అగ్నిపర్వతం

## 18 కి.మీ. ఎత్తుకు ఎగసిపడుతున్న బూడిద



**పడాంగ్, జూలై 7:** తూర్పు ఇండోనేసియాలోని లెవోటోబి లకి-లకి అగ్నిపర్వతం సోమవారం బద్దలైంది. ఫ్లోర్స్ దీవిలోని మౌంట్ లెవొటోబి లకిలకిలో విస్ఫోటనాలు ఏర్పడుతున్నట్లు ఇండోనేసియా భూగర్భశాస్త్ర ఏజెన్సీ పేర్కొంది. అగ్నిపర్వతం నుంచి దాదాపు 18 కి.మీ. ఎత్తుకు మందపాటి బూడిద ఎగసిపడి సమీప గ్రామాలను కప్పివేసిందని తెలిపింది. దీంతో అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. 'అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. త్వరగా గ్రామాలను ఖాళీ చేయించి, అక్కడి నివాసితులను ఇతర ప్రాంతాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నాం' అని వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ అధికారులు పేర్కొన్నారు. అగ్నిపర్వతంలో బూడిద ఇప్పటికీ ఎగసిపడుతోందని, పెద్ద మొత్తంలో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. ఆకాశంలోకి భారీగా బూడిద ఎగసిపడుతుండడంతో పలు అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయినట్లు బాలి విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. గతేడాది నవంబరులో లకిలకి పర్వతం బద్దలు కావడంతో 9 మంది మరణించారు. ఈ యేడాది మార్చిలోనూ అగ్నిపర్వతం పలుమార్లు బద్దలైంది.

## పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

# మినీబస్సు కారు ఢీ: 8 మంది మృతి



**హోషియార్‌పూర్,జూలై 7:** పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాల్లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టి, రోడ్డుపై బోల్తా పడింది. దీంతో ఎనిమిది మంది మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఒక చిన్నారి కూడా ఉన్నాడు. ఘటనలో గాయపడిన వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. దాసుహాహాజీపూర్ రహదారిలోని అడ్డా సాగర్ సమీపంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. దీనితో చట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాలని చూశారు. కానీ బస్సు బోల్తాపడి ఉండడంతో లోపల ఉన్నవారిని రక్షించేందుకు జేసీబీ వాహనాన్ని ఉపయోగించాల్సి వచ్చింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో సహా 15 మందికి పైగా గాయపడ్డారు. ఇక బస్సు ఢీకొనడంతో కారులోని వారికి కూడా గాయాలు అయ్యాయి. గాయపడిన వారందరినీ స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే క్షతగాత్రుల గురించి వారి కుటుంబాలకు సమాచారం అందించాం. ప్రస్తుతం మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం పంపించాం. ప్రాథమిక దర్యాప్తులో అధిక వేగంతో బస్సు నడపడమే ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తును ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు. మా ఇల్లు ఇక్కడకు సమీపంలోనే ఉంది. నేను ఇంటి బయట సెల్ ఫోన్ మాట్లాడుతూ ఉన్నాను. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి వచ్చాను. బస్సు లోపల నుంచి పిల్లలు, మహిళల అరుపులు వినిపించాయి. ఏదో ఒక విధంగా బోల్తా పడిన బస్సులోకి వెళ్లి ప్రయాణికులను ఒక్కొక్కరిగా బయటకు తీసుకువచ్చాను. ప్రస్తుతం ప్రయాణికుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. చాలా మంది అక్కడికక్కడే మరణించారు. ప్రత్యక్ష సాక్షివిచారం వ్యక్తం చేసిన సీఎంఈ ప్రమాదంపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సోషల్‌మీడియా వేదికగా విచారం వ్యక్తం చేశారు.

# హిమాచల్‌ప్రదేశ్‌లో బ్యాంక్‌ను ముంచెత్తిన వరద

## బంగారం, డబ్బు ఏమయ్యాయో..?



**సిమ్లా, జూలై 7:** బంగారం, డబ్బు, ఆస్తిపాస్తుల దస్త్రాలు బ్యాంకుల్లో ఉంచి నిశ్చింతగా ఉంటారు ప్రజలు. కానీ హిమాచల్‌ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు ఆ ఆశలు గల్లంతయ్యాయి. బ్యాంక్‌లోకి వరదనీరు ముంచెత్తడంతో తమ సొమ్ము ఏమైందోనని డిపాజిటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండి జిల్లాలోని తునాగ్ ప్రాంతంలోని ఎనిమిదివేల మంది ప్రజలకు ఒక కోఆపరేటివ్ బ్యాంక్ ఉంది. అయితే గత నెల నుంచి కురుస్తున్న వర్షాల ప్రభావం దానిపై పడింది. వాన నీరు, కొట్టుకొచ్చిన శిథిలాలు బ్యాంక్ రెండు అంతస్తుల భవనంలోని మొదటి ఫ్లోర్‌ను ముంచెత్తాయి. దాంతో దాని షటర్లు దెబ్బతిన్నాయి. ఈ విపత్తుతో కోట్లాది రూపాయల నగదు, బంగారం డిపాజిట్లపై ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది. స్థానిక వ్యాపారి ఒకరు మాట్లాడుతూ 'మా ప్రాంతంలో ఉన్న బ్యాంక్ ఇదొక్కటే. చాలా కాలం నుంచి ఇది నడుస్తోంది. దీనిలో ప్రతిరోజు భారీ సంఖ్యలో లావాదేవీలు జరుగుతుంటాయి. ఇప్పుడు అందులో ఉంచిన నగదు, బంగారం, పత్రాలు ఏమైఉంటాయో?'అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వరదల్లో ఏవైనా కొట్టుకుపోయి, దోపిడీకి గురికావొచ్చని స్థానికులు కాపలా కాస్తుండటం గమనార్హం.

జూన్ 20నుంచి జూలై 6వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో 23 సార్లు ఆకస్మిక వరదలు వచ్చాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో ఇప్పటివరకు 78 మంది ప్రాణాలు కోల్పోయారు. 37 మంది ఆచూకీ లేకుండా పోయారు. వారికోసం గాలింపు కొనసాగుతోంది. ఇదిలా ఉండగా సోమ, మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్, ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

**ఇంట్లో అనాథగా 11 నెలల చిన్నారి:** గతవారం నుంచి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో 11 నెలల చిన్నారి అనాథగా మారింది. రాత్రి సమయంలో భారీ వర్షం కురుస్తుండటంతో నీరు ఇంట్లోకి రాకుండా పక్కకు పంపేందుకు రమేశ్‌కుమార్ కుటుంబం ఇంటిబయటకు వచ్చింది. అప్పుడే కొండచరియ విరిగిపడటంతో రమేశ్‌తో పాటు భార్య, తల్లి ప్రాణాలు కోల్పోయారు. ఇదేమీ తెలియని 11 నెలల చిన్నారి ఉదయం వరకు ఇంట్లోనే ఒంటరిగా ఉండిపోయింది. సహాయకబృందాలు పాపను రక్షించాయి. అయిన వాళ్లు చనిపోవడంతో ఆ పాప అనాథగా మారింది.

## ఓటర్ల జాబితాల సవరణలపై సుప్రీంలో పిటిషన్

# విచారణకు స్వీకరించిన న్యాయమూర్తుల బెంచ్

**న్యూఢిల్లీ, జూలై 7:** ఓటర్ జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న సుప్రీంకోర్టు విచారించనున్నది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది.

ఎన్నికల కమిషన్ తీసు కున్న చర్యల చెల్లుబాటును పరిశీలించనున్నట్లు పేర్కొంది. పలువురు దాఖలుచేసిన ఈ పిటిషన్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వినిపించిన వాదనలను పరిగణలోకి తీసుకున్న జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి బెంచ్ గురువారం కేసును విచారించేందుకు అంగీకరించింది.

ఈ పిటిషన్‌లపై ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేయాలని బెంచ్‌ను సిబల్ కోరగా విచారణ జరుగుతుందని జస్టిస్ సుధాన్షు తెలిపారు. బీహార్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను సవాల్ చేస్తూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాతో పాటు ఏడీఆర్ సంస్థ పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వెంటనే అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని మనోజ్ ఝా కోరారు.

ఈసీ ఉత్తర్వులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కువ్యక్తిగత స్వేచ్ఛ), ఆర్టికల్ 325 (కులం, మతం, లింగం ఆధారంగా ఎవరినీ ఓటరు జాబితా నుంచి మినహాయించకూడదు), ఆర్టికల్ 326 (18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులు)లను ఉల్లంఘిస్తుందని ఆదేశాలను రద్దు చేయాలని మనోజ్ ఝా కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రాజ్యాం గంలోని నిబంధనలు ఉల్లంఘించిందని ఎంపీ మహువా మొయిత్రా ఆరోపించారు. ఇది ఇలాగే కొనసాగితే దేశంలో పెద్ద సంఖ్యలో ఓట్లు కోల్పోయే అవకాశం ఉంటుందని పేర్కొంది. ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలను బలహీనంగా మారు స్తుందన్నారు.

ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సైతం పిటిషన్ దాఖలు చేసింది.

# కొత్త టిమ్స్ హాస్పిటల్లలో ఆధునిక సాంకేతిక పరికరాలు కొనాలి



## రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫర్నీచర్ కొనాలి

## ప్రతి వస్తువుకూ వారంటీ ఉండేలా చూడాలి

## టిజిఎంఎస్ఐడిసిపై సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న టిమ్స్ హాస్పిటల్స్‌తోపాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక టెక్నాలజీ ఉన్న మెడికల్, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్‌ను కొనుగోలు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. డాక్టర్లు, సిబ్బంది, పేషంట్ల అవసరాలకు అనుగుణంగా ఫర్నీచర్‌ను కొనుగోలు చేయాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. టిజిఎంఎస్ ఐడిసిపై మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వినియోగిస్తున్న ఎక్విప్‌మెంట్ ఏమిటో డాక్టర్లను అడిగి తెలుసు కోవాలన్నారు. డాక్టర్లు, సిబ్బంది, పేషెంట్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫర్నీచర్ కొనుగోలు చేయాలన్నారు. కొత్త హాస్పిటళ్లకు పేషెంట్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, ఆ అంచనాలకు తగ్గట్టుగా ఫర్నీచర్, ఎక్విప్‌మెంట్ సరిపడా ఉండాలన్నారు. కొనే ప్రతి వస్తువుకూ వారంటీ ఉండాలని, మెయింటనెన్స్ విషయంలో సప్లయర్లను బాధ్యులుగా చేయాలన్నారు. ఒక్క వస్తువు కూడా రిపేర్‌లో, నిరుపయోగంగా ఉండే పరిస్థితి ఉండకూడదన్నారు.

ప్రభుత్వ దవాఖానలో మెడిసిన్ సరఫరాపై వివిధ విభాగాల హెచ్‌వోడీ లను మంత్రి వివరాలు అడిగారు. అవసరమైన అన్ని మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయా? లేవా అని డీఎంఈ, వైద్యవిధాన పరిషత్ కమిషనర్, డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావడంతో పేషెంట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని, అందుకు అనుగుణంగా మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి ఆదేశించారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్లలో కనీసం 3 నెలలకు సరిపడా మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని టిజిఎంఎస్ఐడిసి అధికారులకు మంత్రి సూచించారు. ప్రతి పీహెచ్‌సీలోనూ టెస్టులు అవసరమైన పేషెంట్ల నుంచి సాంపిల్స్ సేకరించాలని, 24 గంటల లోపల రిపోర్టులు అందజేయాలని మంత్రి ఆదేశించారు. గతేడాది కొత్తగా ప్రతి జిల్లాలోనూ మెడిసినల్ స్టోర్లను ఏర్పాటు చేశామని, ఆయా స్టోర్లకు పర్మినెంట్ బిల్డింగ్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అన్ని జిల్లాల్లో బిల్డింగుల నిర్మాణాన్ని ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మెడికల్ కాలేజీలు అన్నింటిలోనూ సీటీ స్కాన్ మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చామని, అలాగే అవసరమైన చోట ఎంఆర్ఐ యంత్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించామని మంత్రి తెలిపారు.

**వెల్‌నెస్ సెంటర్ల తనిఖీలు..**

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు వెల్‌నెస్ సెంటర్లలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. వెల్‌నెస్ సెంటర్లపై వస్తున్న వార్తల విషయంలో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసు కోవాలని అధికారులను ఆదేశించారు.




# పదేళ్లలో బాగుపడింది నలుగురే

## ఫామ్‌హౌస్‌కు రోడ్లు వేసుకున్న కెసిఆర్

## జుక్కల్ అభివృద్ధిని విస్మరించారు..

## మంత్రి కోమటిరెడ్డి నిశిత విమర్శ

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** వెనుకబడిన జుక్కల్ అభివృద్ధి చెందితేనే అభివృద్ధికి నిజమైన అర్థం అని ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో సోమవారం రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఫామ్ హౌజ్‌కు రోడ్డు వేసుకొని జుక్కల్ వంటి వెనుకబడిన ప్రాంతంను కెసిఆర్ విస్మరించారని వెంకటరెడ్డి నిందించారు. మద్దెలచెరువు పిట్లం రోడ్, తిమ్మనగర్ వద్ద 4.86 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన హై లెవల్ బిడ్జ్ ను ప్రారంభించిన మంత్రి, బిచ్కుంద నుండి డోంగ్లి వరకు 13.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీ కాంత రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. జుక్కల్ లో డైనమిక్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంత రావు ఉన్నాడని, ఇప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఆయనకు తోడుగా ఉంటానని నాకు ఇప్పుడు జుక్కల్ బాధ్యత కూడా తోడయిందని తెలిపారు. గత పదేళ్లలో కొడుకు, బిడ్డ, అల్లుడు బాగుపడ్డారు కానీ తెలంగాణ ప్రజలు కాదని గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ అధికారంలోకి రాకున్నా బాధపడలేదని..ఏదైతే ఆశయంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని కొట్లాడి సాధించుకున్నామో అవి నెరవేరలేదన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో 160 కోట్ల రూపాయలతో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని,జుక్కల్ లాంటి వెనుకబడిన నియోజకవర్గం అభివృద్ధి చెందినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్లన్నారు. నిరంతరం మమ్మల్ని విమర్శించే హరీశ్‌రావు వచ్చి జుక్కల్ రోడ్లు చూడాలన్నారు. అంతకు ముందు పిట్లం,బిచ్కుంద లో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు.

**కామారెడ్డి సమగ్రాభివృద్ధికి పటిష్టచర్యలు : మంత్రి కోమటిరెడ్డి**

కామారెడ్డి జిల్లా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల బోర్డర్ రిమోట్ ఏరియా ఉందని, ఇక్కడ 100 బెడ్ ల ఆసుపత్రికి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. జాతీయ రహదారి దగ్గర ట్రామా సెంటర్ అవసరం ఉందని , హైవే సమీపంలోని ఆసుపత్రిలో ట్రామా సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా చూడాలని ఎరువుల వాడకం తగ్గించాలని అప్పుడే భూసారం కాపాడుకోగలుగుతామని అన్నారు.వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ పకడ్బందీగా చేయాలని, వాస్తవ పరిస్థితులకు రికార్డులకు చాలా తేడా ఉంటుందని, భవిష్యత్తులో ఇలా జరగడానికి వీలు లేదని అన్నారు. వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ యూనిట్ల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో తదుపరి అటవీ భూముల ఆక్రమణ జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఇబ్బందులు కలిగించ వద్దని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, జాయింట్ కలెక్టర్ విక్టర్, జిల్లా అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# పట్టా ఉన్న భూమి సొంతం కావడం లేదని కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

## సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ

**భువనగిరి, జూలై 7 ప్రభాతవార్త :** యేళ్ల తరబండ నుంచి తన భూ సమస్యను పరిష్కరించడం లేదంటూ ఓ రైతు ఏకంగా ప్రజావాణి కార్యక్రమంలో తన గోడును వెల్లబోసుకుంటూ ఏకంగా ఒంటిపై పెట్రోల్ పోసుకున్న సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో కల కల సృష్టించింది . వివరాల్లోకి వెళితే యాపాల్ గ్రామానికి చెందిన రైతు తడకపల్లి ఆగిరెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి గ్రామంలో సర్వేనంబర్ 345లో మూడు గుంటలు, సర్వేనంబర్ 346లో ఎకరం 32 గుంటల భూమిని బీమల లింగం అనే వ్యక్తి నుంచి ఖరీదు చేసుకొని మే 9 ,2005న డాక్యుమెంట్ నెంబర్ 2226/2005 ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని బొమ్మలరామార్వారం తాసిల్దార్ కార్యాలయంలో అమెండ్మెంట్ నెంబర్ 47/200708 ద్వారా పట్టా మార్పిడి చేసుకున్నారు .అందుకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలను సైతం పొందారు. తాను 2011వరకు పహాణి రికార్డుల్లో సైతం నా పేర రెవెన్యూ అధికారులు నా యొక్క భూముల వివరాలను పొందుపరిచారు. అప్పటినుంచి ఆన్ లైన్ రికార్డుల్లో నా పేరు రావడం లేదంటూ ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని, ఇదే విషయంపై జిల్లా అధికారుల ఫిర్యాదు చేసుసుకున్న నా సమస్య పరిష్కారం నోచుకోవడం లేదంటూ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ మూత తీసి సోమవారం కలెక్టరేట్ మందిరములో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల సమక్షంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని గోడు వెళ్లబోసుకునే ప్రయత్నం చేస్తుండడంతో అప్రమత్తమైన పోలీసులు పెట్రోల్ బాటిల్ లాక్కోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు .సమస్య జటిలంగా ఎందుకు మారిందో పూర్తి నివేదిక రూపకంగా తక్షణమే సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు బొమ్మలరామ్నార తాసిల్దార్ ను ఆదేశించారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతు ఆగి రెడ్డి ప్రజావాణి కార్యక్రమం నుంచి తిరిగి వెళ్లిపోయారు.

# డ్వాక్రా గ్రూపు సభ్యులకు శుభవార్త

## మహిళా స్వయం సహాయక బృందాల ప్రమాద బీమా పథకం 2029 వరకు పొడిగింపు

## ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీరాజ్‌శాఖ

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త :** తెలంగాణలోని మహిళా స్వయం సహాయక బృందాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. వారి ప్రమాద బీమా పథకాన్ని 2029 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రమాదవశాత్తు సభ్యులు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం అందుతుంది. ఈ పథకం ద్వారా ఇప్పటికే 409 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఈ వెసులుబాటుతో 1.67 లక్షల మంది కొత్త సభ్యులు బృందాల్లో చేరారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని ఈ నిర్ణయం ద్వారా తెలుస్తోంది. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జి) సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్త అందించింది. వారికి అందించే ప్రమాద బీమా పథకాన్ని 2029 సంవత్సరం వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బీమా పథకం స్త్రీ నిధి ద్వారా అమలు జరుగు తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే మహిళా స్వయం సహాయక బృందాలకు ఈ ప్రమాద బీమాను అందు బాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే.ఈ ప్రమాద బీమా పథకం ప్రకారం.. ఏదైనా ప్రమాదవశాత్తు (ఎస్‌హెచ్‌జి) సభ్యులు మరణిస్తే, వారి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం లభిస్తుంది. ఈ పథకం ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 409 మంది కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించారు. ప్రభుత్వం అందించిన ఈ వెసులుబాటు, ఆర్థిక భద్రత కారణంగా మహిళలు స్వయం సహాయక బృందాల్లో చేరడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు.ఇప్పటివరకు 1.67 లక్షల మంది కొత్త సభ్యులు ఈ బృందాల్లో చేరారు. సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రమాద బీమా పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ కొత్త జీవోను విడుదల చేసింది. మహిళా స్వయం సహాయక బృందాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబనకు, సామాజిక సాధికారతకు కీలకమైన వేదికలు. ఈ బృందాల ద్వారా మహిళలు చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించడంతో పాటుచిన్న తరహా పొదుపును ప్రోత్సహిస్తున్నారు. తద్వారా తమ కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. అయితే.. అనేక సందర్భాల్లో దురదృష్టవశాత్తు జరిగే ప్రమాదాలు వారి జీవితాలను, వారి కుటుంబాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశం తోనే తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకం మహిళా సాధికారతకు, గ్రామీణా భివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనడంలో సందేహం లేదు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఇది ఒక పెద్ద ఊరట అని చెప్పవచ్చు. దీని ద్వారా వారికి ఎలాంటి దురదృష్టకర సంఘటన జరిగినా.. వారి కుటుంబం ఆర్థిక కష్టాల్లో చిక్కుకోకుండా కొంతమేర రక్షణ లభిస్తుంది.

# సంస్థాగత నిర్మాణం కోసం ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిల నియామకం

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** సంస్థాగత నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసేందుకు ఉమ్మడి జిల్లాలవారీగా ఇన్‌చార్జిలను పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ నియమించారు. పిసిసి చీఫ్, ఎఐసిసి సోమవారం జిల్లా ఇన్‌చార్జిలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, 10 ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధివిధానాలను మీనాక్షి వెల్లడించారు. త్వరలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీల నిర్మాణం ఉంటుందని చెప్పారు. వెంటనే రంగంలోకి దిగాలని మీనాక్షి నటరాజన్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను పిసిసి చీఫ్ నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిలను ఆయన ప్రకటించారు. ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిల వివరాలిలా ఉన్నాయి ఖమ్మం- వంశీచంద్‌రెడ్డి, నల్లగొండ-సంపత్‌కుమార్, వరంగల్-అడ్లూరి లక్ష్మణ్, మెదక్-పొన్నం ప్రభాకర్, హైదరాబాద్-జగ్గారెడ్డి, మహబూబ్‌నగర్- కుసుమకుమార్, ఆదిలాబాద్-అనీల్‌యాదవ్, కరీంనగర్-అద్దంకి దయాకర్, నిజామాబాద్- అజ్మతుల్లా హుస్సేన్, రంగారెడ్డి-శివసేనరెడ్డి నియామకం అయ్యారు.

# కొత్త పరిశోధన మైలురాళ్లను నిర్దేశిస్తున్న యువత

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**ఎడ్యుకేషన్ కేయూ, జూలై 7, ప్రభాతవార్త :** 'నేటి దేశయువత పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డి)కి సిద్ధంగా కొత్త పరిశోధన మైలురాళ్లను నిర్దేశిస్తున్నారు' అని గవర్నర్, కాకతీయ విశ్వ విద్యాలయ ఛాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవ సందర్భంగా వివిధ ఫ్యాకల్టీ పీహెచ్‌డీ అభ్యర్థులకు పట్టాలు, వివిధ సబ్జెక్టుల మొదటి ర్యాంక్ పొందిన వారికీ గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేస్తూ విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, ఆహ్వానితులు, ప్రముఖులను ఉద్దేశించి కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ప్రసంగించారు. ప్రయోగాశాలకే కాకుండా, జీవితంలో కూడా సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణలోనే ఒక మహత్తర విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందిందన్నారు. న్యాక్ ఎ+ గ్రేడింగ్, 151 - 200 బ్యాండ్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, దేశంలోనే మూడో గ్రీన్ మెట్రిక్, జాతీయ స్థాయిలో ఫార్మసీ కళాశాల 84వ ర్యాంకింగ్ ఇవన్ని విశేష విజయాలు అని, ఇవన్ని కేవలం వనరులవల్ల మాత్రమే సాధ్యం కాదు ఉపాధ్యాయులు, పరిశోధకులు, విద్యార్థుల విజన్, పట్టుదలవల్ల సాధ్యమైనవన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ అన్నట్టు విద్యఅంటే శరీరం, మనస్సు, ఆత్మ అన్నింటిలోనే అత్యుత్తమని వెలికి తీయడమే", జాతీయ విద్యా విధానం 2020 దిశగా ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాల మెరుగుదల దీనికి అనుగుణంగా కృత్రిమా మేధా, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్సు, న్యూట్రిషన్ సైన్సు కోర్సులు కాకతీయ యూనివర్సిటీలో ప్రారంభించడం అభినందనియం అన్నారు. స్నాతకోత్సవం అంటే ఒక ముగింపుకాదని, ఒక కొత్త ప్రయాణ మని మాజీ రాష్ట్రపతి ఎ.పి.జే. అబ్దుల్ కలాం అన్న మాటలు గుర్తుచేశారు. భారత ప్రధాని సూచించిన క్రిటికల్ థింకింగ్, క్రియేటివిటీ, కొలాబరేషన్, క్యురియాసిటి, కమ్యూనికేషన్ లాంటి నైపుణ్యా లు 21వ శతాబ్దపు దిక్సూ చిలు అన్నారు. ప్రతీగొప్ప నాయకుడు ఒకప్పుడు విద్యార్థి అన్నా రు. ధైర్యంగా ముందుకు సాగాలని, మార్పును ఆమోదించాలని, దయ, నైపుణ్యంతో సేవ చేయాలన్నారు.



సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**ప్రతి విద్యార్థి జీవితం ఆనందభరితమైన క్షణం: డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి**

ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సంచాలకులు, శాంతి స్వరూప్ భట్నగర్ అవార్డుగ్రహీత డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్నాతకోత్సవం అనేది ప్రతి విద్యార్థి జీవితం ఆనందభరితమైన క్షణం అన్నారు. మీ విజయానికి కారణమైన తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, మిత్రులకు కృతజ్ఞత గా ఉండాలన్నారు. గ్రామీణప్రాంతం, తెలుగు మాధ్యమం అడ్డంకి కాదన్నారు. మన లక్ష్యం ముఖ్యమని, కేవలం జ్ఞానముంటే సరిపోదని, దాన్నెలా ఉపయోగించుకోవాలో తెలియాలన్నారు.

# మానవీయకోణంలో భూ సమస్యలకు పరిష్కారం చూపాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త :** పేద ప్రజలు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు. సచివాలయంలో సోమవారంనాడు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై మంత్రిగారు సమావేశం నిర్వహించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో40నుంచి 50 సంవత్సరాల నుంచిసాగుచేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, అయితే వివిధ నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీశాఖకు చెందినవని అటవీ అధికారులు కొర్రీ వేస్తున్నారని అన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపించి సమస్యలను జటిలం చేయవద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు.

# కెసిఆర్ అవినీతి నిర్వాకం వల్లే కూలిన మేడిగడ్డ

## సరైన సమయంలో ఎరువు సరఫరా చేసి రైతును ఆదుకొంటాం

## ఎమ్మెల్యే దేవరకద్ర జి.మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** కెసిఆర్ ప్రభుత్వ అవినీతి నిర్వాకం వలన మేడిగడ్డ కూలిపోయిం దనీ, ఆ బ్యారేజీలో నీళ్ల నిల్వ చేస్తే దిగువన ఉన్న ప్రాంతాల ప్రజల ప్రాణాలకు పొంచి ఉందని ఎన్‌డిఎస్‌ఎ తేల్చి చెప్పినదని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం సిఎల్‌పి మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ హరీశ్‌రావు సూచనలు కాదు ఎన్‌డిఎస్‌ఎ సూచనలను తమ ప్రభుత్వం పాటిస్తోంది. కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్లు హరీశ్‌రావు మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. కన్నెపల్లి, కల్వకుర్తి పంప్‌హౌస్‌లు మీరు ఓపెన్ చేస్తారా? మేము ఓపెన్ చేయాలా అని హరీశ్‌రావు మాట్లాడు తున్నడనీ మీరు కన్నెపల్లి, కల్వకుర్తి దగ్గరకు వస్తే మీ కాళ్లు విరగ్గొడతారు జాగ్రత్త అని హరీశ్‌రావుకు మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు ఎక్కడైనా ప్రాజెక్టుల దగ్గరకు వస్తే తాట తీస్తామని ఆయన అన్నారు. ముచ్చుమర్రి నుంచి ఆంధ్రప్రదేశ్ కృష్ణా నీళ్ల తోడుకుపోతుంటే బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పట్టించుకోలేదని ఆవేదన చెందారు. కేసీఆర్ సర్కార్ చేసిన తప్పిదాల వల్లనే ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను అప్పనంగా తీసుకెళ్తుతోంది.. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ చేసిన దోపిడీ వల్ల తెలంగాణ 100 యేళ్లు వెనక్కి పోయింది. కెసిఆర్‌ను తెలంగాణ బాపు అంటున్నారు ఫోన్ ట్యాపింగ్ చేసి భార్యాభర్తల జీవితాలు నాశనం చేసిన వ్యక్తి తెలంగాణ బాపు అయితడా అని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్షన్నర కోట్ల అవినీతిలో ప్రధాన కారకుడు కెసిఆర్ కేటిఆర్ వలే పశువులు కూడా ప్రవర్తించవని ఆయన అన్నారు. వాళ్లు చేసిన అవినీతిపై విచారణ జరుగుతుంటే బనకచర్ల అంశాన్ని ముందుకు పెట్టి పక్క దారి పట్టిస్తున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పోరాటం చేస్తే బనకచర్లను తాత్కాలికంగా కేంద్రం ఆపిందని వివరించారు. బనకచర్లకు బిఆర్ఎస్ పార్టీనే మూల కారణమని ఆరోపించారు. రైతులను ఏవిధంగా ఆదుకోవాలో, వాళ్లకు ఎరువులు ఎప్పుడు ఇవ్వాలో రైతు కుటుంబాల నుంచి వచ్చిన తమకు తెలుసు అని ఆయన చెప్పారు.



# నగరంలో విదేశీయులు అక్రమ తిష్ట

## ఇద్దరు నైజీరియన్లు, టాంజనీయా, సూడానీయనీలు అరెస్ట్

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** నగరంలో విదేశీయులు అక్రమంగా తిష్టవేసిన నల్గురుని సోమవారం హైదరాబాద్ పోలీసులు గుర్తించారు. వీసా గడువు అయిపోయినా ఉండడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘాపెట్టి అరెస్ట్ చేశారు. ఇద్దరు నైజీరియన్లు, టాంజనీయ, సుడానీయాన్ దేశస్తులను అదుపు లోకి తీసుకుని స్వదేశాలకు పంపిస్తున్నట్లు నార్త్‌జోన్ డీసీపీ సురేంద్ర పేర్కొన్నారు. ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారని, డ్రగ్స్ విక్రయాలపై నిఘాపెట్టడంతో వారు పట్టుబడ్డారు. అయితే కేసు నమోదు చేయకుండా వారిని స్వదేశాలకు పంపిస్తున్నట్లు వివరించారు. బంగ్లాదేశ్‌కి చెందిన మహ్మద్ హాసీబుల్ నాలుగేళ్ల క్రితం ట్రాఫికర్లకు రూ.25వేలు ఇచ్చి పశ్చిమబెంగాలీ మీదుగా భారత్‌లోకి ప్రవేశించాడు. కోల్‌కత్తాలో కరాటే శిక్షకుడిగా పని చేశారు. సోషల్‌మీడియాలో జయచౌదరీ పరిచయం కావడంతో ప్రేమగా మారి వివాహం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో జుమాటో, స్విగ్గీలో ఫుడ్ డెలివరీ ఏజంట్లుగా పని చేస్తున్నారు. స్థానిక ఏజంట్లు మహ్మద్ ముఖీద్, సాయికిరణ్ రజనీకాంత్ సహాయంతో నార్సింగ్ మున్సిపాలిటిలో ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్ సుధీర్‌కుమార్ నకిలీ బర్త్‌డే సర్టిఫికేట్లు పొందారు. దీన్ని ఆధారంగా హాసీబుల్ ఓటరు, ఆధార్‌కార్డుకు దరఖాస్తు చేసుకోగా తన స్నేహితుడు రోహన్‌సాహా, అతని భార్యను ఏడాదిక్రితం మలక్‌పేటకు తీసుకవచ్చి నకిలీ ఆధార్‌కార్డు ఇప్పించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి నకిలీ ఆధార్, ఓటరు కార్డులు, బర్త్ సర్టిఫికేట్లు,ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం

## 40 నెలలుగా భవన అద్దె బాకీ

## పక్షం రోజుల్లో పూర్తి అద్దె చెల్లించేలా చర్యలు తీసుకుంటానని సబ్‌రిజిస్ట్రార్ హామీ



అబ్దుల్లాపూర్‌మెట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం వేస్తున్న భవన యజమాని పిట్టల రాజుముదిరాజ్

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), జూలై 7, ప్రభాతవార్త :** ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించి 40 నెలల అద్దె చెల్లించడం లేదంటూ ఆ భవన యజమాని తాళాలు వేసిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, భవన యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కేంద్రంలోని ఓ ప్రైవేటు భవనంలో గత 17 సంవత్సరాల నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగుతోంది. అయితే గత 40 నెలలుగా ఈ కార్యాలయానికి సంబంధించిన అద్దెను చెల్లించకుండా భవన యజమాని అయిన పిట్టల రాజు ముదిరాజ్‌ను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తుండడంతో విసుగు చెందిన ఆయన సోమవారం ఉదయం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళాలు వేశారు. తనకు చెల్లించాల్సిన అద్దె డబ్బులు పూర్తిగా చెల్లించిన తర్వాతే కార్యాలయ తాళాలు తీస్తానని భీష్మించుకు కూర్చున్నాడు. బ్యాంకు రుణం తీసుకుని ఈ భవనాన్ని నిర్మించానని, ప్రతి నెల అద్దె సక్రమంగా వస్తే ఈఎంఐ చెల్లించేందుకు అవకాశం వస్తుందని భావించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తన భవనాన్ని అద్దెకు ఇస్తే ప్రతి సారి అద్దె చెల్లించే విషయంలో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని భవన యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయ పనివేళల్లో సుమారు గంటన్నర పాటు కార్యాలయానికి తాళం వేయడంతో ఇటు అధికారులు, అటు ప్లాట్ల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలకు కొంతమేర ఇబ్బందులు ఎదురైంది. దీంతో స్పందించిన స్థానిక సబ్‌రిజిస్ట్రార్ సునితా రాణి వచ్చే 15 రోజుల్లో పూర్తి అద్దె డబ్బులు వచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీనివ్వడంతో భవన యజమాని కార్యాలయ తాళాలు తీశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా సబ్ రిజి స్ట్రార్ కార్యాలయానికి తాళాలు వేశారన్న సమాచారం తెలుసుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు భవన యజమాని రాజు ముదిరాజ్‌ను స్టేషన్‌కు తరలించి కొద్దిసేపటి తర్వాత వదిలిపెట్టారు.




సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు చెన్నయ్య, బూర్గుల వెంకటేశ్వర్లు, బైండ్ల శ్రీనివాస్ తదితరులు

# వర్గీకరణతో విద్య, ఉద్యోగాల్లో మాలలకు తీవ్రనష్టం

## రోస్టర్ విధానాన్ని సవరించి న్యాయం చేయాలి

## మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలకు జరిగిన అన్యాయంపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు ఈ నెల 11న హైదరాబాద్ లక్డీకాపూల్‌లో జరిగే మాలమహానాడు రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని జయప్రదం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనలు పాటించకుండా సరైన ఎంపరికల్ డేటా లేకుండా ప్రభుత్వం చేసిన వర్గీకరణ వల్ల మాలలు విద్య, ఉద్యోగ రంగాలలో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఒక్క ఉద్యో గం కూడా గ్రూప్3కి కేటాయించబడలేదంటే మాలలపై ప్రభుత్వం ఏ స్థాయి లో కుట్ర చేసిందో అర్థమవుతుందని ఈ వర్గీకరణపై న్యాయపోరాటం చేస్తూనే ప్రజా పోరాటాలు చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాం గం కల్పించిన 15శాతం విద్య, ఉద్యోగ అవకాశాలలో మాలలను ఐదు శాతానికి పరిమితం చేయడంతోపాటు 22, 41వ రోస్టర్ పాయింట్లు కేటాయించడం ద్వారా ఉద్దేశపూర్వకంగా మాలలను అణచివేసే కుట్ర చేసిం దని, మాలల హక్కుల కోసం రాజ్యాంగ రక్షణ కోసం భవిష్యత్ కార్యా చరణ ను రూపొందిస్తామని అన్నారు. సమావేశంలో గ్రేటర్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగి ఆనందరావు, నల్లగొండ జిల్లా అధ్యక్షులు లకుమాల మధుబాబు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.లలిత, మరిపల్లి శ్రీకాంత్, రాజేష్, రాకేష్, శివశంకర్, బాలకృష్ణ, శాలిం రాజు, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ దిగుమంతి సుంకం పెంపుపై
## దక్షిణాది మంత్రులతో కేంద్రాన్ని కలుస్తాం
### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త :** ఆయిల్ పామ్ దిగుమతులపై సుంకాలు 44 శాతం పెంచాలన్న డిమాండ్ పై దక్షి ణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో కల్సి కేంద్రాన్ని కలిసే యోచనలో ఉన్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. అయిల్ పామ్ సాగుదారుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతో నలుగురు దక్షి ణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో సంప్రదింపులు నిర్వహించినట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కేంద్రం క్రూడ్ పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకాలను తగ్గించడం వల్ల దేశీయ మార్కెట్‌లో చౌకగా దిగుమతి ఆయిల్ లభిస్తోందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అందోళన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో మిల్లర్లు, రిఫైనర్లు, రీటైల్ వ్యాపారులకు మాత్రం లాభాలు కలుగుతున్నాయన్నారు. ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనాలంటే దక్షి ణాది రాష్ట్రాల మధ్య సమన్వ యం అవసరమని భావించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటకతో పాటు, ఈశాన్య రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మిజోరం, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు వ్యక్తిగతంగా లేఖలు పంపినట్లు వెల్లడించారు. అవసరమైతే దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులతో ప్రత్యక్షంగా సమావేశమై, ఆయిల్ పామ్ దిగుమతి విధానాల్లో మార్పులు చేయాలన్న డిమాండ్‌ను వినిపించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

## ట్రస్ట్ బ్యాంక్ సిస్టంతో ఫీజు రీయింబర్స్‌మెంట్
## బకాయిలకు చెక్ పెట్టండి
### పరిశీలిస్తామన్న డిప్యూటీ సిఎం భట్టి

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:**రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలకి చెక్ పెట్టడానికి ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఎఫ్ఏటిహెచ్ఐ) ప్రత్యేకంగా ట్రస్ట్ బ్యాంక్ సిస్టంను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. రివైజ్డ్ అండ్ సెల్ఫ్ సస్టెయినబుల్ ఫీ ఫండింగ్ స్కీమ్‌గా కొనసాగిస్తే బాగుంటుందని సూచించింది. అసోసియేషన్ నేతలు సోమవారం ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావుతోపాటు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్య శాఖ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన, వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో అసోసియేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్ అరోరా అసోసియేషన్ నేతలు రవి కెఐస్, గీతాంజలి నుండి రవీందర్ రెడ్డి, డాక్టర్ కె రామదాస్, పి రమేష్ బాబు, డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి, సునీత భూపాల్ రెడ్డి, డాక్టర్ సునీల్ కుమార్, కొడాలి కృష్ణారావు, సిద్దార్ధ గ్రూప్ ఆఫ్ కాలేజీస్ డాక్టర్ నాగయ్య చౌదరి తదితరులు సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం లేకుండా ఉండటం కోసమే తాము ఈ ప్రతిపాదనను చేస్తున్నట్టు అసోసియేషన్ నేతలు ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు.



## అమెరికాలో ఘోర రోడ్డుప్రమాదం
### హైదరాబాదీ కుటుంబం దుర్మరణం

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంభం సజీవదహనమయ్యారు. సెలవుల నేపథ్యంలో శ్రీవెంకట్, తేజస్వీని దంపతులు, ఇద్దరు కుమారులు ట్లాంటలోని బంధువుల ఇంటికి వెళ్లారు. వారం రోజులు ఉండి డల్లాస్‌కు వెళ్లేందుకు కారులో తిరుగు ప్రయాణం కాగా భారత్‌కాలమాని ప్రకారం సోమవారం సాయంత్రం సుమారు 6గంటల సమయంలో గ్రీన్‌కౌంటీ ప్రాంతం వద్ద ఓ ట్రక్కు రాంగ్‌రూట్‌లో వారి కారును ఢీకొట్టింది. దీంతో కారు నుజ్జునుజ్జు అయి మంటలు చెలరేగి అక్కడికక్కడే నల్గురు దుర్మరణం పాలయ్యారు. మంటలధాటికి బయటకు రాలేక అందులోనే చిక్కడంతో కాలిబూడిదయ్యారు. కేవలం ఎముకలు మాత్రమే మిగిలాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఘటనను పరిశీలించి వాటిని ఫోరెనిక్స్‌కు పంపారు. డీఎన్ఏ శాంపిల్స్‌తో మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. సమాచారం అందుకున్న వారి హైదరాబాద్‌లోని నివాసంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఫారన్ ట్రిప్పులో సంతోషంగా గడుపుతారని వెళ్లి కన్నీటిసంద్రంగా తిరుగొస్తున్నారని బంధువుల రోదనలు కంటతడిపెట్టించాయి.

## ఇంట్లో గొడవపడి వచ్చిన మహిళపై సామూహిక అత్యాచారం

**సోనిపట్,(హర్యానా), జూలై 7:** భర్తతో గొడవపడి కోపంతో ఇంటినుంచి వచ్చేసిన మహిళపై కామాంధులు ఘోరంగా అత్యాచారంచేసారు. రాత్రి రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా కూర్చున్న ఆమెను ఓ వ్యక్తి రైలు బోగీలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత అతని ఇద్దరు స్నేహితులు అక్కడికి వచ్చి వాళ్లు కూడా అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత నిస్సహాయ స్థితిలోకి వెళ్లిన మహిళను సోనిపట్ కు తీసుకెళ్లి రైలు పట్టాలపై పడేసి పారిపోయారు. రైలు కాలు పైనుంచి పోవడంతో ఆమె కాలు తెగిపోయింది. హర్యానా లోని పానిపట్ లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. పానిపట్‌కు చెందిన మహిళ ఈ నెల 24న భర్తతో గొడవ పెట్టుకుని బయటికి వెళ్లింది. అయితే రెండు రోజులైనా రాకపోవడంతో జూన్ 26న ఖ్విల్లా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సదరు మహిళ కోసం గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు ఆదివారం పోలీసులకు ఆమె ఆచూకీ లభ్యమైంది. కాలు కోల్పోయి సోనిపట్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె ఆదివారం స్పృహలోకి వచ్చి జరిగిన దారుణం గురించి వెల్లడించింది. తాను భర్తతో గొడవ తర్వాత పానిపట్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి కూర్చున్నానని, అక్కడికి ఓ వ్యక్తి మీ భర్త పంపించాడని చెప్పి వచ్చాడని, ఇంటికి తీసుకెళ్తానని చెప్పి ఓ ఖాళీ రైలుబోగీలోకి తీసుకెళ్లాడని, అక్కడ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని, ఆపై మరో ఇద్దరిని పిలిపించి అత్యాచారానికి పాల్పడ్డారని, వాళ్లతో పెనుగులాడి తాను అలసిపోయానని, నిస్సహాయ స్థితిలో తనను సోనిపట్‌కు తీసుకెళ్లి రైలుపట్టాలపై పడేసి పారిపోయారని, రైలు కాలుపై నుంచి వెళ్లడంతో తను కాలు కోల్పోయానని, ఆ తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని, స్పృహ వచ్చేసరికి ఆస్పత్రిలో ఉన్నానని ఆమె చెప్పారు.

## ఇన్‌సర్వీస్ పిజి డాక్టర్లను మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించాలి
### మంత్రికి తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ వినతి

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఇన్‌సర్వీస్ పిజి డాక్టర్లను మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా ల్యాటరల్ ఎంట్రీ ద్వారా వెంటనే నియమించాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ నేతలు సోమవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకి విజ్ఞప్తి చేశారు. పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తున్న ఇన్‌సర్వీస్ వైద్యులు పిజి పూర్తి చేసిన తరువాత మెడికల్ కాలేజీల్లో ల్యాటరల్ ఎంట్రీ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నేరుగా అబ్జార్బ్ చేయాలని మంత్రిని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం పునరుద్ధరించిన ఇన్‌సర్వీస్ కోటా ద్వారా తొలి బ్యాచ్ 2021లోఎంటర్ అయి 2025లో కోర్సు పూర్తి చేసుకుని ఉన్న స్పెషలిస్ట్ ఇన్ సర్వీస్ వైద్యులు ఇకపై ప్రతి సంవత్సరం150 నుంచి 250 మంది ఇన్‌సర్వీస్ పీజీ వైద్యులు వివిధ స్పెషాలిటీల్లో పట్టభద్రులు అవుతారని అసోసియేషన్ నేతలు తెలిపారు.

# బ్రిక్స్ కూటమి ఏ ఒక్కదేశానికి వ్యతిరేకం కాదు
### మా కూటమి ఘర్షణ కోరుకోవడం లేదు : చైనా




**బీజింగ్,జూలై 7:** బ్రిక్స్ అనుకూల దేశాలపై అదనపు టారిఫ్‌లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు చైనా ఘాటైన కౌంటర్ వేసింది. ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చే మార్గంగా సుంకాలను ఉపయోగించడాన్ని డ్రాగన్ తీవ్రంగా వ్యతిరేకించింది. బ్రిక్స్ ఘర్షణను కోరుకోవడం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ ట్రంప్ ప్రకటనపై స్పందించారు. ప్రతీకార సుంకాలు విధించడం వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదని ఆయన అన్నారు. ఇతరులను బెదిరించే సాధనంగా సుంకాలను ఉపయోగించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బ్రిక్స్ కూటమి సమగ్రత, దేశాల మధ్య పరస్పర సహకారాన్ని ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. బ్రిక్స్ అనేది అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సహకారానికి ఒక వేదిక అని కొనియాడారు. ఏ నిర్దిష్ట దేశానికి వ్యతిరేకంగా బ్రిక్స్ పనిచేయదని వెల్లడించారు. బ్రెజిల్ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు మరో బాంబు పేల్చారు. బ్రిక్స్ అనుకూల దేశాలపై అదనపు టారిఫ్‌లు విధిస్తామన్నారు. బ్రిక్స్‌లో అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే ఏ దేశానికైనా అదనంగా 10శాతం సుంకాలను వేస్తామని హెచ్చరించారు. అందులో ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. మరోవైపు, ప్రపంచదేశాలతో వాణిజ్య ఒప్పందాల అంశం పైనా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. సుంకాలు, వాణిజ్య నిబంధనలకు సంబంధించి సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ( అమెరికా కాలమానం ప్రకారం) పలు దేశాలకు అధికారిక లేఖలు పంపించనున్నట్లు స్పష్టం చేశారు. కొత్త టారిఫ్‌లు, అమలు తేదీని అందులో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. కాగా, బ్రెజిల్ వేదికగా జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో భారత ప్రధాని మోదీ సహా పలువురు దేశాధినేతలు, ప్రతినిధులు అమెరికా సుంకాల అంశాన్ని ప్రస్తావించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలోనే ట్రంప్ బ్రిక్స్ అనుకూల దేశాలపై టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించినట్లు సమాచారం.

# ప్లాంటేషన్ పోడు వద్ద ఉద్రిక్తత
### పోడు సాగును అడ్డుకున్న ఫారెస్టు అధికారులు
### ప్లాంటేషన్ పోడును సందర్శించిన డిఎఫ్ఓ

**కారేపల్లి, జూలై 7, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం మాణిక్యారం ఎర్రబోడు ఊటవాగు సమీపంలోని ప్లాంటేషన్ పోడు లో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్లాంటేషన్ పోడుకు ప్రత్యామ్నాయం పోడు చూపుతామని 2020 సంవత్సరంలో 60 మంది పోడు దారుల నుండి 50 హెక్టార్లు పోడును సేకరించిన ఫారెస్టు అధికారులు, బాధితులకు ప్రత్యామ్నాయ పోడు చూపకుండా తాత్సర్యం చేయటంతో ఐదేండ్లుగా పోడు వివాదం రగులుతునే ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పోడు సమస్యకు పరిష్కారం చూపుతామని కాలం వెళ్లదీస్తుండటంతో చేసేది లేక పోడుదారులు తమ పోడును సాగు చేసుకోవటానికి ప్లాంటేషన్ ప్రాంతానికి చేరుకోని ప్లాంటేషన్ పోడులో అరకలు కట్టి సాగు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు ఆప్రాంతానికి వెళ్ళి పోడుసాగుదారులను అడ్డుకున్నారు. దీంతో ఫారెస్టు, పోడుదారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అదే క్రమంలో హక్కు పత్రాలు ఉన్న రైతు తమ పోడులో ఎరువులు వేయటానికి వెళ్లుతుండగా అతనిని సైతం ఫారెస్టు అధికారులు ఆపటంతో రైతులు అగ్రహంతో వాగ్వివాగం దిగారు. ప్లాంటేషన్ కు తమ పోడును ఇస్తే ఫారెస్టు అధికారులు తమను మోసం చేసి పేదలమైన తమకు పోడు భూమి లేకుండా చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము గతంలో సాగు చేసిన పోడును తమకే కావాలని పట్టుపట్టారు. విషయం తెలుసుకున్న జిల్లా ఫారెస్టు అధికారు ప్లాంటేషన్ ప్రాంతానికి చేరుకోని విచారించారు. డీఎఫ్‌వో పోడుదారులు తమ సమస్యను విన్నవించారు. ప్లాంటేషన్ చుట్టు హక్కుపత్రాలు ఉన్న పోడు ఉందని వాటికి తమ భూములే రికార్డులలో హద్దులుగా ఉన్నాయని డీఎఫ్‌వో చూపారు. ప్లాంటేషన్‌కు కొంత భూమి ఇస్తే తమ సమస్య శాశ్వతంగా తీరుతుందని ఆశిస్తే ఫారెస్టు అధికారులు అసలుకే ఎసరు పేడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కొత్తగా వచ్చానని రెండు రోజులలో దీనిపై విచారిస్తాని అప్పటి వరకు ప్లాంటేషన్ లోకి వెళ్లవద్దని పోడుదారులను కోరారు. తాము సాగు చేయకుండా ప్లాంటేషన్ వద్దనే ఉంటామని సమస్యలను త్వరితగతిని పరిష్కరించాలని కోరారు.ప్లాంటేషన్ పోడు బాధితులకు న్యాయం చేయాలి !! ప్రజాసంఘాలుప్లాంటేషన్ పోడు బాధితులకు ప్రత్యామ్నాయ పోడు చూపు వారి న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కొండెబోయిన నాగేశ్వరరావు, వజ్జా రామారావు, కే.నరేంద్ర లు డిమాండ్ చేశారు. ప్లాంటేషన్‌లో 23 మంది రైతులు నష్టపోయారని వారికి ప్రత్యామ్నాయం చూపాల్సిన ఫారెస్టు అధికారులు తాత్సర్యంలో సమస్య జఠిలం అయిందన్నారు. ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిచ్చే క్రమంలో ప్లాంటేషన్ పోడు దారుల భూములను సైతం సర్వే చేశారని కాని వారికి పట్టాలివ్వలేదన్నారు. పేదలకు న్యాయచేయాలని లేదంటే వారికి మద్దతుగా అందోళనకు సైతం సిద్ధమని హెచ్చరించారు.

# ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

**జూరాలకు 1,12,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**
**12గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల**
**190 టీఎంసీలకు చేరుకున్న శ్రీశైలం డ్యాం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 7, ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టులు జలకళను సంతరించుకుంటున్నాయి. కర్ణాటక సహా ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తోన్న భారీ వర్షాల వల్ల కృష్ణానది పరవళ్లు తొక్కుతున్నది. కర్ణాటకలో దీనిపై నిర్మించిన ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. ఆలమట్టి, నారాయణ్ పూర్ ప్రాజెక్టులు గరిష్ఠ నీటి మట్టానికి చేరుకున్నాయి. ఇటీవలే వాటి గేట్లను ఎత్తివేయడంతో భారీ వరద చేరుకుంటున్నది. ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేయడంతో జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది.

**ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలకు..**

కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంటున్నది. ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయానికి నిండుకుండలను తలపిస్తున్నాయి. ఆల్మట్టి గరిష్ఠ స్థాయి మట్టం 519.60మీటర్లు,123.081 టీఎంసీలకుగానూ 517.30మీటర్లు, 88.248 టీఎంసీలకు చేరుకున్నది.

కాగా ప్రాజెక్టుకు 1,11,472 ఇన్‌ఫ్లో నమోదు కాగా 1,15,000 అవుట్‌ఫ్లో నమోదు అయింది. నారాయణపూర్ జలాశయం 492.25 మీటర్లు,33.313 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 490.77మీటర్లు, 26.936 టీఎంసీలుగా నమోదైంది. ఇన్‌ఫ్లో 1,15,000 నమోదు కావడంతో 30గేట్ల ద్వారా 112,577క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేశారు.

**జూరాల 12గేట్ల ద్వారా దిగువకు..**

ప్రియదర్శిని జూరాల డ్యామ్‌కు వరద పెరుగుతున్నది. ఎగువ ప్రాంతం కర్ణాటక నుంచి వరద పోటెత్తడంతో నిండుకుండను తలపిస్తున్నది. దీంతో 12గేట్ల ద్వారా దిగువన శ్రీశైలం జలాశయానికి నీటి విడుదల కొనసాగుతున్నది. సోమవారం జూరాలకు 1,12,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల కెపాసిటీ 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 7.316 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 29,159 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 79,200 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. అదేవిధంగా బీమా లిఫ్టు -1కు 1,300 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడవ కాలువకు 550, క్యూసెక్కులు, కుడి కాలువకు 285 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,10,852 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

**880అడుగులకు శ్రీశైలం డ్యాం**

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరుకుంటున్నది. సోమవారం అందిన సమాచారం మేరకు శ్రీశైలానికి ఇన్ ఫ్లో 1,80,000 క్యూసెక్కులుగా నమోదైంది. అవుట్ ఫ్లో 56వేల క్యూసెక్కులుగా ఉన్నది. ఇదే విధంగా డ్యాంకు వరద చేరితే రెండు మూడు రోజుల్లో గేట్లను ఎత్తివేసే అవకాశం ఉన్నది. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం నీటిమట్టం 880 అడుగులకు చేరుకుంది. 216 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేసే సామర్థ్యం ఉంది జలాశయానికి. ప్రస్తుతం ఈ స్థాయికి చేరుకోలేదు. ప్రస్తుతం 190టీఎంసీల మేర నీళ్ల నిల్వ ఉన్నాయి.

# విత్తన చట్టాన్ని రూపొందిస్తున్నాం
### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రభాతవార్త, వాజేడు:** నకిలీ విత్తనాలతో రైతులు మోసపో వద్దని, విత్తన చట్టాన్ని రూపొందించుటకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ , సహకారం, చేనేత, వస్త్రాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.సోమవారం ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో వాజేడు, వెంకటాపురం, కన్నాయి గూడెం మండలాల్లో 1521 ఎకరాల్లో మొక్కజొన్న వేసి పంట నష్టపోయిన 671 రైతులకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ , సహకారం, చేనేత, వస్త్రాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, తెలంగాణా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి, తెలంగాణా విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఎస్. అన్వేష్ రెడ్డి, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఐటీడిఏ పి.ఓ.చిత్ర మిశ్రా లతో కలిసి 3 కోట్ల 80 లక్షల 97 వేల 264 రూపాయల విలువగల చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన రైతులందరికీ ప్రైవేట్ కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించడం జిల్లా అధికా రుల సమిష్టి కృషితోనే సాధ్యమైందని, రాష్ట్రం లోని రైతులకు లక్ష అయిదు కోట్ల రూపాయలు అందించి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నామని అన్నారు. రైతులు విత్తనాలతో మోస పోకుండా రాష్ట్రంలో విత్తన చట్టాన్ని రూపొందిస్తున్నామని అన్నారు. ఆదివాసీల జీవన విధానంలో మార్పు రావడానికి మంత్రి సీతక్క ప్రజా జీవితాన్ని ప్రారంభించడం గొప్ప విషయమని, ప్రైవేటు కంపెనీల యజమానుల మెడలు వంచి రైతులకు నష్టపరిహారం అందించడం జిల్లా అధికారుల కృషి ఎన్నటికీ మరువలేమని అన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అభివృద్ధి ఫలాలను అమలు చేస్తున్నదని, గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కలిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ములుగు జిల్లాలో పర్యటక ప్రాంతాలు ఉన్నాయని, రానున్న రోజులలో కర్రెగుట్టలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దామని తెలిపారు. గతం లోని పాలకులు రైతులకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారని, తాము అధికారంలోకి వచ్చిన అనంతరం ఇందిరమ్మ రాజ్యం ద్వారా రైతులకు అన్ని సంక్షేమ ఫలాలను అందజేస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలు సహకరించకపోయిన అప్పులు తీర్చుతూనే నూతన పథకాలను. ప్రవేశపెడుతున్నామని, జిల్లాలో పామాయిల్ పంట సాగు చేయడమే కాకుండా హార్టికల్చర్, సెరికల్చర్ ద్వారా రైతులకు ఆదాయం అందే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా విత్తనాలు, ఫర్టిలైజర్ కొనుగోలు చేసిన పక్షంలో బిల్లులు తప్పనిసరిగా పొందాలని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఐదు నెలల పోరాట ఫలితంగా నేడు రైతులు ప్రైవేట్ కంపెనీల ద్వారా నష్ట పరిహారం పొందుతున్నారని, ఇది చరిత్రలోనే నిలిచిపోతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పలుసార్లు సమావేశాలు నిర్వహించడమే కాకుండా ప్రైవేట్ కంపెనీలను ఒప్పించడంలో విజయం సాధించ్చారని హర్షం వ్యక్తం చేశారు.

## యాదాద్రి పవర్ స్టేషన్ రైల్వే పనులు పూర్తి చేయండి
### తెలంగాణ జెన్‌కో సిఎండి రిజ్వీ

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని దామెరచర్లలో 4000 (5/800 మెగావాట్లు) మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా దానికి అవసరమైన బొగ్గు రవాణా నిమిత్తం పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ పనులు పూరినత చేయాలని విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో సిఎండి సయ్యద్ అలీ రిజ్వీ అధికారులను అదేశించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం జరిగిన సమావేశంలో అయన మాట్లాడుతూ థర్మల్ కేంద్రం యూనిట్ 2, యూనిట్ 1 ప్రారంభించబడిందని, మిగిలిన 3 యూనిట్లు ఫిబ్రవరి 2026 నాటికి ప్రారంభించబడతాయన్నారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం మొత్తం ఐదు యూనిట్లకు అవసరమైన బొగ్గు సింగరేణి నుండి సరఫరా అవుతుందని చెప్పారు. ఇందుకు గాను జనపహాడ్ టేకాఫ్ పాయింట్ నుండి యాదాద్రి సైట్ వరకు 500 కోట్ల రూపాయల వ్యయంతో రైల్వే లైన్ నిర్మించినట్లు వివరించారు. ప్రస్తుతం రైల్వే యాదాద్రికి రోజుకు నాలుగు రేక్‌లను సరఫరా చేస్తున్నాయని, అయితే ఈ ఏడాది డిసెంబర్ నుండి మొత్తం ఐదు యూనిట్లకు 1214 రేక్‌ల అవసరం ఉంటుందని వెల్లడించారు. ఇందుకు అవసరమైన రైల్వే సైడింగ్ యొక్క అన్ని పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు, కాగా ప్రస్తుత రైల్వే నెట్‌వర్క్‌తో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు అవసరమైన బొగ్గును తరలించడానికి రైల్వే పూర్తిగా సిద్ధంగా ఉందని రైల్వేస్ ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ తెలియజేశారు. డోర్నకల్ మరియు విష్ణుపురం మధ్య రైల్వే లైన్ల డబ్లింగ్ పనులను కూడా రైల్వే చేపడుతోందని పేర్కొన్నారు. యాదాద్రి అవసరాన్ని తీర్చడానికి అవసరమైన బొగ్గును సరఫరా చేసేందుకు ఇతర ప్రత్యామ్నాయ వనరులను పరిశీలించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో, జెన్కో డైరెక్టర్లు బి. నాగ్య, ఎ. అజయ్, కె. పద్మజ, సౌత్ సెంట్రల్ రైల్వేస్ అధికారి ఆర్. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## 8 గంటల పని హక్కుని మార్చడం దుర్మార్గం
### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** బ్రిటిష్ కాలంలోనే పోరాడి సాధించుకున్న 8 గంటల పని హక్కుని మార్చడం దుర్మార్గమని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రాష్ట్రంలోని వాణిజ్య ప్రదేశాలలో ఉద్యోగులు, కార్మికులను రోజుకు 10 గంటల పాటు పని చేసేందుకు యాజమాన్యానికి వీలు కల్పిస్తూ జారీ చేసిన జివో 282ను తక్షణం ఉపసంహారించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులకు భంగకరమని మండిపడ్డారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ ఇలాంటి జిఒల ద్వారా దొడ్డి దారిన అమలు చేయడం మంచిది కాదని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఒకవైపు దేశవ్యాప్తంగా ఈ నెల 9న నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సార్వత్రిక సమ్మెకు సిద్ధమైన తరుణంలో .. ఇలాంటి తిరోగమన జిఒ జారీ చేయడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. జిఒలో కార్మికులు 10 గంటలు పని చేసే సమయంలో ఓవర్ టైమ్ ఇవ్వాలని, 6 గంటలకు ఒకసారి అరగంట విశ్రాంతి ఇవ్వాలని, వారానికి 48 పని గంటలు మించొద్దని ఉన్నప్పటికీ, ఆచరణ సాధ్యం కాదని.. ఎందుకంటే తూతూ మాత్రం తనిఖీల ఉంటాయని స్పష్టం చేశారు.



## నటుడు వెంకట్ వైద్య ఖర్చులు భరిస్తాం
### మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, జూలై 5, ప్రభాతవార్త:** సినీ నటుడు ఫిష్ వెంకట్‌కు అయ్యే వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని మత్స్య శాఖ మంత్రి వి శ్రీహరి హామీ ఇచ్చారు. మేడ్చల్ జిల్లా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆస్పత్రిలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న వెంకట్‌ను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వెంకట్ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. తెలంగాణ యాసలో గొప్పగా నటించిన నటుడు అని పేర్కొన్నారు. చికిత్స పూర్తి అయ్యే వరకు ప్రభుత్వమే ఎంత ఖర్చు అయినా భరిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ, అంధ్రప్రదేశ్‌ల్లో వెంకట్ ను గుర్తు పట్టని వాళ్లు ఉండరన్నారు. త్వరగా కోలుకొని తిరిగి నటన కొనసాగించాలని పేర్కొన్నారు. అనంతరం వెంకట్ కుటుంబానికి మంత్రి శ్రీహరి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.

## బాలిక అత్యాచార ఘటనలో నిందితుడికి 20యేళ్ల శిక్ష, రూ.5వేల జరిమానా

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** మైనర్‌బాలికలను ప్రేమపేరిట లొంగదీసుకొని శారీరక సంబంధాన్ని కొనసాగించి గర్భవతిని చేసిన యువకుడికి సోమవారం నాంపల్లి కోర్టు బలమైన తీర్పు ఇచ్చింది. 20ఏళ్ల కఠినగారశిక్షతో పాటు రూ.5వేల జరిమాన విధించింది. అదేవిధంగా బాధితురాలికి రూ.8లక్షల పరిహారం ఇవ్వాలని తీర్పులో వెల్లడించింది. పాతబస్తీకి చెందిన అఖిల్ అనే యువకుడు ఓ బాలికలను మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడడంతో ఫోక్సో కేసు నమోదైంది. అయితే విచారణలో బాలికల వాంగ్మూలం, మెడికల్ రికార్డులు ఎఫ్ఐఆర్‌లో పొందు పరిచారు. వీటి ఆధారంగా ఫోక్సో స్పెషల్ సెషన్స్ కోర్టు పరిగణనలోకి తీసుకుంది.

## లింగ నిర్ధారణ పరీక్షలతో అబార్షన్‌లు
### గాయత్రి ఆసుపత్రిలో ఎస్ఒటి బృందం దాడులు
### రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయిన నిర్వాహకులు

**భువనగిరి రూరల్, జూలై 7, ప్రభాతవార్త :** సభ్య సమాజం తలదించుకునేలా మానవత్వాన్ని మంట కలుపుతూ నిబంధనల విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఇద్దరు మహిళలకు అబార్షన్ చేసిన సంఘటనలో ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడు రెడ్ హ్యాండెడ్గా ఎస్ఓటి పోలీసులకు దొరికిపోయారు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో కలకలం సృష్టించింది వివరాల్లోకి వెళితే జిల్లా కేంద్రంలో గాయత్రి ప్రైవేట్ ఆసుపత్రిలో ఆదివారం రాత్రి లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఇద్దరు మహిళలకు అబార్షన్ చేస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎస్ఓటి పోలీసులు హాస్పిటల్ పై దాడి చేశారు ఈ సందర్భంగా అబార్షన్ చేయించుకున్న మహిళల నుంచి తీసివేసిన పిండాలను ఎస్వోటీ పోలీసులు స్వాధీనం చేసుకుని డిఎన్ఏ పరీక్షల నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు గర్భవతులపై లింగ నిర్ధారణ చేసిన ఎస్ ఎల్ ఎన్ ఎస్ ల్యాబ్ టెక్నీషియన్ దంతూరి పాండు తో పాటు అబార్షన్ చేసిన డాక్టర్ శివకుమార్ లను పోలీసులు అదుపులోకి తీసుకొని పట్టణ సీఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు విచారిస్తున్నారు.ప్రాథమిక విచారణలో లింగ నిర్ధారణ చేసి అబార్షన్ జరిపినట్టు స్పష్టం చేశారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన గర్భిణి స్త్రీ తో పాటు, వీరవెల్లి గ్రామానికి చెందిన మరో మహిళకు అబార్షన్ చేసినట్లు పోలీసులు, వైద్యాధికారుల గుర్తించారు. ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద హుటాహుటిన హాస్పిటల్‌కు చేరుకొని విచారణ చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెడికల్ నిబంధనల ప్రకారం ఎలాంటి నోటిఫైడ్ సర్టిఫికెట్‌లు లేకుండా హాస్పిటల్ నడుపుతూ, నిబంధనలకు విరుద్ధంగా గర్భస్రావం చేసినందుకు హాస్పిటల్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ, అబార్షన్లు నిర్వహిస్తే పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# 11న 'దీర్ఘాయుష్మాన్ భవ'

కార్తీక్‌రాజు, నోయల్, మిస్తి చక్రవర్తి హీరో హీరోయిన్లుగా ఎం.పూర్ణానంద్ దర్శకత్వంలో త్రిపుర క్రియేషన్స్ పతాకంపై నిర్మాత వంకాయలపాటి మురళీ కృష్ణ నిర్మించిన దీర్ఘాయుష్మాన్ భవ చిత్రం విడుదలకు సిద్దమైంది. కాగా ఈ చిత్రం ట్రైలర్, ప్రోమోస్, పాటలను హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన ప్రీరిలీజ్ కార్యక్రమంలో పలువురు అతిథులు ఆవిష్కరించారు. ట్రైలర్ను తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్, ఫిలిం ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్.దామోదర్ ప్రసాద్, ప్రోమోస్‌ను ప్రముఖ నటుడు ఓ.కల్యాణ్, పాటలను జబర్దస్త్ ఆర్.పి. ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథి కె.ఎల్.దామోదర్ ప్రసాద్, మాట్లాడుతూ, కొత్త నిర్మాతలకు చిత్ర పరిశ్రమ ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతూనే ఉంటుంది. అయితే కొత్త నిర్మాతలు చిత్ర పరిశ్రమ మీద కనీసం ఒక ఏడాది పాటు అవగాహన పెంచుకుని వస్తే బావుంటుంది. దీనికి సంబంధించి ప్రొడ్యూసర్స్ కౌన్సిల్, ఛాంబర్ తరపున మేము ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ఇస్తూనే ఉన్నాం. పెద్ద, చిన్న సినిమాల సమస్యలు, సాధ్యాసాధ్యాల గురించి ఛాంబర్‌లో చర్చించబోతున్నాం. ఇక ఈ సినిమా విషయానికి వస్తే, మంచి అభిరుచితో, మంచి కాంబినేషన్ ఆర్టిస్టులతో ఈ సినిమా తీసినట్లు అనిపిస్తోంది. తప్పకుండా ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని ఆస్తిస్తున్నాను అని అన్నారు. చిత్రాన్ని నట్టీస్ ఎంటర్ టైన్మెంట్స్ డిస్ట్రిబ్యూషన్ తరపున థియేటర్లలో విడుదల చేస్తున్న నట్టి కుమార్ మాట్లాడుతూ, చిన్న సినిమాల సమస్యలను తీర్చేందుకు ఇటు పరిశ్రమ, అటు రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవాలి. చిన్న సినిమాకు 230 గంటల షోను కేటాయించాలి. మల్టీ ప్లెక్స్ లలో పేదవాడు సినిమా చూసే విధంగా ఆక్యుపెన్సీలో 20 శాతం టిక్కెట్ రేట్లను 75 రూపాయలుగా నిర్ణయించాలి. నటుడు జబర్దస్త్ ఆర్.పి. మాట్లాడుతూ, నట్టి కుమార్ ఈ సినిమాను విడుదల చేస్తున్నారు అంటే తప్పకుండా ఈ చిత్రంలో మంచి కంటెంట్ ఉంటుందని భావిస్తున్నాను. చిన్న సినిమాల సమస్యలు తొలగితే, పరిశ్రమకు మరింత మేలు జరుగుతుందన్న నమ్మకం ఉంది అని అన్నారు. చిత్ర నిర్మాత వంకా యలపాటి మురళీకృష్ణ మాట్లాడుతూ, ఈ నెల 11న థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. అన్ని ఎమోషన్స్ ఉన్న చక్కటి చిత్రమిదిఅన్నారు. చిత్ర దర్శకుడు ఎం.పూర్ణానంద్ మాట్లాడుతూ, ఫ్యామిలీ ప్యాక్ చిత్రమిది. అందరినీ ఆహ్లాదపరిచే కామెడీ, ఉంది. సోసియో ఫాంటసీగా దీనిని మలిచాం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఓ;కల్యాణ్, నటుడు జెమినీ సురేష్, గీత రచయిత రాంబాబు గోషాల తదితరులు.



# 'ది 100' ప్రీరిలీజ్

ఆర్కే సాగర్ కమ్ బ్యాక్ ఫిల్మ్ ది 100. ఈ హై ఆక్టేన్ క్రైమ్ థ్రిల్లర్‌ను రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహించారు. కెఆర్ఐఎ ఫిల్మ్ కార్ప్, ధమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్లపై రమేష్ కరుటూరి, వెంకి పుషడపు సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా టీజర్, ట్రైలర్ పాటలు, హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఈ చిత్రం జూలై 11న థియేటర్స్‌లోకి రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. తెలంగాణ మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైన ఈ




ప్రీరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మినిస్టర్ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మంచి మెసేజ్‌తో ఈ సినిమాని నిర్మించిన నిర్మాతలకు ధన్యవాదాలు. రైట్ టైంలో రైట్ సినిమా ఇది. సినిమా ట్రైలర్ చూస్తున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనే సినిమా ఫస్ట్ డే చూడాలని నిర్ణయించుకున్నాను. సైబర్ క్రైమ్ నేపథ్యంలో వున్న ఈ సినిమా సమాజానికి చాలా ముఖ్యం.ఈ సినిమాని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా చూసి మెచ్చుకున్నారంటే కచ్చితంగా ఈ సినిమా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది. అందరికీ ఆల్ ది బెస్ట్. సాగర్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ ప్రీరిలీజ్ ఫంక్షన్ ఫ్యామిలీ ఫంక్షన్ లా అనిపిస్తుంది. అంజనమ్మ నా సినిమా టీజర్‌ని రిలీజ్ చేశారు. వారికి ధన్యవాదాలు. మాజీ ఉపరాష్ట్రపతి వర్యులు వెంకయ్య నాయుడు సినిమా చూసి మమ్మల్ని ఆశీర్వదించారు. వారికి ధన్యవాదా లు సజ్జనార్, నాగబాబు అందరు కూడా బ్లెస్సింగ్స్ ఇచ్చారు. మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇది. పవన్ కళ్యాణ్ ట్రైలర్‌ని లాంచ్ చేస్తే అందరికీ రీచ్ అవుతుందని ఆయన్ని వెళ్లి అడిగాను. ఆయన మా ట్రైలర్‌ని లాంచ్ చేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఆయనకి ధన్యవాదాలు. ఐటి మినిస్టర్ శ్రీధర్ అన్నతో నాకు చాలా మంచి బాండ్ ఉంది. ఆయన సినిమా చూసి నాకు బ్లెస్సింగ్స్ ఇచ్చారు. అది ఎప్పటికీ మర్చిపోలేను. మంత్రి కోమటిరెడ్డికి థాంక్యూ. మిశా మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ఇది రెగ్యులర్ సినిమా కాదు. అద్భుతమైన సోషల్ మెసేజ్ ఉన్న సినిమా. తప్పకుండా చూడాల్సిన సినిమా. సాగర్ గారితో పని చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్. ఈ సినిమాల్లో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ధన్య బాలకృష్ణ మాట్లాడుతూ, అందరికి నమస్కారం. ఈ సినిమాలో నేను చేసిన క్యారెక్టర్ ఇప్పటి వరకు ఎప్పుడూ చేయలేదు. అంత కొత్తగా ఉంటుంది. సొసైటీ మీద ఉన్న ప్రేమతో చేసిన సినిమా ఇది. సినిమా చూసిన తర్వాత అది మీకు అర్థం అవుతుంది. ఈసినిమాలో ఉన్న మెసేజ్ అందరి గుండెల్లోకి వెళుతుంది. ఈ కథ చెప్పడం చాలా ఇంపార్టెంట్. ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉంది.

# 'ఎలీ ఇండియా' మేగజైన్ కవర్ పేజీపై నభా నటేష్

ప్రముఖ మేగజైన్ ఎలీ ఇండియా తన జూలై ఎడిషన్ కవర్ పేజీపై బ్యూటిఫుల్ టాలెంటెడ్ హీరోయిన్ నభా నటేష్‌ను పబ్లిష్ చేసింది. తన పర్ ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో సౌత్ ఇండియన్ సినిమాలో నభా తనదైన ప్రత్యేకతను సంపాదించుకుందని ఎలీ ఇండియా మేగజైన్ కవర్ పేజీ స్టోరీలో పేర్కొంది. ఎలీ ఇండియా మేగజైన్ కవర్ పేజీపై పబ్లిష్ కావడం నభా నటేష్‌కు దక్కిన మరో గౌరవంగా భావించవచ్చు. ఇటీవలే నభా స్టైల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్‌గా ఔట్ లుక్ అవార్డ్ గెల్చుకోవడం విశేషం. నభా లేటేస్ట్‌గా తెలుగులో బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా మూవీస్ చేస్తోంది. నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభు మూవీలో నభా నటేష్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో ఉంది. అలాగే నాగబంధం అనే పాన్ ఇండియా మూవీలోనూ నటిస్తోంది. ఈ రెండు చిత్రాలతో నభా నటేష్ మరోసారి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. మరికొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్స్ ఆమె ఖాతాలో ఉన్నాయి



# తల్లి పాత్రలో మెప్పించిన ఐశ్వర్య రాజేష్

తెలుగమ్మాయి అయినప్పటికీ కోలీవుడ్ లో ఎక్కువ సినిమాలు చేసి అక్కడ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు ఐశ్వర్య రాజేష్. తెలుగమ్మాయి అయినప్పటికీ కోలీవుడ్‌లో ఎక్కువ సినిమాలు చేసి అక్కడ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు ఐశ్వర్య రాజేష్. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో తెలుగుఆడియన్స్ గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఐశ్వర్య ఆ సినిమాలో వెంకటేష్‌కు భార్యగా, నలుగురు పిల్లల తల్లిగా నటించి మెప్పించారు. తాజాగా అమెరికాలో జరుగుతున్న తానా మహాసభలకు ఐశ్వర్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ సినిమాలోని తన పాత్ర గురించి ఐశ్వర్య మాట్లాడారు. సినీ ఇండస్ట్రీలో ఉన్న స్టీరియోటైప్ క్యారెక్టర్ లను చేయడానికి తాను మొహమాటపడనని, కెరీర్లో తన క్యారెక్టర్ సెలక్షన్ గురించి, తాను ఎలాంటి పాత్రలను చేయాలనుకుంటున్నారో ఆమె ఈ సందర్భంగా మాట్లాడారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో ఐశ్వర్య నలుగురు పిల్లల తల్లిగా నటించిన సంగతి తెలిసిందే. ఇంటికెళ్లి ఏడాదిన్నరవుతుంది ఐశ్వర్య వయసేమీ మరీ ఎక్కువ కాదు. ఈ ఏజ్ లో నలుగురు పిల్లల తల్లిగా నటిస్తే తర్వాత ఆఫర్లకు ఇబ్బందవుతేదేమోనని చాలా మంది ఇలాంటి పాత్రలు చేయడానికి అంతగా ఆసక్తి చూపించరు. కానీ ఐశ్వర్య మాత్రం ఆ పాత్రను ఒప్పుకోవడమే కాకుండా ఆ పాత్రలో ఒదిగిపోయి సినిమా సక్సెస్‌లో కీలక పాత్ర పోషించారు. యాక్టర్లకు వయసు పరిమితి ఉండదని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. మంచి నటిగా రాణించాలంటే ఎలాంటి క్యారెక్టర్‌నైనా చేయాల్సిందేనని, ఇలాంటి క్యారెక్టర్లు చేయడానికి వయసు అడ్డం కాదని, తాను చాలా సినిమాల్లో తల్లిగా నటించానని ఐశ్వర్య పేర్కొన్నారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో నలుగురు పిల్లలకు తల్లిగా నటించిన తాను, ఒకవేళ ఆ సినిమాకు పార్ట్2 ఉంటే తనకు ఆరుగురు పిల్లలుంటారని డైరెక్టర్ అనిల్ తనతో చెప్పారని తానా సభల్లో ఐశ్వర్య వెల్లడించారు. ఐశ్వర్య మాట్లాడిన మాటలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# 'సమంత' స్టైలిష్ లుక్

స్టైలిష్ లుక్స్‌లో ఎప్పుడూ టాప్‌లో ఉండే సమంత తన లేటెస్ట్ ఫోటోషూట్‌తో మరోసారి సోషల్ మీడియాలో ట్రెండ్ సెట్ చేసింది. రెడ్ శారీ, హెవీ డిజైన్ ఉన్న బ్లౌజ్‌తో యాక్టివ్‌గా స్ట్రీట్‌లో వాక్ చేసిన ఫోటోలు చూసిన నెటిజన్లు, సామ్ ఇన్ ఫైర్ మోడ్ అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. డెట్రాయిట్ వీధుల్లో ప్రాజెక్టు షూటింగ్ సమయంలో తీసిన ఈ స్టన్నింగ్ లుక్ ఆమె న్యూయేజ్ ఫ్యాషన్‌కు బ్రాండ్ అంబాసడర్ అని మరోసారి రివీల్ చేసింది. ఈ లుక్‌లో సమంత ధరించిన రెడ్ చీరకు పర్ఫెక్ట్‌గా మ్యాచ్ అయిన బ్లౌజ్ డిజైన్, అలాగే హైరస్టైల్, మేకప్ అన్నీ మినిమల్‌గా ఉండటమే కాకుండా క్లాసీనెస్‌తో స్టైల్ బ్లెండ్ అయినట్టుగా కనిపించింది. నడకలోని ఆ కాన్ఫిడెన్స్, ఫేస్‌లో ఆ కళ ఆమె అందాన్ని మరో లెవెల్‌కు తీసుకువెళ్లాయి లక్షల్లో లైక్స్, వేలల్లో కామెంట్స్ రావడంతో ఆమె ఫాలోయింగ్ ఏ రేంజ్‌లో ఉందో చెప్తుంది. ఇక సమంత కెరీర్‌పరంగా ప్రస్తుతం బిజీగాఉంది. ప్రస్తుతం రక్తబ్రహ్మాండ అనే ప్రాజెక్టుతో పాటు ఓ షో హోస్ట్ చేయబోతున్నట్లు టాక్. ఇటీవలే హెల్త్ ఇష్యూస్ నుంచి రికవరీ అయి మళ్లీ ఫిట్‌గా రీ ఎంట్రీ ఇచ్చిన సమంత, ఇప్పుడు రెగ్యులర్‌గా వర్కౌట్, పిలేట్స్, స్పిరిచువల్ ట్రావెల్స్‌తో మెంటల్‌గా స్ట్రాంగ్‌గా ముందుకు సాగుతోంది. ఆమె లైఫ్ స్టైల్ యూత్‌కు పెద్ద ఇన్‌స్పిరేషన్. పర్సనల్, ప్రొఫెషనల్ లైఫ్‌లో ఎప్పుడూ ఓపెన్‌గా ఉంటూ, కొత్తగా ఏదైనా ట్రై చేయడంలో ముందుండే సమంత, ఇప్పుడు మళ్లీ తన ఫోటోషూట్‌లు, హెల్త్ అప్‌డేట్స్‌తో సోషల్ మీడియాలో జోరుగా కొనసాగుతోంది. ప్రత్యేకించి ఈ రెడ్ చీర లుక్ ఆమెను మళ్లీ ట్రెండింగ్‌లోకి తీసుకొచ్చింది.






# 'ఓ భామ అయ్యో రామ'లో అలరిస్తున్న సత్యభామ

కథా నాయకుడు సుహాస్ తాజాగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఓ భామ అయ్యో రామ. మలయాళంలో జో అనే చిత్రంతో అందరి హృదయాలను దోచుకున్న నటి మాళవిక మనోజ్ (జో ఫేమ్) ఈ చిత్రంతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతోంది. రామ్ గోధల దర్శకుడు. వీ ఆర్ట్స్ పతాకంపై హరీష్ నల్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జూలై 11న చిత్రం ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కథానాయిక మాళవిక మనోజ్ సోమవారం పాత్రికేయులతో ముచ్చటించారు. **ఓ భామ అయ్యో రామ సినిమాలో అవకాశం ఎలా వచ్చింది?** నేను తమిళంలో నటించిన చిత్రం జోలో నా అభినయం చూసి దర్శకుడు రామ్ ఓ భామ అయ్యో రామ చిత్రంలో హీరోయిన్‌గా సెలక్ట్ చేసుకున్నాడు. కథ వినగానే నాకు ఎంతో నచ్చింది. **స్టోరీలో మీకు నచ్చిన అంశాలేమిటి?** అది సింగిల్‌లైన్‌లో చెప్పలేను. చాలా డిఫరెంట్‌గా అనిపించింది. గతంలో నేను చేసిన సినిమాల్లో విలేజ్ సింపుల్ గర్ల్‌గా చేశాను. ఈసినిమలో నా పాత్ర ఎంతో మోడ్రరన్‌గా, హైపర్‌గా, అటిట్యూడ్‌తో ఉంటుంది. ప్రతి నటికి కావాలసిన వైవిధ్యమైన పాత్ర లభించింది. ఈ చిత్రంలో సత్యభామ అనే పాత్రలో కనిపించాను. **ఈ పాత్ర కోసం ఏమైనా హోమ్ వర్క్ చేశారా?** ఈ సినిమా కోసం ఎలాంటి వర్క్ షాప్, హోంవర్క్ చేయలేదు. నా రియల్‌లైఫ్‌కు ఎలాంటి కంపారిజిన్ లేని పాత్ర సత్యభామ పాత్ర. నాకు తెలుగు రాకపోయినా.. దాని భావం అర్థం చేసుకుని నటించాను. **తెలుగులో నటించడం ఎలా అనిపించింది?** చాలా హ్యాపీగా అనిపించింది. తెలుగు టెక్నిషియన్స్, ఆర్టిస్ట్‌ల్లో ఎంతో ప్రొఫెజనలిజం వుంది. ఎంతో కంపర్టబుల్‌గా నటించాను. లాంగ్వేజ్ తప్ప నాకు తెలుగులో ఎలాంటి ప్రాబ్లమ్ అనిపించలేదు. అన్ని లాంగ్వేజ్‌ల మాదిరిగా నాకు ఇక్కడ ఎక్కడ కంఫర్టబుల్‌గా అనిపించింది. **ఈ చిత్రంలో ఛాలెంజింగ్ అనిపించిన సన్నివేశం ఏమైనా?** ఈ సినిమాలో కోసం నాకు స్విమింగ్ రాకపోయినా.. ఓ సన్నివేశంలో షూటింగ్ వాయిదా పడటం ఇష్టం లేక నేను భయపడుతూనే స్విమింగ్ చేశాను. నాకు ఎంతో భయమేసిన సినిమా కోసం చేశాను. **తెలుగు నేర్చుకున్నారా?** ఈ సినిమా చిత్రీకరణ సమయంలో తెలుగు నేర్చుకునే ప్రయత్నం చేస్తున్నాను. తెలుగు అర్థం అవుతుంది.. తమిళం నుంచి తెలుగులోకి డబ్ అయినా సినిమాలు చూస్తుంటాను. ఇటీవల తెలుగు హిట్3 సినిమా చూశాను.



# సెల్ఫీ స్టైల్‌తో జ్యోతి పూర్వాజ

ఇన్‌స్టాగ్రామ్‌లో మరోసారి ట్రెండింగ్‌లోకి వచ్చిన నటి జ్యోతి పూర్వాజ్ తాజా ఫోటో షేర్ చేసి నెట్టింట గ్లామర్ హీట్ పెంచింది. రెడ్ కలర్ టాప్‌లో మెరిసి పోయిన ఆమె స్టైలిష్ లుక్‌కు సెల్ఫీ మిర్రర్ పోజ్‌తో ప్రత్యేకతను జతచేసింది. ఆమె వేసిన క్రీమ్ కలర్ ట్రౌజర్‌కు కలిపిన ఫ్యాషన్ సెన్స్ కూడా అభిమానులను ఆకట్టుకుంది. ఈ ఫోటోలో ఆమె కళ్లలో కనిపించిన కాన్ఫిడెన్స్, చిరునవ్వు, హేర్ స్టైలింగ్ అన్నీ కలసి ఓ స్టన్నింగ్ ఇంప్రెషన్ ఇచ్చాయి. ఇంటికెళ్లి ఏడాదిన్నరవు తుంది జ్యోతి పూర్వాజ్ చాలా కాలంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తన ప్రత్యేక శైలిని చూపిస్తోంది. మోడలింగ్‌లో తక్కువ కాలంలోనే గుర్తింపు సంపాదించిన ఆమె, సినిమాల్లోనూ చిన్న చిన్న పాత్రలతో కెరీర్‌ను నెమ్మదిగా నిర్మించుకుంటోంది. టీవీ షోలు, యూట్యూబ్ ఇంటర్వ్యూల ద్వారా జనానికి మరింత చేరువైంది. గతంలో ఆమె కొన్ని చిత్రాల్లోనూ నటించి తన నటనా ప్రతిభను ప్రూవ్ చేసుకుంది. ఇప్పుడు ఆమె పూర్తి స్థాయిలో వెబ్ సిరీస్‌లు, ఓటీటీ ప్రాజెక్టులపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. గ్లామర్‌తో పాటు, స్మార్ట్‌నెస్ కలిపిన నటిగా ఆమెను ప్రేక్షకులు గుర్తించడంతో అవకాశాలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఆమెకు ఉన్న ఫాలోయింగ్ ఆమె క్రేజ్‌ను చూపిస్తుంది. ఒక్కో ఫోటోపోస్ట్‌కు వేలల్లో లైక్స్ రావడం, కామెంట్స్‌తో నిండిపోవడం చూస్తుంటే ఆమెకు ఫ్యాన్ బేస్ ఎంత బలంగా ఉందో తెలుస్తోంది.



# 'పూరిసేతుపతి' రెగ్యులర్ షూటింగ్

డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ యాక్టర్ విజయ్ సేతుపతి తొలిసారిగా కలిసి చేస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్‌ఇండియా మూవీ పూరిసేతుపతి. ఈ ప్రాజెక్ట్‌ను జెబి మోషన్ పిక్చర్స్ జెబి నారాయణ్ రావు కొండ్రోల్లా కొలాబరేషన్ లో పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు. చార్మీ కౌర్ సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో టాలీవుడ్ లక్కీ చార్మ్ సంయుక్త కథానాయికగా నటిస్తోంది. ఇటీవలే లాంచ్ అయిన ఈ సినిమా హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించింది. ప్రస్తుతం విజయ్ సేతుపతి, సంయుక్త, ఇతర తారాగణం సభ్యులు పాల్గొనే కీలక సన్నివేశాలను భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎలాంటి బ్రేక్స్ లేకుండా షూటింగ్ శరవేగంగా కొనసాగుతుంది. దర్శకుడు పూరి జగన్నాథ్ సినిమా ప్రతి అంశంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. టబు, విజయ్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ట్రూ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌గా పూరి సేతుపతి దేశవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ ఐదు భాషలలో విడుదల కానుంది.

తారాగణం: విజయ్ సేతుపతి, సంయుక్త, టబు, విజయ్ కుమార్

సాంకేతిక సిబ్బంది:
రచన, దర్శకత్వం: పూరి జగన్నాథ్
నిర్మాతలు: పూరి జగన్నాథ్, జెబి నారాయణరావు కొండ్రోళ్ల, ప్రెజెంట్స్: ఛార్మీ కౌర్, బ్యానర్: పూరి కనెక్ట్స్, జెబి మోషన్ పిక్చర్స్, సీఈఓ: విషు రెడ్డి
పీఆర్వో: వంశీ శేఖర్
మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా.




# గోరింటాకు సులువుగా..



ఆషాఢం వచ్చింది. ఈ మాసమనగానే మనకి గుర్తొచ్చేది గోరింటాకే! ఎర్రగా పండిన చేతులతో అమ్మాయిలు చేసే సందడే వేరు కానీ అందరికీ గోరింటాకు రుబ్బి, పెట్టుకునే ఓపిక, అవకాశం ఉండదు కదా! అలాంటి వారికి సాయపడేలా బోలెడు మార్గాలున్నాయి.

**సులువుగా ఇంజెక్షన్ ...**

కోన్‌తో అందమైన డిజైన్లు వేయడం అందరికీ అంత సులువేమీ కాదు. అలాంటి వారికి ఈ ఇంజెక్షన్లు మేలు. ఒకరకంగా లిక్విడ్ హెన్నా అని చెప్పొచ్చు. కొద్దికొద్దిగా ఒత్తుతూ చేతులపై డిజైన్లు వేయడమే. చిన్న చిన్న మెలికలు, చుక్కలతో మాయ చేసేయొచ్చు అనుకునేవాళ్లు ఈటిని ఎంచుకుంటే సరి. లేదంటే ట్యూబ్స్ సాయమైన తీసుకోవచ్చు. ఇవైతే వంగిపోతాయి. కోన్ పట్టుకోవడానికి



వీలుగా లేదు అన్న బెంగా ఉండదు.

ఇప్పుడు వేడుకేదైనా అరచేతిలో మెసేజ్ ఉండాల్సిందే! పెళ్లి, సీమంతం, పుట్టినరోజు ఏదైనా తగ్గట్టుగా బొమ్మలతో అరచేతిలో అందంగా తీర్చిదిద్దించుకుంటున్నారు. పెట్టేవాళ్లు నిపుణులైతే సరే. లేదంటే ప్రయత్నం వృథా, మనకీ బాధ.




ఇదంతా ఎందుకొచ్చింది అనిపిస్తే 'ఫిగర్' లేదా డిజైన్ స్టెన్సిల్స్‌ని తెచ్చుకుంటే సరి. ఆక్రిలిక్‌వి వస్తున్నాయి. వాటిని ఇంక్‌ప్యాడ్‌కి అద్ది, చేతిమీద గుర్తు వేయడమే. దాని ఆధారంగా కోన్‌తో గీసుకుంటూ వస్తే సరి. కోరుకున్న డిజైన్ చేతులమీద చక్కగా ఇమిడి పోతుంది. గోరింట పెట్టుకుని కడిగేసిన క్షణం నుంచి చేతులు పదే పదే చూసుకుని మురవని అమ్మాయుండదు. ఆ రంగు మీద అంత మనసు పారేసుకుంటాం. ఎంత జాగ్రత్తనైనా పెట్టుకోనీ ఎంతసేపైనా ఉంచుకోని రంగు వెరవక మానదు



కదా! కోన్‌తో పెట్టినవైతే మరీ త్వరగా రంగు పోతుంది. ఎంత వాస్తవం తెలిసినా ఆ సమయంలో మనసుకాస్త బాధపడుతుంది. ఇంకొన్ని రోజులు ఉంటే బాగుణ్ణు అని అనిపిస్తుంది. ఇలాంటప్పుడే మెహందీ ఆయిల్‌సాయం కావాలి. దీన్ని మెహందీలో కలిపి పెట్టుకోవచ్చు. లేదా పెట్టుకున్నాక అద్దినా సరే. గోరింట మంచి రంగు వచ్చేలా చూడటమే కాదు, ఎక్కువ రోజులు నిలిచి ఉండేలానూ చేస్తుందట. □

# మంచుకొండల్లో ఒంటరిగా 24 రోజులు ..




కొంతమంది సోలోగా విహారయాత్రలు చేస్తూ.. అందుకు సంబంధించిన ఫొటోలు. వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడం మనం చూస్తూనే ఉంటాం. ఈ కొందరు పలు సాహసాలు కూడా చేస్తారు. అయితే ఇలా సాహసాలు చేయడం వల్ల కలిగే సంతోషం సంగతి అటుంచితే.. కొన్ని సందర్భాల్లో అనుకోని. ప్రమాదాలు ఎదురుకావచ్చు. జార్జియాకు చెందిన టిఫనీ స్లేటన్(28)కి కూడా ఇటీవల ఇలాంటి అనుభవమే ఎదురైంది.

కాలిఫోర్నియా సియెర్రా నెవడా పర్వతాలను సందర్శించడానికి వెళ్లిన ఆమె... ప్రయాణం మొదట్లోనే అనుకోకుండా కొండపై నుంచి జారి లోయలో పడింది. అప్పటినుంచి 24 రోజుల పాటు తీవ్ర ప్రతికూల వాతావరణంలో మగ్గిన ఆమె.. ఎట్టకేలకు బతికి బయటపడింది.

అదెలాగో తెలుసుకుందాం..

స్లేటన్ బహుముఖ ప్రజ్ఞాశాలి ఆమె ఆచారి క్రీడాకారిణిగా రాణించింది. డయాలసిస్ టెక్నిషియన్‌గా వైద్య పరిజ్ఞానం కూడా ఆమెకు ఉంది. అంతేకాదు.. వ్యవసాయ విద్యకు సంబంధించి కోర్సు కూడా పూర్తిచేసింది.

**మూడు రోజులు అనుకుని...**

కాలిఫోర్నియాలోని సియెర్రా నెవడా పర్వతాలపై షేవర్, హంటింగ్టన్ అనే రెండు సరస్సులున్నాయి. సముద్ర మట్టానికి 3500 అడుగుల ఎత్తుపై ఉన్న ఈ సరస్సుల చుట్టూ అందమైన ప్రదేశాలున్నాయి. వీటిని మూడు రోజుల్లో సందర్శించేలా స్లేటన్ ప్లాన్ వేసుకుంది. ఈ క్రమంలోనే ఇటీవలే ఎలక్ట్రిక్ బైక్, రెండు స్లీపింగ్ బ్యాగ్‌లు, టెంట్‌తో పాటు కొన్ని రకాల స్నాక్స్ తీసుకుని బయలుచేరింది. ప్రయాణం మొదట్లోనే అనుకోని ఎదురవడంతో స్లేటన్ కొండ పైనుంచి జారి లోయలో పడింది. దాంతో రెండు గంటల పాటు స్పృహ కోల్పోయింది. ఆ తర్వాత తేరుకున్న ఆమె తన దగ్గర ఉన్న ఓ పరికరంతో మోకాలి గాయానికి అత్యవసర చికిత్స చేసుకుంది. ఆపై ప్రధాన రహదారి చేరుకోవడానికి ప్రయత్నించింది. కాని, అప్పటికే మంచు తుఫాన్ ప్రభావం వల్ల చుట్టుపక్కల మంచు పేరుకుపోవడంతో ఏం చేయాలో ఆమెకు తోచలేదు.

**అవే ఆహారం...** స్టేటన్ తన దగ్గర ఉన్న ఫోన్‌లో ఎమర్జెన్సీ నంబర్(911)కు ఐదుసార్లు ప్రయత్నించింది. అయితే. సిగ్నల్స్ అందకపోవడంతో ఆమె ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ముందుకు సాగే క్రమంలో ఒకచోట అదృష్టవశాత్తే జీపిఎస్ పనిచేయడంతో జనావాసాలు ఉన్న ప్రాంతాలను అన్వేషించింది. అప్పుడు ఆమెకు 28 కిలోమీటర్ల దూరంలో ఒక లోకేషన్ కనిపించింది. అయితే మంచు తుఫాన్ కావడం వల్ల ఆమె వెంట తెచుకున్న సామగ్రిని మొత్తం కోల్పోయింది. చివరగా ఆమె దగ్గర ఒక లైటర్, చాకుతో పాటుకొన్ని స్నాక్స్ మాత్రమే మిగిలాయి. మొదట ఐదు రోజుల్లోనే ఆమె ఆదిగాహన ఉండడంతో..తానున్న ప్రదేశంలో లభించిన ఉల్లి జాతికి చెందిన 'వైల్డ్ లీక్స్' అనే చెట్ల ఆకులను ఆహారంగా తీసుకోవడం మొదలుపెట్టింది. ఇక తన దగ్గరున్న లైటర్ సహాయంతో మంచుని వేడి చేసుకొని నీళ్లుగా మార్చుకొని తాగింది ఇక 'మాంజానిట' మొక్క నుంచి వచ్చే పండ్లు పైన్ నీడిల్స్ మొక్కలోని ఆకులతో ప్రతిరోజూ టీ తయారు చేసుకొని తాగేదట!

**రిసార్ట్ యజమాని రాకతో..**

స్లేటన్ ఆ అపరిచిత ప్రదేశం నుంచి బయటపడడానికి క్రైసర్ పాస్ అనే రహదారి వెంబడి ప్రయాణించాల్సి వచ్చింది. ఇది అత్యంత ప్రమాదకరమైన వాటిలో ఒకటి. 9వేల అడుగుల ఎత్తు 12 అడుగుల వెడల్పుతో మంచు పేరుకున్న ఈ రహదారిని అతికష్టం మీద దాటిన ఆమె.. వెర్మిలియన్ వ్యాలీ అనే రిసార్ట్‌కి చేరుకుంది. ఈ ప్రాంతంలో తరచుగా వచ్చే మంచు తుపాన్ల కారణంగా ఈ రిసార్ట్‌ను చలికాలం మూసేస్తారట. అయితే ఆ రిసార్ట్ యజమాని.. ఎవరికైనా షెల్టర్ అవసరమైనప్పుడు ఉపయోగించుకునేందుకు వీలుగా క్యాబిన్ డోర్‌ను ఓపెన్ చేసి ఉంచుతారట. ఆదృష్టవశాత్తూ అక్కడ చలికాలం పూర్తవడంతో రిసార్ట్‌ని తిరిగి ఓపెన్ చేయడానికి ఆ యజమాని అక్కడికి చేరుకోవడంతో అటువైపుగా వస్తున్న స్లేటన్‌ని గమనించాడు. అప్పటికే స్టేటన్ తల్లి దండ్రులు ఆమెపై మిస్సింగ్ కేసు పెట్టారు. దీంతో ఆమె కోసం ఐదు రోజుల పాటు పోలీసులు తీవ్రంగా వెతికారు కూడా ఈ విషయాలపై అవగాహన ఉన్న యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను ఆసుపత్రికి తరలించారు. గడ్డకట్టుకుపోయే చలి, మంచు తుపాన్ల మధ్య గడిపినా.. డీహైడ్రేషన్, చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తప్ప ఆమె పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇలా 24 రోజుల పాటు తీవ్ర వాతావరణ పరిస్థితులు ఎదుర్కొని.. 13 మంచు తుపాన్లను తట్టుకొని.. ఇటీవలే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయింది స్లేటన్, తన సాహసల యాత్రకు సంబంధించిన వివరాలను ఇటీవలే మీడియాతో పంచుకోగా ఆమె స్టోరీ బయటి ప్రపంచానికి తెలిసింది. అంతేకాదు.. ఈ 24 రోజుల పాటు సాగిన తన సాహస యాత్ర సినిమా కథకు ఏమాత్రం తీసిపోదని ఆమె చెప్పడం కొసమెరుపు. □

# కస్టర్ పౌడర్



ఇంట్లోనే.. మనందరికీ చాలా ఇష్టమైన వాటిల్లో కస్టర్డ్ ఒకటి. మార్కెట్లో దొరికే కస్టర్డ్ పౌడర్ కస్టర్డ్ చేసుకుంటాం కదా! నిజానికి ఆ పౌడర్ కూడా కొనకుండా ఇంట్లోనే చేసుకోవచ్చు. అందుకు పావు గంట సమయం కూడా పట్టదంటే అతిశయం కాదు. ఏమేం కావాలో, ఎలా చేయాలో చూడండి. కప్పు పంచదార, చెంచా వెనీలా ఎక్స్‌ట్రాక్ట్, అర కప్పు చొప్పున మొక్కజొన్న పిండి, పాలపొడి, పావు చెంచా ఫుడ్ కలర్ అవసరమౌతాయి. మిక్సీ జార్‌లో పంచదార, మొక్కజొన్న పిండి వేసి.. మెత్తగా గ్రైండ్ చేయాలి. ఏ మాత్రం బరకగా ఉండకూడదు కనుక, జల్లెడ పట్టాలి. అందులో వెనీలా ఎక్స్‌ట్రాక్ట్, పాలపొడి, ఫుడ్ కలర్ కలిపి.. తడి లేని పొడి సీసాలో భద్రం చేసుకుంటే.. కావాలనుకున్నప్పుడు కస్టర్డ్ చేసుకోవచ్చు. అందులో మామిడి, అరటి, కర్బూజ, ద్రాక్ష.. ఇలా ఆయాకాలాల్లో దొరికే తాజా పండ్ల ముక్కలు కలపాల్సి ఉంటుంది. పండ్లు అందుబాటులో లేకుంటే డ్రైఫ్రూట్స్ వేయొచ్చు. నాలుగు కప్పుల పాలకు 3 టేబుల్ స్పూన్ల కస్టర్డ్ పౌడర్, పిస్తా, జీడిపప్పు, బాదం, ఖర్జూరాలు ఒక్కోటీ ఐదు చొప్పున, రెండు టేబుల్ స్పూన్ల కిస్‌మిస్ అవసరమౌతాయి. □

# అందమైన మేని కోసం..



శరీరం చురుకుగా ఉండాలన్నా.. అందమైన మేని సొంతం అవ్వాలన్నా రోజూ తగినన్ని నీటిని తీసుకోవడం తప్పని సరి. ఒకసారి పనిలో పడితే చాలు. తలమున్కలైపోతారు మనలో చాలామంది. ఇక నీళ్లేం గుర్తుంటాయి. మీరూ ఇదే బాపతా? అయితే ఇలా ప్రయత్నించి చూడండి.

- ఇంట్లో ఉన్నా, ఎక్కడికైనా వెళుతున్నా.. వెంట వాటర్ బాటిల్ తప్పనిసరి అన్న నియమం పెట్టుకోండి. అది కళ్ల ముందు ఉంటే అదే మీకు నీళ్ల తాగాలన్న విషయాన్ని గుర్తుచేస్తుంది. దాన్నీ గమనించుకోవట్లేదు అనిపిస్తోందా? అయితే ఎన్నిగంటలకు ఎన్ని నీళ్ల తాగాలో సూచించే బాటిళ్ల వస్తున్నాయి. వాటిని కొనుక్కోండి ఫిట్‌నెస్ యాప్‌ని వేసుకుంటే సరి. ఓ రిమైండర్ పెట్టుకుంటే అదే గుర్తుచేస్తూ ఉంటుంది.
- అస్తమానూ నీళ్లే తాగాలంటే బోర్ కొట్టడం కాయం. దానిలో నారింజ, నిమ్మ, కీర, ఖర్జూర, ఎండుద్రాక్ష వంటివాటిల్లో నచ్చినవి వేసి ఉంచండి. కావాల్సిన పోషకాలు అందడమే కాదు.. తాగాలనే ఉత్సాహం కలుగుతుంది. మజ్జిగ, పాలు, జ్యూస్, కొబ్బరినీళ్లు.. ఇలా ప్రయత్నించినా మంచిదే.
- పుచ్చకాయ, కీర బత్తాయి, నారింజ, వంటి నీరు సమృద్ధిగా ఉండే పండ్లను తీసుకోండి ఇవీ శరీరానికి కావాల్సిన నీళ్లని భర్తి చేస్తాయి. □

# బ్రేకప్ చెబుతున్నారా?



చిన్నప్పుడి నుంచి ఇద్దరు స్నేహితులు స్నేహం ప్రేమగా మారడంతో పెళ్లితో ఒకటవ్వాలను కుదారు. అయితే అప్పటి వరకు ఏ విషయాన్నైనా ఒకేలా ఆలోచించే వాళ్లిద్దరూ వివాహం చేసుకోవాల నేటప్పుటికి భిన్న ధ్రువాలుగా మారారు. విభేదాలు పెరగడంతో బ్రేకప్ చెప్పు కొన్నారు. అలాగే ప్రేమ వివాహంతో ఒక్కటైనా.. జంట ఏడాదిలోపే దూరమయ్యారు. బ్రేకప్ చెప్పడం లేదా విడిపోవడంపై నిపుణులేం చెబుతున్నారంటే..

ప్రేమబంధంలో ఉన్నప్పుడు అభిప్రాయభేదాలు లేనట్లు కనిపిస్తుంది. ఎదుటివారూ చెప్పే ప్రతిదాన్నీ ఆమెదిస్తారు. తీరా అది వైవాహిక బంధంగా మారేటప్పుటికి అప్పటివరకు స్నేహితులుగా ఉన్నవారిద్దరి ఆలోచనాతీరుపై పరిస్థితుల ప్రభావం పడుతుంది. స్నేహంలో ఇద్దరే ఉంటారు. బాధ్యతలుండవు. అయితే పెళ్లి అనేసరికి ఇరు కుటుంబాలు, వేరు వేరు సంప్రదాయాలతో ముడిపడి ఉంటుంది. కొత్త బాధ్యతలొస్తాయి. తల్లి దండ్రులూ, తోబుట్టవుల అభిప్రాయాలనూ ఆ ఇద్దరూ గౌరవించాల్సి ఉంటుంది. పెళ్లికాకుండానే ఇవన్నీ వారి ఆలోచనాతీరును మారుస్తాయి. స్నేహంగా ఉన్నప్పుడు అవతలివ్యక్తి తీరు ఒకలా కనిపించడం ఎదుటి వారిని ఇబ్బంది పెడుతుంది. ఇప్పుడే ఇలా ఉంటే పెళ్లైన తర్వాత మరెన్ని సమస్యలొస్తాయో అనే భయం ఆ ఇద్దరినీ ఏడుడుగులు వేయ కుండానే విడిపోయేలా చేస్తుంది.

**పెళ్లైతే...** వైవాహికబంధంలోకి అడుగుపెట్టే టప్పుడు నూతన దంపతులు భవిష్యత్తును రంగులప్రపంచంగా ఊహించు కుంటారు. ఎలాంటి సమస్య వచ్చిన కలిపి పరిష్కరించు కుందామని కలలు కంటారు. అలాగే అనుకోని సమస్య ఎదురైనప్పుడు దంపతుల్దిరూ కలిసి సమన్వయం చేస్తా. అయితే ఆ సమస్యలెక్కువైనప్పుడు మాత్రం బరువు మెయాలేకపోతారు. తాము ఊహించిన జీవితం అది కాదనే నిరాశకు లోనవుతారు. అక్కడితో ఆ బంధం నుంచి బయటపడాలనుకుంటారు. అలాకాకుండా ఇరువులో ఏ ఒక్కరైనా సరైన రీతిలో ఆలోచించి సమన్వయం చేయడానికి ప్రయత్నిస్తే వివాహబంధాన్ని కలకాలం నిలుపుకోవచ్చు అంటున్నారు నిపుణులు. పెళ్లిముందు ఉన్న స్నేహాన్ని కొనసాగిస్తూ ఒకరిని ఒకరు గౌరవించుకుంటే చాలు. ఏ మసస్య అయినా ఆశాశ్వతమే అవుతుంది. సహనాన్ని పాటిస్తే, ఊహించినట్లుగా జీవితాన్ని తీర్చి దిద్దుకోవచ్చు. బ్రేకప్‌కు అవకాశం లేకుండా చేయొచ్చు. □

# నలుగురిలో మాట్లాడలంటే భయమా?

కొంతమంది నలుగురితో మాట్లాడడానికి భయపడుతుంటారు. ఇలాంటి స్థితిని 'సోషల్ యాంగ్జైటీ డిజార్డర్/సోషల్ ఫోబియా అంటారు. టీనేజ్ వయసు నుంచి ప్రారంభమయ్యే ఈ మానసిక సమస్య కారణంగా.. మన రోజువారీ జీవనశైలి, పనులపై ప్రతికూల ప్రభావం పడుతుంది. తద్వారా వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఎన్నో అవకాశాల్ని మిస్సవుతామంటున్నారు నిపుణులు. అందుకే దీన్ని ఆదిలోనే పరిష్కరించుకుంటే భవిష్యత్తులో సమస్య ఉండదంటున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం..

**అసలెందుకిలా? ...** సోషల్ ఫోబియాకు ఇదీ కచ్చితమైన కారణం అని చెప్పలేమంటున్నారు నిపుణులు. అయితే మన జీవితంలో జరిగే కొన్ని చెడు సంఘటనలు..




ఉదాహరణకు శారీరక, మానసిక వేధింపులు, అత్యాచారానికి గురవడం, ఇంట్లో ఎప్పుడూ గొడవలతో కూడిన వాతావరణం ఉండడం, కొంతమందిలో వంశపార్యంగానూ ఈ పరిస్థితి తలెత్తే అవకాశం ఉంటుందని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. అంతేకాదు.. పిల్లల్ని అతిగా అదుపులో పెట్టడం, అతి సురక్షితంగా పెంచడం వల్ల కూడా వారిలో ఈ తరహా సమస్య వస్తుందట! ఇక దీని తాలూకు లక్షణాలు 13 ఏళ్ల దాటిన తర్వాత నుంచి ఒక్కక్కటిగా మొదలవుతాయంటున్నారు నిపుణులు. వాటినెలా పసిగట్టలంటే..!

- అరచేతులు, అరికాళ్లలో విపరీతమైన చెమటలు పుట్టడం.
- భయంతో వణుకు పుట్టడం, మాటలు తడబడడం
- గుండె కొట్టుకునే వేగం పెరగడం
- ఏదైనా కార్యక్రమంలో పాల్గొనాల్సి వచ్చినప్పుడు.. వారం, పది రోజుల ముందు నుంచే దాని గురించి ఆందోళన చెందడం.
- ఒకవేళ కార్యక్రమంలో పాల్గొన్నా.. వెనకవెనకే ఉండిపోవడం.. ఈ క్రమంలో తమను ఇతరులు గమనిస్తున్నారేమోనన్న భయం వారిని వెంటాడుతుంటుంది.
- భయం, నెర్వస్‌నెస్‌తో, ఇంటర్వ్యూకు హాజరు కాలేకపోవడం, నలుగురిలో తినలేకపోవడం, షాపింగ్‌కి వెళ్లలేకపోవడం, ఆఖరికి పబ్లిక్ టాయిలెట్స్/ విశ్రాంతి గదుల్ని వాడుకోవడానికీ వెనకాడడం.

**ఈ చిట్కాలతో ఫలితం ..** అయితే ఇలాంటి లక్షణాలు గుర్తిస్తే మాత్రం సోషల్ ఫోబియాగా అనుమానించి వెంటనే మానసిక వైద్యుల్ని సంప్రదించడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో వారు చేయించే కొన్ని రకాల తెరపీలు, కౌన్సెలింగ్‌తో పాటు మన జీవనశైలలోనూ పలు మార్పులు చేసుకోవడం ముఖ్యంటున్నారు.

- యాంగ్జైటీని ప్రేరేపించే కెఫిన్ సంబంధిత పదార్థాలకు దూరంగా ఉంది. ఈ క్రమంలో కాఫీ, చాక్లెట్, సోడా.. వంటి వాటిని తీసుకోకూడదు.
- సోషల్ ఫోబియా వల్ల ఒక దశలో నిదరద కరువవుతుందంటున్నారు నిపుణులు. అంతేకాదు ఈ నిద్రలేమి వల్ల సమస్య మరింత తీవ్రమవుతుందంటున్నారు. కాబట్టి టెన్షన్స్ ఏవీ లేకుండా హాయిగా నిద్ర పట్టాలంటే ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు దూరంగా ఉండడం, వ్యాయామాలు చేయడం వంటి చిన్న చిన్న చిట్కాల్ని పాటించాలి.
- ఒత్తిడిగా, భయంగా అనిపించినప్పుడు కాసేపు ధ్యానంపై ధ్యాస పెట్టండి శ్వాస సంబంధిత వ్యాయామాలు చేయండి. తద్వారా ఫలితం ఉంటుంది.
- నలుగురితో కలవడానికి భయపడితే జీవితంలో ఏదీ సాధించలేం. కాబట్టి దీన్ని క్రమంగా అధిగమించే ప్రయత్నం చేయాలి. ఇందుకోసం మన ఫ్రెండ్స్ సర్కిల్‌ని పెంచుకుంటూ పోవాలి. మనసులోని నెగెటివ్ ఆలోచనల్ని పక్కన పెట్టి. మనకు తెలిసిన వారు, బంధువులు ఇరుగుపొరుగు వారు.. ఇలా ఒక్కొక్కరితో కమ్యూనికేషన్‌ని పెంచుకుంటూ పోతే క్రమంగా మార్పు కనిపిస్తుంది. □



# సాయం మరవని స్వామీజీ !

ఆధ్యాత్మికం

తన ఆధ్యాత్మిక ప్రసంగాలతో ప్రపంచ ప్రఖ్యాతి పొందిన తర్వాత.. స్వామి వివేకానంద స్వదేశానికి తిరిగి వచ్చారు. కొన్నాళ్లకు ఆళ్వారుకు చెందిన కొందరు ప్రముఖులు ఆయనను విందుకు ఆహ్వానించారు. కానీ స్వామీజీ ప్రపథమంగా ఓ పేద వృద్ధురాలి ఆహ్వానాన్ని మన్నించారు. వివేకానంద అతి సాధారణమైన వ్యక్తిలా, పాదచారిగా దేశమంతా పర్యటిస్తున్నప్పుడు సమయానికి భోజనం కూడా లభించేది కాదు. ఆయన ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే! అలాంటి సమయంలో ఆ వృద్ధురాలు స్వామీజీ ఆకలిని గుర్తించి ప్రేమగా చపాతీలు తెచ్చి ఇచ్చేది. ఆమె కారుణ్యాన్ని ఆయన మర్చిపోలేదు. ఆళ్వారుకు రాగానే.. గతంలో తాను తిన్న చపాతీలను, వాటిని వడ్డించిన ఆ వృద్ధురాలిని గుర్తుచేసుకున్నారు. ఆ కబురు విన్న వృద్ధురాలి ఆనందానికి అవధుల్లేవు. ఆమె మునుపటిలా ఎంతో భక్తి శ్రద్ధలతో చపాతీలు చేసి వివేకానందకు వడ్డించింది. స్వామీజీ ఆ చపాతీలను తృప్తిగా ఆరగించి సోదర సాధువులతో 'ఈ పెద్దావిడ చూపించే మాతృవాత్సల్యం మరవ లేనిది. ఆమె ప్రేమతో పెట్టే ఆహారం ఎంత పవిత్రమైందో కదా! అన్నారు. అంతేకాదు వివేకానంద సెలవు తీసుకొని వెళ్ల బోతూ.. ఆ ఇంటి యజమానిని దగ్గరకు పిలిచారు. కొంత డబ్బు ఆయన చేతిలో పెట్టి.. ఆ వృద్ధురాలికి గోప్యంగా ఇవ్వమని చెప్పారు. □



# తిన్నాకా ఆకలా?



**'అరె.. ఇందాకే తిన్నా కదా! అయినా ఆకలి అనిపిస్తోందేంటి? అంటూ ఏదో ఒక తినుబండారం కోసం వెతకడం! తీరా తిన్నాక మరీ ఎక్కువగా తినేస్తున్నా, బరువు పెరుగుతున్నా అని బాధపడటం. ఇలా మీకూ జరుగుతోందా? దానికి కారణాలేంటో తెలుసా?**

- మనకు ఎక్కువ మొత్తంలో ప్రొటీన్, తక్కువ కార్బోహైడ్రేట్స్, కొవ్వులు అవసరమవుతాయి ప్రొటీన్.. గ్లూకోన్ వంటి హార్మోను విడుదలకు కారణమవుతుంది. దీంతో కడుపు నిండినట్లుగా అనిపించి, ఆకలి భావనను దరిచేరనీయదు. అదే అది తగినంత పరిమాణంలో శరీరానికి అందకపోతే ఇలాంటి భావన కలుగుతుంది. కాబట్టి, ప్రొటీన్ సరిగా అందుతోందా అన్నది చెక్ చేసుకోండి.
- పీచు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకుంటున్నారా? ఇది నెమ్మదిగా జీర్ణమవుతుంది. దీంతో చాలా సేపు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. అంతేకాదు ఆహారంపైకి మనసు మళ్లకుండానూ చూస్తుంది. శరీరానికి ఇది తగినంత అందకపోయినా ఇలా ఆకలి అనిపిస్తుంది. అందుకే ఫైబర్ అధిక మోతాదులో అందించే ఆహారాన్ని తీసుకోవాలి.
- డైట్ అంటే చాలామందికి తక్కువ మోతాదులో తినడమే! ఆనీ మన శరీరంలో స్ట్రెచ్ రెసెప్టార్స్ ఉంటాయి. ఇవి తీసుకుని పరిమాణం బట్టే కడుపు నిండిందా లేదా అన్న అంచనాకి వస్తాయి. నిండకపోతే మెదడుకి ఆకలి సంకేతాలను పంపిస్తాయి. కాబట్టి , కడుపు నిండా తినండి.. కాకపోతే కెలోరీలు తక్కువ ఉండేలా చూసుకుంటే చాలు. కడుపుపై, మనసూ రెండూ నిండిపోతాయి.
- .మన శరీరంలో ఉండే ప్రధాన హార్మోన్లలో లెప్టిన్ కూడా ఒకటి. ఇది కడుపు నిండిందన్న సంకేతాన్ని మెదడుకు చేరవేస్తుంది. ఇది సరిగా ఉత్పత్తి కాకపోతేనే ఇదిగో ఇలా ఎంత తిన్నా మనసు ఆహారంకేసి లాగేస్తుంది. కాబట్టి, హార్మోనుల్లో అసమతుల్యత ఉండేమో చెక్ చేసుకోవాలి. లేదంటే బరువూ అదుపులో ఉండదు. ఒత్తిడి కూడా అతిగా ఆహారం ముఖ్యంగా స్వీట్లు, జంక్ ఫుడ్‌వైపు మనసు మళ్లేలాచేస్తుంది. కాబట్టి, దీన్నీ చెక్ చేసుకోవాలి.
- సరిగా నిద్రపోతున్నారా? నిద్రలో శరీరం తనని తాను రిపేర్ చేసుకుంటుందని తెలుసుగా? కానీ ఇంటి పనులు, కుటుంబానికి అన్నీ అమర్చాలని మన దాన్నే నిర్లక్ష్యం చేస్తాం. కానీ తగినంత నిద్రలేకపోతే జీవక్రియలన్నీ కుంటుపడతాయి. హార్మోనుల్లో సమస్యలు ఏర్పడి అతిగా ఆకలేస్తుంది. కాబట్టి, రోజులో 7 గంటలు నిద్రకు కేటాయించడం తప్పనిసరి. □

## పోలిగ్రాస్ స్కిల్ అవార్డుకు
# దీపిక నామినేట్



**న్యూఢిల్లీ:** ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్2024-25 సీజన్‌లో ప్రపంచ నంబర్ 1 నెదర్లాండ్స్‌పై ఉత్కంఠభరితమైన సోలో గోల్ చేసినందుకు భారత ఫార్వర్డ్ దీపిక పోలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డుకు నామి నేట్ అయింది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (సీ.బీ) తాజాగా నామినేషన్లను ప్రకటించింది, ఈ నెల 14వ తేదీ ఉదయం 3:29 వరకు ఓటింగ్ తెరిచి ఉంటుంది. విజేతను పూర్తిగా ప్రపంచ అభిమానుల ఓటింగ్ ద్వారా నిర్ణయిస్తారు, తద్వారా ఈ సీజన్‌లో అత్యంత నైపుణ్యం కలిగిన మరియు చిరస్మరణీయమైన క్షణం లేదా లక్ష్యాన్ని గుర్తిస్తారు. ఫిబ్రవరి 2025లో భువనేశ్వర్‌లో జరిగిన లీగ్ లెగ్‌లో దీపిక అద్భుతమైన ప్రదర్శన చేసి అకట్టుకుంది. కళింగ స్టేడియంలో డచ్ జట్టును 2-2తో డ్రాగా ముగించి, ఉత్కంఠభరితమైన షూటౌట్‌లో విజయం సాధించింది. 35వ నిమిషంలో, భారతదేశం రెండు గోల్స్ వెనుకబడి ఉండగా, 21 ఏళ్ల ఫార్వర్డ్ ఎడమ పార్శ్వం గుండా డ్రిబుల్ చేస్తూ, డచ్ డిఫెన్స్‌ను వెంబడించి, బేస్‌లైన్‌ను అనుసరించి డిఫెండర్ స్టిక్ మీదుగా బంతిని ఫ్లిక్ చేసి, గోల్ కీపర్‌ను దాటి స్మాష్ చేస్తూ అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. అలాగే మహిళల విభాగంలో దీపికతో పాటు మరో ఇద్దరు అసాధారణ నామినీలు ఉన్నారు. ఆస్ట్రేలియాపై జరిగిన మ్యాచ్‌లో స్పెయిన్‌కు చెందిన ప్యాట్రిసియా అల్వారెజ్ అద్భుతమైన 3డి నైపుణ్యాలను ప్రదర్శించి తన స్థానాన్ని సంపాదించుకుంది. అల్వారెజ్ అద్భుతమైన బంతి నియంత్రణను ప్రదర్శించింది, పరుగెడుతున్న గోల్ కీపర్‌పై బంతిని గారడీ చేసి, దానిని ప్రశాంతంగా నెట్‌లోకి లాగింది. మరో నామినీ ఆస్ట్రేలియా మహిళా జట్టు, ఇంగ్లాండ్‌పై సొగసైన జట్టు గోల్‌కు గుర్తింపు పొందింది. హాకీరూస్ ప్రత్యర్థి హాఫ్‌లో ఐదు స్పష్టమైన పాస్‌లతో సరళమైన పాసింగ్ సీక్వెన్స్‌ను అమలు చేసి అద్భుతమైన ముగింపులో ముగిసింది.

## కామన్వెల్త్ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో..
# విద్యా పిళ్లైకి స్వర్ణం

**న్యూఢిల్లీ:** ప్రారంభ కామన్వెల్త్ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్యూయిస్ట్ విద్యా పిళ్లై హేబాల్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. మారిషస్‌లోని బాలాక్లావాలో సోమవారం జరిగిన తొలి 6-రెడ్ స్నూకర్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ అయిన పిళ్లై, దక్షిణాఫ్రికాకు చెందిన మెరీనా జాకబ్స్‌ను 5-5తో ఓడించి తన పోటీతత్వాన్ని ప్రదర్శించింది, నిర్ణయాత్మక షూటౌట్‌లో భారత స్టార్ 3-1తో విజయం సాధించింది. హెబాల్, చైనీస్ 8బాల్ అని కూడా పిలుస్తారు, ఇది పూల్ మరియు స్నూకర్ యొక్క అంశాలను మిళితం చేసే ఒక ఆధునిక క్యూ క్రీడ, ఇది చైనీస్‌శైలి టేబుల్‌పై గట్టి పాకెట్స్ మరియు ఖచ్చితత్వం, వ్యూహం మరియు షాట్ మేకింగ్‌ను నొక్కి చెప్పే విభిన్న నియమాలతో ఆడబడుతుంది. ఈ క్రీడలో 47 ఏళ్ల విద్యా అద్భుతమైన ఫామ్‌తో మ్యాచ్‌ను ప్రారంభించి 5-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మిడిల్ ఫ్రేమ్‌లలో జరిగిన రెండు వ్యూహాత్మక తప్పిదాలు దక్షిణాఫ్రికా క్యూయిస్ట్ జాకబ్స్‌పూర్తి ప్రయోజనాన్ని చేకూర్చాయి. జాకబ్స్‌కు అనుకూలంగా ఆట వేగం మారుతున్నప్పటికీ, విద్యా సంయమనంతో ఉండి, తన లోతైన వ్యూహాత్మక జ్ఞానం మరియు అపారమైన మ్యాచ్ అనుభవాన్ని ప్రదర్శించడంతో ఈ షూటౌట్‌లో బలంగా పుంజుకుంది, ఫలితంగా విద్యా 3-1 తేడాతో విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది.

## వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో..
# యుకీ భాంబ్రీ ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో 2025 వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్ నుంచి భారత్ డబుల్ స్పెషలిస్ట్ యుకీ భాంబ్రీ మరియు భాగస్వామి జియాంగ్ జిన్యు నిష్క్రమించారు. రౌండ్ ఆఫ్ 16 పోరులో రెండో సీడ్ మార్సెలో అరెవాలో మరియు షుయ్ జాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో, ఇండోచైనీస్ జంట 6-7(6), 3-6తో వరుస సెట్లలో ఓడిపోయింది. భాంబ్రీ మరియు జియాంగ్ పోటీకి అత్యుత్తమ ఆరంభాలను ఇవ్వలేదు. వారు కేవలం మూడవ గేమ్‌లోనే నిష్క్రమించి ప్రత్యర్థులకు 1-3 ఆధిక్యాన్ని ఇచ్చారు. అయితే ఏడో గేమ్‌లో తిరిగి విజయం సాధించి మొదటి సెట్‌లో లోటును 3-4కి తగ్గించారు. దాని నుండి ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకున్నారు. భాంబ్రీ మరియు జియాంగ్ మొదటి పాయింట్ గెలుచుకోవడం ద్వారా టైబ్రేక్‌ను బాగా ప్రారంభించారు. అయితే, అరెవాలో మరియు షుయ్ త్వరలోనే 3-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లి వారిని నిరాశపరిచారు. ఇండోచైనీస్ జంట 6-6తో సమం చేయడానికి తిరిగి పోరాడింది. కానీ బ్యాక్‌హ్యాండ్ తప్పిదం కారణంగా కీలకమైన సెట్ పాయింట్‌ను వదులుకుంది. రెండో సెట్‌లో భాంబ్రీ మరియు జియాంగ్ తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నారు, కానీ ఐదవ గేమ్‌లో వారు విఫలం అయ్యారు. ఈ ఇరువిరి జోడీ అరెవాలో-షుయ్‌లను ఇబ్బంది పెట్టడంలో విఫలమయ్యారు, దీంతో వారు తమ సర్వీస్‌లను నిలబెట్టుకున్నారు. తొమ్మిదవ గేమ్‌లో మరోసారి బ్రేక్ చేశారు. గంటా 24 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో అందరూ క్వార్టర్ ఫైనల్స్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు.




# టెస్టుల్లో సిక్సర్ల కింగ్స్
## బ్యాటర్ల ధనా ధన్ బాదుడు.. టాప్ 5లో చోటు దక్కని భారత్




**న్యూఢిల్లీ:** టీ20లు వచ్చిన తర్వాత టెస్ట్ క్రికెట్ కాస్త వెనుకబడింది. కానీ ఆటగాళ్లు కూడా కాలనుగుణంగా ఆటతీరు మార్చుకున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ టెస్ట్ క్రికెట ఆటను వన్డే, టీ20లతో పోలిస్తే తక్కువ మంది చూస్తుంటారు. కానీ ఇప్పుడు కాలం మారింది. టీ20ల ప్రభావం టెస్టుల మీద పడింది. ఇప్పుడు బ్యాటర్లు టెస్టుల్లో కూడా సిక్సర్లతో దుమ్ములేపుతున్నారు. వేగంగా పరుగులు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో క్రికెట్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు బాదిన పలువురు బ్యాటర్లు ఉన్నారు. సిక్సర్ల టాప్ 5 హీరోల్లో బెన్ స్టోక్స్ 133 సిక్సర్లతో అగ్రస్థానంలో నిలవగా, మెకల్లమ్, గిల్‌క్రిస్ట్, సౌథీ, గేల్ వంటి దిగ్గజాలు కూడా ఈ జాబితాలో ఉన్నారు. ఇంగ్లాండ్ టెస్ట్ టీమ్ ప్రస్తుత కెప్టెన్ బెన్ స్టోక్స్ అగ్రెసివ్ క్రికెట్‌కు సరికొత్త ఉదాహరణ. అతను ఇప్పటివరకు 112 టెస్టుల్లో 201 ఇన్నింగ్స్‌లలో 6781 పరుగులు చేశాడు. ఇందులో ఏకంగా 133 సిక్సర్లు ఉన్నాయి. ఈ సంఖ్యతో స్టోక్స్ టెస్ట్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. అతని బ్యాటింగ్ సగటు 35.31 కాగా, 786 ఫోర్లు కొట్టాడు. స్టోక్స్ బ్యాటింగ్ స్టైల్ ఇంగ్లాండ్ బజ్‌బాల్ ఆటతీరులో ముఖ్యమైన భాగం. అలాగే న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, ప్రస్తుతం ఇంగ్లాండ్ టెస్ట్ కోచ్‌గా ఉన్న బ్రెండన్ మెకల్లమ్, టెస్ట్ క్రికెట్‌లో దూకుడు ఆటకు పునాది వేశాడు. అతను 101 టెస్ట్ మ్యాచ్‌లలో 6453 పరుగులు చేశాడు. అందులో 107 సిక్సర్లు ఉన్నాయి. అతని బ్యాటింగ్ సగటు 38.64 కాగా, 776 ఫోర్లు బాదాడు. బజ్‌బాల్ స్టైల్‌కు ఆద్యుడి చెబుతారు. మెకల్లమ్ దూకుడు ఆటతీరు టెస్ట్ క్రికెట్ పాత ఆలోచనలను మార్చేసింది. మూడో స్థానంలో ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ ఉన్నారు. అతను బ్యాట్‌తో కూడా ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించాడు. 96 టెస్ట్ మ్యాచ్‌లలో 137 ఇన్నింగ్స్‌లలో 5570 పరుగులు చేశాడు. అతని ఖాతాలో 100 సిక్సర్లు ఉన్నాయి. అతని సగటు 47.60 కాగా, 677 ఫోర్లు కొట్టాడు. ఇక న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ టిమ్ సౌథీ, బ్యాటింగ్‌లోనూ చాలా ప్రమాదకరం. అతను 107 టెస్టులలో 2245 పరుగులు చేసి, 98 సిక్సర్లు బాదాడు. అతని బ్యాటింగ్ సగటు 15.48 మాత్రమే అయినా, లోయర్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు చేయడంలో అతన్ని మించిన వాళ్ళు లేరు. కాగా యూనివర్స్ బాస్ క్రిస్ గేల్ కేవలం టీ20 క్రికెట్‌లో మాత్రమే కాదు టెస్టుల్లోనూ సిక్సర్ల కింగ్. అతను 103 టెస్టుల్లో 182 ఇన్నింగ్స్‌లలో 7214 పరుగులు చేశాడు. అందులో 98 సిక్సర్లు ఉన్నాయి. అతని సగటు 42.18 కాగా, 1046 ఫోర్లు కొట్టాడు. గేల్ స్టైల్ టెస్ట్ క్రికెట్‌లో కూడా టీ20 లాగే ప్రమాదకరంగా ఉండేది.

# నార్వే చెస్ టోర్నీ విజేతగా కార్ల్‌సెన్
## గుకేష్ సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** నార్వే గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో సూపర్ యునైటెడ్ టైటిల్‌ను మాగ్నస్ కార్ల్‌సెన్ కైవసం చేసుకున్నాడు. ప్రస్తుత ప్రంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ సంచలన ఓటమితో మూడో స్థానానికి పరిమితమయ్యాడు. ప్రపంచ నంబర్ 1 మాగ్నస్ కార్ల్సెన్ వేగవంతమైన చెస్ ఫార్మాట్లలో తన ఆధిపత్యాన్ని పునరుద్ఘాటించాడు. సూపర్ యునైటెడ్ రాపిడ్ బ్లిట్జ్ క్రొయేషియా 2025 ను ఒక రౌండ్ మిగిలి ఉండగానే గెలుచుకున్నాడు.

నార్వేజియన్ 22.5 పాయింట్లతో ముగించాడు, వెస్లీ సో (20 పాయింట్లు), ముందు టైటిల్‌ను ఖాయం చేసుకున్న భారత్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ 19.5 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచాడు. ప్రతిష్టాత్మకమైన గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరిగిన ఈ ఈవెంట్‌లో ఎలైట్ ఆటగాళ్ల బలమైన ఫీల్డ్ ఉంది. బ్లిట్జ్ విభాగంలో కార్ల్‌సెన్ ప్రదర్శన ఒప్పందాన్ని ఖరారు చేసినప్పటికీ, వేగవంతమైన రౌండ్లలో గుకేష్ అద్భుతమైన ప్రదర్శన మొదట్లో దృష్టిని ఆకర్షించింది. భారత్‌కు చెందిన గుకేష్ టోర్నమెంట్‌ను అద్వితీయంగా ప్రారంభించాడు. తొమ్మిది రౌండ్ల రాపిడ్ విభాగంలో, అతను అద్భుతమైన 14 పాయింట్లు సాధించి, ప్రారంభంలోనే ఆధిక్యంలోకి వెళ్లి మిగిలిన ఫీల్డ్‌పై ఒత్తిడి పెంచాడు.

అయితే, బ్లిట్జ్ విభాగం సవాలుతో కూడుకున్నది కావడంతో పాటు, హై స్పీడ్ ఫార్మాట్‌లో లయను కనుగొనడంలో ఇబ్బంది పడుతున్న గుకేష్ మొదటి తొమ్మిది బ్లిట్జ్ గేమ్‌లలో కేవలం 1.5 పాయింట్లు మాత్రమే సాధించగలిగాడు.

బ్లిట్జ్ యొక్క రిటర్న్ లెగ్‌లో కోలుకున్నప్పటికీ, కార్ల్‌సెన్ యొక్క స్థిరత్వాన్ని అందుకోలేకపోయాడు. అతను అలిరెజా ఫిరోజ్జా (ఫ్రాన్స్), జాన్‌క్రిజ్‌టోఫ్ డుడా (పోలాండ్) కంటే సగం పాయింట్ ముందంజలో ఉండి ఇద్దరూ 19 పరుగులు చేశారు. రాపిడ్ సెగ్మెంట్ తర్వాత గుకేష్ కంటే నాలుగు పాయింట్లు వెనుకబడిన కార్ల్‌సెన్ శక్తివంతమైన పునరాగమనం చేశాడు. బ్లిట్జ్ మొదటి అర్ధభాగంలో అతను 7.5/9 స్కోరు సాధించాడు. రెండవ అర్ధభాగంలో 4/8 జోడించి, చివరి రౌండ్‌కు ముందు టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు.

# యాంటీ అమెరికా అయితే 10% సుంకాలు
## బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక





**వాషింగ్టన్, జులై 7:** బ్రిక్స్ కూటమిలోని దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. అమెరికా వ్యతిరేక విధానాలను అనుసరించే ఏ దేశంపైనైనా సరే 10 శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తామని, ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం బ్రెజిల్‌లో బ్రిక్స్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధా న్యం సంతరించుకుంది. ఈ సదస్సులో భారత ప్రధాన మంత్రితో పాటు ఇతర సభ్య దేశాల నేతలు అమెరికా సుంకాల విధానాన్ని పరోక్షంగా ప్రస్తావించిన నేపథ్యంలో ట్రంప్ స్పందన వచ్చింది. ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలపై చైనా స్పందించింది. సుంకాల యుద్ధంలో ఎవరూ విజేతలు గా నిలవరని, తాము ఘర్షణను కోరు కోవడం లేదని పునరుద్ఘాటించింది. రక్షణాత్మక వాణిజ్య వైఖరి సరైంది కాద ని చైనా పేర్కొంది. గతంలో అమెరికాచైనాల మధ్య తీవ్రమైన వాణిజ్యయుద్ధం నడిచినప్పటికీ, ఆ తర్వాత కుదిరిన ఒప్పందంతో అది తాత్కాలికంగా సద్దు మణిగింది. కాగా, బ్రిక్స్ కూటమిపై ట్రంప్ ఇటీవల కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌తో ఆడుకోవాలని చూస్తే, వాణిజ్యపరంగా వారిని దెబ్బతీస్తానని బెదిరించారు. నా హెచ్చరికలతోనే బ్రిక్స్ ప్రతిపాదన బలహీనపడింది. ఒకవేళ వారు మాకు వ్యతిరేకంగా ముందుకెళితే 100 శాతం సుంకాలు వేస్తాను. అప్పుడు నా దగ్గరకే వచ్చి వేడుకుంటారు అని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ప్రారంభమైన బ్రిక్స్ కూటమిలో ఇటీవల ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలు కూడా సభ్య దేశాలుగా చేరాయి.

# కల్యాణ్ జ్యుయెలర్స్ నికరరాబడుల్లో 31% వృద్ధి



**ముంబై, జూలై 7:** ఆభరణాల విక్రేత కల్యాణ్ జ్యుయెలర్స్ నిరకర రాబడులు 31 శాతం పెరిగాయి. బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు, మరోవైపు భౌగోళిక ఉద్రిక్తతలున్నప్పటికీ కంపెనీ సమిష్టి నికరరాబడులు 5557.63 కోట్లుగా ప్రకటిం చింది. ఈ ఆర్థికసంవత్సరం ఏప్రిల్-జూన్‌త్రైమాసికం లో భారీ లాభాలు ఆర్జించినట్లు నిపుణులు చెపుతు న్నారు. భారత్‌లో సంస్థ కార్యకలాపాలు 31శాతం పెరిగాయి. రాబడుల వృద్ధికూడా పెరిగిందని స్టాక్ ఎక్ఛేంజీలకు నివేదిక ఇచ్చింది. ఇక అంతర్జాతీయ లావాదేవీల ద్వారా కూడా రాబడులు 31శాతం పెరిగాయి. మొత్తం రాబడుల్లో 15శాతం గ్లోబల్ రెవెన్యూయే ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. మధ్య ప్రాచ్య దేశాల నుంచి 26శాతం రాబడులు రాగా డిజి టల్ ప్లాట్‌ఫామ్ పరంగా చూస్తే 67శాతం రాబడులు పెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. ఈ త్రైమాసికంలో కంపెనీ 10 షోరూమ్‌లు ప్రారంభించింది. ఎనిమిది కేండీర్‌షోరూమ్‌లు ఉన్నాయి. అమెరికాలో కూడా కల్యాణ్ షోరూమ్‌ను ప్రారంభిం చింది. కంపె నీ భవిష్య త్తులో 170కి పైగా కొత్త షోరూమ్‌లు ప్రారంభిం చాలని నిర్ణయిం చింది. కల్యాణ్‌బ్రాండ్‌మీద కేండీర్ ఫార్మాట్స్‌లో కూడా భారత్, విదేశాల్లోను విస్తరించాలని నిర్ణయించింది. జూన్ 30వ తేదీ నాటికి కంపెనీ వివిధ బ్రాండ్లను ప్రవేశ పెట్టి 406 షోరూమ్‌లు ప్రారంభించింది.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు




**ముంబై, జులై 7:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గాముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో మన మార్కెట్లు కూడా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడాయి. రిలయన్స్, ఎఫ్ఎంసీజీ షేర్లు రాణించగా.. మీడియా, డిఫెన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 83,398.08 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,432.89) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,262.23 83,516.82 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 9 పాయింట్ల లాభంతో 83,442.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25,461 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.88గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ట్రెంట్, రిలయన్స్, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బీఈఎల్, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, ఎటర్నల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.72 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,318 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.